



epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com






సంపుటి : 17 సంచిక : 178 | 06-08-2025 బుధవారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | హైదరాబాద్ | వరంగల్ | మహబూబ్‌నగర్ | పేజీలు : 12 వెల : రూ.1.00




## కాటన్ మాదిరి కేసీఆర్ చరిత్రలో నిలిచిపోతారు

- సర్ ఆర్థర్ కాటన్ తో కేసీఆర్ ను పోల్చిన హరీశ్ రావు
- తెలంగాణకు కాళేశ్వరం గుండెకాయ వంటిదని వ్యాఖ్య
- రాష్ట్ర భవిష్యత్తు కోసం కాళేశ్వరం, మల్లన్నసాగర్ వంటి ప్రాజెక్టులను కేసీఆర్ నిర్మించారని కితాబు

బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు రాజమండ్రి వద్ద గోదావరి నదిపై ధవళేశ్వరం బ్యారేజీని కట్టి ఉభయ గోదావరి జిల్లాల ప్రజల గుండెల్లో నిలిచిపోయిన సర్ ఆర్థర్ కాటన్ తో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను పోల్చారు. కాటన్ మాదిరిగానే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిన కేసీఆర్ కూడా తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఆయన అన్నారు.

వార్త 2లో

# బిఆర్ఎస్ నేతలు ఇంకెంతకాలం ప్రజలను మభ్యపెడతారు

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్:

కాళేశ్వరం ప్రాజెక్టుకు గత కేబినెట్ అనుమతులు ఉన్నాయనడం అవాస్తవం అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బిఆర్ఎస్ నేతలు ఇంకెంతకాలం ప్రజలను మభ్య పెడతారని అన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ఏం చేశారన్నది కమిషన్ నివేదికలో స్పష్టంగా ఉందని తెలియజేశారు.

బిఆర్ ఎస్ నేతలు కంగారుపడొద్దని అన్ని వివరాలు అసెంబ్లీ ముందు ఉంచుతామని చెప్పారు. కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చ తర్వాత నిర్ణయం తీసుకుంటామని సూచించారు. కాళేశ్వరం పేరుతో కెసిఆర్ డబ్బు దోచుకున్నారని ముందే చెప్పామని అన్నారు. పిసి ఘోష్ నివేదికలో అన్నీ వివరంగా ఉన్నాయని, దోచుకున్న డబ్బుతో మళ్లీ బిఆర్ఎస్ నేతలు జనంలోకి వస్తారని పేర్కొన్నారు. డబ్బు తీసుకుని బిఆర్ఎస్ చెంపలు చెళ్లుమనిపించాలని పొంగులేటి స్పష్టం చేశారు.



## జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ కన్నుమూత

కాంగ్రెస్, జనతాదళ్, బిజేపీ వంటి పలు పార్టీలలో పనిచేసిన అనుభవం

వార్త 2లో



## అసలైన భారతీయుడెవరో న్యాయమూర్తులు నిర్ణయించరు

రాహుల్ గాంధీపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో స్పందన
ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్ష నాయకుడి విధి అని స్పష్టీకరణ
తన సోదరుడికి సైన్యం పట్ల అత్యంత గౌరవం ఉందని వెల్లడి
పార్లమెంటు వద్ద మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేసిన ప్రియాంక

వార్త 2లో

## ఆ పథకాన్ని ముట్టుకుంటే ముఖ్యమంత్రి మసే

హైదరాబాద్‌లో ఉచిత తాగునీటి పథకానికి పాతరేయాలని చూడటం సీఎం మూర?త్వానికి పరాకాష్ఠ అన్న కేటీఆర్
మహానగరంలోని కోటి 20 లక్షల మంది ప్రజలు చరిత్రలో కాంగ్రెస్ పార్టీని, సీఎం రేవంత్‌ను క్షమించరని వ్యాఖ్య
ఇప్పటికే హైడ్రా వంటి దిక్కుమాలిన నిర్ణయాలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీశారని మండిపాటు

వార్త 2లో



## పార్లమెంట్ ఆవరణలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల ఆందోళన

ఢిల్లీ,

పార్లమెంట్ ఆవరణలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు ఇవాళ(మంగళవారం) ఆందోళన చేపట్టారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే లోక్‌సభలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు వాయిదా తీర్మానాలు ఇచ్చారు. మరోవైపు.. కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి భారీగా చేరుకుంటున్నారు. ఇప్పటికే ఢిల్లీకి కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ కీలక నేతలు చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడారు. చిత్తశుద్ధి ఉంటే కేంద్రప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవద్దని సూచించారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లకు మద్దతు తెలిపారని డిమాండ్ చేశారు. ఇప్పటికే ముసాయిదాని రాష్ట్రపతికి పంపించామని స్పష్టం చేశారు మంత్రి వాకిటి శ్రీహరి.



వార్త 2లో

## ఆయన ఏదో ఒకటి చెబుతూనే ఉంటారు..

రాహుల్‌పై మోదీ విసుర్లు

# కాటన్ మాదిరి కేసీఆర్ చరిత్రలో నిలిచిపోతారు

**సర్ ఆర్థర్ కాటన్ తో కేసీఆర్ ను పోల్చిన హరీశ్ రావు**

**తెలంగాణకు కాళేశ్వరం గుండెకాయ వంటిదని వ్యాఖ్య**

**రాష్ట్ర భవిష్యత్తు కోసం కాళేశ్వరం, మల్లన్నసాగర్ వంటి ప్రాజెక్టులను కేసీఆర్ నిర్మించారని కితాబు**

హైద్రాబాద్ అక్షరకలం ప్రతినిధి

బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు రాజమండ్రి వద్ద గోదావరి నదిపై ధవళేశ్వరం బ్యారేజీని కట్టి ఉభయ గోదావరి జిల్లాల ప్రజల గుండెల్లో నిలిచిపోయిన సర్ ఆర్థర్ కాటన్ తో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను పోల్చారు. కాటన్ మాదిరిగానే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిన కేసీఆర్ కూడా తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఆయన అన్నారు. హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బ్రిటీష్ పాలనా కాలంలో ధవళేశ్వరం బ్యారేజీని ఆర్థర్ కాటన్ నిర్మిం చారని... రైతులకు మేలు జరగాలనే ఆకాంక్షతో ఉభయ గోదావరి జిల్లాలనకు సాగునీరు అందించారని హరీశ్ కొనియాడారు. ఆ రోజుల్లోనే కాటన్ మీద బ్రిటీష్ ప్రభుత్వం హెమింగ్టన్ కమిషన్ వేసిందని... ఆ కమిషన్ కాటన్ ను 900 ప్రశ్నలు అడిగి ఎంతో కాలం వేధించిందని తెలిపారు. అయినా, చివరకు ఏం జరిగింది? ఇప్పటికీ గోదావరి జిల్లాల ప్రజల గుండెల్లో కాటన్ నిలిచిపోయారని అన్నారు. అదే విధంగా చరిత్ర పుటల్లో తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ నిలిచిపోతారని చెప్పారు. తెలంగాణకు కాళేశ్వరం గుండెకాయ వంటిదని హరీశ్ అన్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి రేవంత్ కు కూడా తెలుసని వ్యాఖ్యానించారు. మల్లన్నసాగర్ నుంచి మూసీలోకి నీళ్లు పోయడానికి రూ. 6 వేల కోట్ల కు టెండర్లను ఫైనల్ చేశారని... మల్లన్నసాగర్ కాళేశ్వరంలో భాగమేనని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్ కోసం కాళేశ్వరం, మల్లన్నసాగర్ లాంటి ప్రాజెక్టును కేసీఆర్ నిర్మించారని చెప్పారు.

# ఆ పథకాన్ని ముట్టుకుంటే ముఖ్యమంత్రి మసే

**హైదరాబాద్‌లో ఉచిత తాగునీటి పథకానికి పాతరేయాలని చూడటం సీఎం మూర?త్వానికి పరాకాష్ఠ అన్న కేటీఆర్**

**మహానగరంలోని కోటి 20 లక్షల మంది ప్రజలు చరిత్రలో కాంగ్రెస్ పార్టీని, సీఎం రేవంత్‌ను క్షమించరని వ్యాఖ్య**

**ఇప్పటికే హైడ్రా వంటి దిక్కుమాలిన నిర్ణయాలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీశారని మండిపాటు**

హైద్రాబాద్ అక్షరకలం ప్రతినిధి

రైతులకు సాగునీరు ఇవ్వలేని ఈ పనికి మాలిన సర్కారు.. ఇప్పుడు హైదరాబాద్‌లో ఉచిత తాగునీటి పథకానికి కూడా పాతరేయాలని చూడటం ముఖ్యమంత్రి మూర?త్వానికి పరాకాష్ఠ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. హైదరాబాద్ వాసులకు కేసీఆర్ అందించిన ఉచిత మంచినీటి పథకాన్ని ముట్టుకుంటే ముఖ్యమంత్రి మసే అని హెచ్చరించారు. మహానగరంలోని కోటి 20 లక్షల మంది ప్రజలు చరిత్రలో కాంగ్రెస్ పార్టీని, సీఎం రేవంత్‌ను క్షమించరన్నారు. ఇప్పటికే హైడ్రా వంటి దిక్కుమాలిన నిర్ణయాలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీశారని 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు."హైదరాబాద్ వాసులకు కేసీఆర్ అందించిన ఉచిత మంచినీటి పథకాన్ని ముట్టుకుంటే ముఖ్యమంత్రి మసే..!. 20 నెలలు కావస్తున్నా.. ఇచ్చిన 420 హామీలు అమలు చేయలేక ఇప్పటికే చేతులెత్తేసిన రేవంత్ రెడ్డి మహాపాపాన్ని మూటగట్టుకున్నారు. బీఆర్ఎస్ అమలు చేసిన పథకాలకు కూడా ఉరివేస్తే.. మహానగరంలోని కోటి 20 లక్షల మంది ప్రజలు చరిత్రలో కాంగ్రెస్ పార్టీని, సీఎం రేవంత్‌ను క్షమించరు. రైతులకు సాగునీరు ఇవ్వలేని ఈ దద్దమ్మ సర్కారు, ఇప్పుడు హైదరాబాద్ లో ఉచిత తాగునీటి పథకానికి కూడా పాతరేయాలని చూడటం ముఖ్యమంత్రి మూర?త్వానికి పరాకాష్ఠ.ఇప్పటికే హైడ్రా వంటి దిక్కుమాలిన నిర్ణయాలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసి తీరని నష్టాన్ని కలిగించారు. బీఆర్ఎస్ ప్రగతి ప్రస్థానంలో రెప్పపాటు కూడా కరెంటు కోతలు లేని రాజధాని వాసులకు మళ్లీ కరెంట్ కష్టాలను పరిచయం చేసిన పాపం రేవంత్‌దే. ఓవైపు అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థ, ఇంకోవైపు వర్షాలకు దెబ్బతిన్న రోడ్లతో ప్రజలు అవస్థలు పడుతుంటే.. ఫ్రీ వాటర్ స్కీమ్‌కు కూడా గండికొట్టాలని చూస్తున్న రేవంత్‌కు కర్రు కాల్చి పెట్టేందుకు హైదరాబాద్ ప్రజలు సిద్ధంగా ఉన్నారు" అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

# జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ కన్నుమూత

**ఆర్టికల్ 370 రద్దు సమయంలో జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా బాధ్యతలు**

**బీహార్, గోవా, మేఘాలయ రాష్ట్రాలకు కూడా గవర్నర్‌గా సేవలు**

**సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎమ్మెల్యే, ఎంపీ, కేంద్ర మంత్రిగా పదవులు**

**రైతు సమస్యలపై ప్రభుత్వ విధానాలను తరచూ విమర్శించిన నేత**

**కాంగ్రెస్, జనతాదళ్, బీజేపీ వంటి పలు పార్టీలలో పనిచేసిన అనుభవం**

హైద్రాబాద్ అక్షరకలం ప్రతినిధి

భారత రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న సీనియర్ నేత, జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ (79) కన్నుమూశారు. దేశ రాజకీయాల్లో అత్యంత కీలకమైన ఆర్టికల్ 370 రద్దు సమయంలో జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా పనిచేసి ఆయన దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచారు. సుదీర్ఘకాలం అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం తుదిశ్వాస విడిచారు. 1960వ దశకంలో మీరట్‌లో విద్యార్థి నాయకుడిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన సత్యపాల్ మాలిక్, ఐదు దశాబ్దాలకు పైగా ప్రజా జీవితంలోనే గడిపారు. ఉత్తరప్రదేశ్ శాసనసభ్యుడిగా, లోక్‌సభ, రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, పర్యాటక శాఖ సహాయ మంత్రిగా పలు ఉన్నత పదవులను ఆయన అలంకరించారు. కాంగ్రెస్, జనతాదళ్, బీజేపీ వంటి పలు పార్టీలలో పనిచేసిన అనుభవం ఆయన సొంతం. ఆయన రాజకీయ జీవితంలో అత్యంత కీలకమైన, చరిత్రాత్మకమైన ఘట్టం జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా పనిచేసిన కాలం. 2018 నుంచి 2019 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగారు. ఆయన హయాంలోనే కేంద్ర ప్రభుత్వం కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసింది. కశ్మీర్‌కు గవర్నర్‌గా వ్యవహరించిన సమయంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు ప్రశంసలతో పాటు విమర్శలను కూడా ఎదుర్కొన్నాయి.జమ్మూకశ్మీర్‌తో పాటు బీహార్, గోవా, మేఘాలయ రాష్ట్రాలకు కూడా సత్యపాల్ మాలిక్ గవర్నర్‌గా సేవలందించారు. గవర్నర్ పదవిలో ఉన్నప్పటికీ, ప్రజా సమస్యలపై, ముఖ్యంగా రైతుల హక్కుల కోసం ఆయన తరచూ గళం విప్పేవారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను బహిరంగంగా విమర్శించి సంచలనం సృష్టించారు. తన చివరి రోజుల్లో క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ, సామాజిక న్యాయం, బడుగు వర్గాల సంక్షేమంపై తన అభిప్రాయాలను వెల్లడిస్తూ మార్గనిర్దేశం చేశారు.

# ఆయన ఏదో ఒకటి చెబుతూనే ఉంటారు..

**రాహుల్‌పై మోదీ విసుర్లు**

న్యూఢిల్లీ:

ఆపరేషన్ సిందూర్ పై విపక్షాలు పార్లమెంటులో చర్చకు పట్టుబట్టి ప్రభుత్వం ముందు నిలవలేక పోయాయని, ఇప్పుడు ఎందుకు చర్చకు పట్టుబట్టామా అని విచారిస్తున్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీవిమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు వచ్చిన ఒకే ఒక్క అవకాశాన్ని కూడా వినియోగించుకో లేకపోయాయని అన్నారు. లోక్‌సభలో కాంగ్రెస్ విపక్ష నేత రాహుల్ గాంధీపై కూడా వ్యంగ్యాస్త్రాలు విసిరారు. మంగళవారంనాడిక్కడ జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మోదీ మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్‌పై విపక్షాలు ప్రశ్నలు లేవెనత్తి తమకు తామే హాని చేసుకున్నాయని ప్రధాని విమర్శించారు. 'ఇలాంటి మరిన్ని డిబేట్లకు వాళ్లు డిమాండ్ చేయాలని కోరుకుం టున్నాం. వాటిని సంతోషంగా అంగీకరించేందుకు సిద్ధంగా ఉన్నాం. యావత్ ప్రపంచం వారి ప్రవర్తనను చూసింది. వాళ్లను మనమెందుకు ఆపాలి?' అని మోదీ అన్నారు. కాంగ్రెస్ విపక్ష నేత రాహుల్‌పై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, ఆయన ఎదో ఒకటి చెబుతూనే ఉంటారని, తరచు ఆయన చిన్నపిల్లవాడిలా ప్రవర్తిస్తుంటారని, సుప్రీంకోర్టు కూడా ఆయనను మందలించిందని అన్నారు. యావద్దేశం వాళ్ల ఆకతాయితనాన్ని చూసిందన్నారు. కేంద్ర హెూం మంత్రి అమిత్‌షాను ప్రశంసిస్తూ, ఇప్పుడు ఆయన సుదీర్ఘకాలంగా హెూం మంత్రిగా పని చేసిన క్రెడిట్ దక్కించుకున్నారని అన్నారు.

# ఢిల్లీలో టెస్లా రెండో అడుగు

**ముంబై తరవాత ప్రారంభానికి సిద్ధం**

**11న షోరూమ్ ప్రారంభానికి నిర్ణయం**



న్యూఢిల్లీ,

ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా అధికారికంగా భారత విపణిలోకి ఇప్పటికే అడుగుపెట్టింది. గత నెల 15న ఆర్థిక రాజధాని ముంబైలో తొలి షోరూంను ప్రారంభించింది. ఇప్పుడు రెండో షోరూం ప్రారంభించేందుకు టెస్లా సిద్ధమైంది. దేశ రాజధాని ఢిల్లీలో తన సెకెండ్ షోరూంను తెరవబోతోంది. ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో గల ఏరోసిటీలో టెస్లా సెకెండ్ షోరూంను ఆగస్టు 11న ఓపెన్ చేయనుంది. ఇందుకోసం వరల్డ్‌మార్క్ కాంప్లెక్స్‌లో 4,000 చదరపు అడుగుల స్థలాన్ని టెస్లా సంస్థ లీజుకు తీసుకున్నట్లు– తెలిసింది. పార్కింగ్ సౌకర్యాలుగల ఈ షోరూమ్ స్పేస్‌కుగాను నెలకు రూ.25 లక్షలు అద్దె చెల్లించేలా కంపెనీ ప్రమోటర్, బిలియనీర్ ఎలాన్ మస్క్ డీల్ కుదుర్చుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన 'వై' మోడల్ కార్లను భారత వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది . రియర్‌వీల్ డ్రైవ్, లాంగ్–రేంజ్ వేరియంట్ కార్లను అమ్మకానికి ఉంచింది. ఇక ధర విషయానికొస్తే రియర్–వీల్ డ్రైవ్ (ఆర్‌డబ్ల్యూడీ) వేరియంట్ ధర రూ. 59.89 లక్షలు, లాంగ్–రేంజ్ ఆర్‌డబ్ల్యూడీ వేరియంట్ ధరను రూ. 67.89 లక్షలుగా నిర్ణయించింది. వీటి 'ఆన్ రోడ్' ధరల్ని పరిశీలిస్తే ఆన్–రోడ్ ధర రూ. 61.07 లక్షలుకాగా, లాంగ్–రేంజ్ వెర్షన్ ఆన్–రోడ్ ధర రూ. 69.15 లక్షలుగా ఉంది. టెస్లా అధికారిక వెబ్‌సైట్ ప్రకారం, ఇందులో 18 శాతం జీఎస్టీతో సహా రూ. 50,000 అడ్మినిస్ట్రేషన్, సర్వీస్ ఫీజు కూడా ఉంటుంది. ఈ వాహనాలు చైనాలోని టెస్లా షాంఘై గిగాఫ్యాక్టరీ నుంచి దిగుమతయ్యాయి. ఈ వై మోడల్ వేరియంట్ ధరలు అమెరికాలో 44,990 డాలర్లు (భారత కరెన్సీలో రూ.38.63 లక్షలు), చైనాలో 2,63,500 యువాన్ (రూ.31.57 లక్షలు), జర్మనీలో 45,970 యూరోలు (రూ.46.09 లక్షలు)గా ఉన్నాయి. వీటితో పోలిస్తే భారత్‌లోనే ఈ వై మోడల్ ధరలు అధికం కావడం గమనార్హం. దిగుమతి సుంకం, లాజిస్టిక్స్ ఖర్చులే ధర పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది. అయితే టెస్లాపై మోజుతో ఇండియాలో మార్కెట్ పెరుగుతందని భావిస్తున్నారు.

# అసలైన భారతీయుడెవరో న్యాయమూర్తులు నిర్ణయించరు

**రాహుల్ గాంధీపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో స్పందన**

**ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్ష నాయకుడి విధి అని స్పష్టీకరణ**

**తన సోదరుడికి సైన్యం పట్ల అత్యంత గౌరవం ఉందని వెల్లడి**

**పార్లమెంటు వద్ద మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేసిన ప్రియాంక**

హైద్రాబాద్ అక్షరకలం ప్రతినిధి

ఎవరు నిజమైన భారతీయుడో, ఎవరు కాదో న్యాయమూర్తులు నిర్ణయించరని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా స్పష్టం చేశారు. తన సోదరుడు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై సుప్రీంకోర్టు ఇటీవల చేసిన కొన్ని వ్యాఖ్యల నేపథ్యంలో ఆమె మంగళవారం ఈ విధంగా స్పందించారు. పార్లమెంటు వద్ద మీడియాతో మాట్లాడుతూ, న్యాయవ్యవస్థపై తమకు పూర్తి గౌరవం ఉందని, అయితే పౌరుల దేశభక్తిని నిర్ధారించడం వారి పని కాదని ఆమె అన్నారు.భారత సాయుధ బలగాల గురించి రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల పట్ల సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చిన కొద్దిసేపటికే ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ, "ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్ష నాయకుడి ప్రాథమిక బాధ్యత. మా సోదరుడు రాహుల్ గాంధీ సైన్యానికి వ్యతిరేకంగా ఎన్నడూ మాట్లాడరు. ఆయనకు మన సైన్యం పట్ల అపారమైన గౌరవం, అభిమానం ఉన్నాయి" అని వివరించారు.ప్రతిపక్ష నాయకుల దేశభక్తిని, పౌరసత్వాన్ని ప్రశ్నించే ప్రయత్నాలను ప్రియాంక గాంధీ తీవ్రంగా ఖండించారు. గతంలో 2019లో రాహుల్ గాంధీ పౌరసత్వంపై ప్రశ్నలు తలెత్తినప్పుడు కూడా ఆమె ఇదే విధంగా గట్టిగా బదులిచ్చారు. "రాహుల్ గాంధీ భారతీయుడని దేశం మొత్తానికీ తెలుసు. ఆయన ఇక్కడే పుట్టారు, అందరి కళ్ల ముందే పెరిగారు. ఈ విషయం అందరికీ తెలిసినప్పుడు, ఇటువంటి అర్థం లేని ఆరోపణలు ఎందుకు?" అని ఆమె గతంలో వ్యాఖ్యానించారు.



# అద్వానీ రికార్డు బ్రేక్

**అత్యధిక కాలం హోంమంత్రిగా అమిత్ షా**

న్యూఢిల్లీ,

ప్రధానిగా నరేంద్ర మోదీ సరికొత్త రికార్డు సృష్టించినట్లుగానే హోంమంత్రి అమిత్ షా కూడా అత్యధిక కాలం హోంమంత్రిగా రికార్డు సృష్టించారు. ఎలాంటి విరామం లేకుండా దేశాన్ని అత్యధిక కాలం పరిపాలించిన ప్రధానిగా ఇందిరాగాంధీ పేరుతో ఉన్న రికార్డును మోదీ అధిగమించారు. మోదీ తర్వాత కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం ఓ సరికొత్త రికార్డు నెలకొల్పారు. దేశ చరిత్రలో ఎవరూ అందుకోలేని అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. దేశ చరిత్రలో అత్యధిక కాలం కేంద్ర హోంశాఖమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా అమిత్ షా రికార్డు సృష్టించారు. ఇప్పటి వరకూ బీజేపీ అగ్ర నేత ఎల్‌కే అద్వానీ పేరుతో ఉన్న రికార్డును షా బద్దలు కొట్టారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక అమిత్‌షా 2019లో కేంద్ర హోంమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఐదు సంవత్సరాల పదవీకాలాన్ని పూర్తి చేశారు. ఆ తర్వాత జరిగిన 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చింది. దీంతో షా వరుసగా రెండోసారి కూడా హోంశాఖ బాధ్యతలనే స్వీకరించారు. దీంతో షా హోంశాఖ బాధ్యతలు స్వీకరించి నేటికి ఆరు సంవత్సరాల 64 రోజులు పూర్తైంది. దాదాపు 2,194 రోజులు అమిత్ షా హోం మంత్రిగా పనిచేశారు. ఫలితంగా బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ రికార్డును షా బద్దలుకొట్టారు. 1998–1999, 1999–2004 వరకూ ఎల్‌కే అద్వానీకేంద్ర హోం మంత్రిగా పనిచేసిన విషయం తెలిసిందే. దాదాపు 2,193 రోజులు అద్వానీ ఈ పదవిలో కొనసాగారు. ఇప్పుడు ఆ రికార్డును అమిత్ షా అధిగమించారు. ఇక కేంద్ర హోం శాఖ బాధ్యతలు చేపట్టిన అమిత్ షా తన హయాంలో ఆర్టికల్ 370 రద్దు సహా అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా దేశంలో నక్సలిజంపై ఉక్కుపాదం మోపుతున్నారు. మొత్తంగా అమిత్ షా అత్యధిక కాలం హోంమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా రికార్డు నెలకొల్పాలరు.

# గువ్వలా ఎగిరిపోతున్న బాలరాజు

**కాంగ్రెస్ వైపు అడుగులు వేస్తున్నట్లుచర్చ**

మహబూబ్‌నగర్,

ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు రాజీనామా చేయడం వెనక ఏమై ఉంటుందా అని అంతా చర్చిస్తున్నారు. ఇప్పుడే బిఆర్ఎస్‌కు రాజీనామా చేయడంలో ఆంతర్యమేమిటో తెలియడం లేదు. అయితే ఆయన అధికార కాంగ్రెస్‌లోకి వెళతారన్న ప్రచారం కూడా ఉంది. ఇకపోతే బీఆర్ఎస్ పార్టీపై అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు షాకింగ్ కామెంట్స్ చేశారు. భవిష్యత్తులో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు ఉంటుందని ఆరోపించారు. ఎమ్మెల్సీ కవిత చెప్పినట్లుగానే పరిణామాలు ఉంటున్నాయని అన్నారు. బీఆర్ఎస్‌లో పరిణామాలు చూస్తుంటే పొత్తు పెట్టు–కున్నా ఆశ్చర్యం లేదని ఆక్షేపించారు. బీఆర్ఎస్, బీజేపీ వ్యవహారంపై ఎమ్మెల్సీ కవిత లాంటి నేతలు కూడా చెప్పారని గుర్తుచేశారు. బీఆర్ఎస్‌లో తనకు భవిష్యత్తు లేదనే అసంతృప్తితోనే రాజీనామా చేశానని చెప్పుకొచ్చారు. మంగళవారం గువ్వల బాలరాజు మాట్లాడారు. ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్ నేతలు తనకు టచ్‌లోకి వచ్చిన మాట వాస్తవమని గువ్వల బాలరాజు స్పష్టం చేశారు. అచ్చంపేట నియోజకవర్గం ప్రజల అభిప్రాయం మేరకు ఏ పార్టీలో చేరాలో నిర్ణయం తీసుకుంటా నని తెలిపారు. బీఎల్ సంతోష్‌ను తాను ఎప్పుడూ విమర్శించలేదని చెప్పుకొచ్చారు. అప్పట్లో బీఎల్ సంతోష్ ఎవరో కూడా తనకు తెలియదని గువ్వల బాలరాజు అన్నారు. కేసీఆర్ ఇచ్చిన టాస్క్‌ను మాత్రమే తాను పూర్తి చేశానని క్లారిటీ– ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకత్వం.. ప్రజల్లో బలం లేని రెడీమేడ్ లీడర్స్‌ను నమ్ముకుంటుందని వ్యాఖ్యానించారు. జనరల్ నియోజకవర్గాల్లో దళితులకు సీట్లు ఇచ్చే దమ్ము బీఆర్ఎస్‌కు ఉందా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఏడాదిన్నర కాలంగా బీఆర్ఎస్‌లో తనకు ప్రాధాన్యం తగ్గించారని గువ్వల బాలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. గువ్వల బాలరాజు బీఆర్ఎస్ కార్యకర్తతో మాట్లాడినట్లుగా ఓ ఫోన్ కాల్ వైరల్ అవుతోంది. ఈ ఫోన్ కాల్‌లో ఏం మాట్లాడరంటే.. 'బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకుంటుందని లేదా విలీనం అవుతుందనే వార్తలు వస్తున్నాయి. అలాంటప్పుడు మన అభ్యర్థిత్వం ఎగిరిపోతుంది. గతంలో బీజేపీతో నేను పోరాటం చేశా. బీఆర్ఎస్ కంటే ముందే నా దారి నేను చూసుకుని.. బీజేపీలో కలవడం మంచిదని నిర్ణయం తీసుకున్నా. పార్టీలో నన్ను కాదని నాగర్ కర్నూల్ ఎంపీ టికెట్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు ఇచ్చారు. ఆ విషయం ఎంతో బాధించిందని గువ్వల బాలరాజు మాట్లాడుతు న్నట్లుగా ప్రచారం జరుగుతోంది. దీనినిబట్టి ఆయన కాంగ్రెస్‌లో చేరడం ఖాయమని అంటున్నారు. ఇకపోతే జిల్లాకు చెందిన సిఎంగా రేవంత్ ఉండడంతో ఆయన అటువైపు మొగ్గు చూపుతున్నారని కూడా ప్రచారం. మొత్తంగా ఎటు వెళ్లినా ఇప్పటికిప్పుడు గువ్వలకు వచ్చే ఉపయోగం ఏమీ ఉండకపోవ్చు.

# సోషల్ మీడియా జర్నలిస్టులపై సిఎం అసహనం

### సిఎం వ్యాఖ్యలను తప్పుపట్టిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి

హైదరాబాద్,

సోషల్ మీడియా జర్నలిస్టుల పట్ల సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి తప్పుపట్టారు. సోషల్ మీడియాపై సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలకు రాజగోపాల్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. సామజిక బాధ్యతతో పనిచేసే వారిని గౌరవించాలని పేర్కొన్నారు. సోషల్ మీడియా జర్నలిస్టులను అనవానించడం సబబు కాదని సూచించారు. ఇలాంటి కుటిల పన్నాగాలను తెలంగాణ సమాజం సహించదని హెచ్చరించారు. నిబద్ధతతో పనిచేసే సోషల్ మీడియా జర్నలిస్టులకు తన మద్దతు ఎప్పుడూ ఉంటు-ందని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ట్విట్టర్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డికి కౌంటర్ ఇచ్చారు. 'ప్రజల కోసం సామాజిక బాధ్యతతో పనిచేస్తున్న సోషల్ మీడియాను పాలకులు గౌరవించాలే తప్ప.. అవమానించడం సబబు కాదు. తెలంగాణ సమాజ ఆకాంక్షల మేరకు సోషల్ మీడియా మొదటినుంచి తన శక్తి కొద్దీ పనిచేస్తూనే ఉంది. నిబద్ధతతో పనిచేసే సోషల్ మీడియా జర్నలిస్టులకు నా మద్దతు ఎప్పుడూ ఉంటుంది. సోషల్ మీడియా జర్నలిస్టులను దూరం పెట్టాలంటూ ప్రధాన మీడియా వారిని ఎగదోయడం ముమ్మాటికీ విభజించి పాలించడమే. ఇలాంటి కుటిల పన్నాగాలను తెలంగాణ సమాజం సహించదు' అని రాజగోపాల్ రెడ్డి ట్వీట్ చేశారు.

# షూటింగ్‌లకు కొత్త వారికి కూడా అవకాశం

### తెలుగు ఫిలిం ఛాంబర్ షాకింగ్ నిర్ణయం

హైదరాబాద్,

తెలుగు ఫిలిం ఛాంబర్ షాకింగ్ నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి షూటింగ్ లకు కొత్త వారికి కూడా అవకాశం కల్పించాలని నిర్ణయించింది. సభ్యత్వం లేనివారిని కూడా షూటింగ్ లకు తీసుకోవాలని ఫలిం ఛాంబర్ భేటీలో నిర్ణయించారు. కార్మికుల జీతాల పెంపును వ్యతిరేకిస్తున్నట్లు- సోమవారం ప్రకటన విడుదల చేసింది. వేతనాలు పెంచాలని గత కొంత కాలంగా కార్మికులు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. వేతనాల పెంపుపై ఫిలిం ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నాకు దిగారు. షూటింగ్ లను నిలిపివేసి ఆందోళన చేపట్టారు. జీతాలు పెంచే వరకు విధులకు హాజరయ్యేది లేదని తేల్చిచెప్పారు. కార్మికుల డిమాండ్లపై ఫిలిం ఛాంబర్ సభ్యులు భేటీ అయ్యారు. కార్మిక సంఘాలు కోరుతున్నట్లు- 30 శాతం జీతాల పెంపు సాధ్యం కాదని ప్రకటన విడుదల చేసింది. తెలుగు సినీ పరిశ్రమ ఇబ్బందుల్లో ఉందని.. ఈ పరిస్థితుల్లో జీతాలు పెంచాలనడం సరికాదని ప్రకటనలో పేర్కొంది. సామరస్య పూర్వకంగా చర్చలు జరుపుతున్న సమయంలో ఆందోళనలు నిర్వహించడం సమంజసం కాదని తెలిపింది. కార్మికుల వేతనాల పెంపుతో చిన్న నిర్మాతలు ఇబ్బందులకు గురవుతారని.. వారు ఆర్థిక భారాన్ని భరించలేరని.. వేతనాల పెంపును నిర్మాతలందరూ ఏకగ్రీవంగా వ్యతిరేకించినట్లు- ప్రకటనలో పేర్కొంది. కనీస వేతన చట్టం ప్రకారం ఏ కార్మికుడినైనా నియమించుకునే హక్కు నిర్మాతలకు ఉందని తెలిపింది. హైదరాబాద్ లో లివింగ్ కాస్ట్ ఇతర నగరాలతో పోల్చితే తక్కువే ఉందని.. ఇతర సినీ పరిశ్రమలు ఇస్తున్నదాని కంటే ఇక్కడ ఎక్కువ వేతనాలు ఇస్తున్నట్లు- ఫిలిం ఛాంబర్ తెలిపింది. ఈ క్రమంలో ఫిలిం ఛాంబర్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు- ప్రకటించింది. ఇక నుంచి యూనియన్ లో సభ్యత్వం లేని కార్మికులకు సైతం అవకాశం కల్పించాలని సభ్యులు నిర్ణయించారు. సినీ పరిశ్రమలో పనిచేసేందుకు ఎంతో మంది కార్మికులు సిద్ధంగా ఉన్నప్పటికీ.. యూనియన్ లలో సభ్యత్వం కోసం లక్షల్లో డిమాండ్ చేస్తూ కొత్త వాళ్లను రానివ్వటం లేదని.. ఇది ఎంతో మంది కార్మికుల పొట్టకొట్టడమే అవుతుందని టీ-ఎఫ్ సీసీ పేర్కొంది. అందుకోసం ఇక నుంచి కొత్త వారికి కూడా అవకాశాలు కల్పించాలని నిర్ణయించుకున్నట్లు- ప్రకటనలో పేర్కొంది.

# కుంకీ ఏనుగుల తొలి ఆపరేషన్ సక్సెస్

### చిత్తూరు జిల్లాలో ఏనుగులను తరిమి కొట్టిన కుంకీ

### అటవీ అధికారులను అభినందించిన పవన్ కళ్యాణ్

చిత్తూరు,

:కుంకీ ఏనుగుల తొలి ఆపరేషన్ సక్సెస్ అయ్యిందని ఏపీ డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. ఆపరేషన్ కుంకీతో సరిహద్దు ప్రాంత రైతులకి భరోసా అని అన్నారు. పంటల్ని ధ్వంసం చేస్తున్న ఏనుగుల్ని.. కుంకీలు దారి మళ్లించాయి.. తొలి ఆపరేషన్ విజయవంతం చేసిన అటవీ శాఖ అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. చిత్తూరు జిల్లా, బంగారుపాళ్యం మండల పరిధిలోని మొగిలి వద్ద మామిడి తోటలను ధ్వంసం చేస్తున్న అటవీ ఏనుగుల గుంపుని కుంకీలు విజయవంతంగా దారి మళ్లించి అడవిలోకి తరిమికొట్టినట్టు- అటవీ శాఖ అధికారులు తెలిపారు. కృష్ణ, జయంత్, వినాయక అనే కుంకీలు ఆ ఆపరేషన్ లో పాల్గొని అడవి ఏనుగులను పంటల వైపు రాకుండా అడ్డుకుని తిరిగి అడవిలోకి మళ్లించాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు కొనసాగిన ఈ ఆపరేషన్ లో కర్ణాటక నుంచి తీసుకువచ్చిన కృష్ణ అనే కుంకీ ఏనుగు చాలా చురుకుగా పాల్గొన్నట్టు- అటవీ అధికారులు తెలియజేశారు. మొగిలి ప్రాంతంలో 15 రోజులుగా ఏనుగుల సంచారం ఉన్న సమాచారంతో అధికారులు ఈ ఆపరేషన్ చేపట్టారు. కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను తీసుకువచ్చిన అనంతరం రెండు నెలల శిక్షణ తర్వాత మొదటి ఆపరేషన్ విజయవంతంగా చేపట్టడం ఆనందాన్నిచ్చింది. ఏనుగుల సంచారంతో ఇబ్బందులు పడుతున్న సరిహద్దు ప్రాంతాల రైతులు, ప్రజలకు ఈ ఆపరేషన్ భరోసా ఇస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏనుగుల గుంపు నుంచి పంటలను, ప్రజల ప్రాణాలు కాపాడే దిశగా ప్రణాళికాబద్ధంగా పని చేస్తుంది అనడానికి కుంకీలతో చేపట్టిన ఆపరేషన్ తొలి అడుగు. ఈ ఆపరేషన్ లో పాల్గొన్న అటవీ అధికారులకు, మావటిలు, కావడిలకు అభినందనలు తెలియజేస్తున్నాను. అలాగే అడిగిన వెంటనే కుంకీ ఏనుగులు రాష్ట్రానికి ఇచ్చి సహకరించిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకి, ఆ రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రేకి మరోసారి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. తదుపరి ఆపరేషన్ పుంగనూరు అటవీ ప్రాంతంలో చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు- చేస్తున్నారని తెలిపారు.

# తెలంగాణ స్థానికతపై సుప్రీంలో విచారణ

### రెండేళ్లు బయట ఉన్నంత మాత్రాన స్థానికేతరుడా?

### ప్రభుత్వ తీరును ప్రశ్నించిన చీఫ్ జస్టిస్ గవాయ్

### తీర్పును రిజర్వ్ చేసిన ధర్మాసనం

న్యూఢిల్లీ,



తెలంగాణ స్థానికత వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ ముగిసంది. దీనిపై తీర్పును ధర్మాసనం రిజర్వ్ చేసింది. పదో తరగతి తర్వాత రెండేళ్లు బయట ఉంటే స్థానికత వర్తించదన్న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులపై పలువురు విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. విద్యార్థుల పిటిషన్‌పై విచారించి.. తగిన నిబంధనలు రూపొందించాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది. స్థానికత అంటే ఏమిటి? ఎవరు దీని పరిధిలోకి వస్తారు? అందుకు ఉన్న పరిమితులపై మార్గదర్శకాలు జారీ చేయాలని హైకోర్టు తీర్పులో పేర్కొంది. దీంతో హైకోర్టు తీర్పును విద్యార్థులు సుప్రీంలో సవాల్ చేశారు. ఈ పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. రెండేళ్లు బయట ప్రాంతంలో చదువుకోవడానికి వెళితే తప్పేంటని విచారణ సందర్భంగా సీజేఐ ప్రశ్నించారు. పదేళ్లు స్థానికంగా ఉండి.. రెండేళ్లు బయటకు వెళితే స్థానికత ఎలా కోల్పోతారని ప్రశ్నించారు. 2014లో నిబంధనలు తీసుకొచ్చారు.. అప్పుడు ఈ రెండు, నాలుగేళ్ల సమయం గురించి అందులో ప్రస్తావించారా అని ధర్మాసనం ప్రశ్నించింది. 2024లో తీసుకొచ్చిన నిబంధనను 2028కి వర్తింపజేస్తే సరిపోతుందని సీజేఐ ధర్మాసనం అభిప్రాయపడింది. స్థానికత నిబంధనల కారణంగా తెలంగాణ విద్యార్థుల హక్కులకు అన్యాయం జరగకూడదని వాదనల సందర్భంగా సీజేఐ అభిప్రాయం వ్యక్తం చేశారు. కోటా, దుబాయ్ లాంటి ప్రాంతాలకు చదువుకోవడానికి వెళ్లిన విద్యార్థులకు స్థానికత వర్తించదంటే ఎలా? ఒక విద్యార్థి తెలంగాణలో పుట్టి పెరిగి.. రెండేళ్లు బయట చదువుకున్నంత మాత్రాన కోటా వర్తించదంటే ఎలా? ప్రతి విద్యార్థి 371డి అధికరణం గురించి తెలుసు కోవాలన్నట్టుగా మీ వాదనలు ఉన్నాయి. నిరక్ష రాస్యులైన తల్లిదండ్రులు ఉంటే.. 8వ తరగతిలోనే రాజ్యాంగం గురించి తెలుసుకోవాలన్న విధంగా మీ వాదనలు ఉన్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పలు రాష్ట్రాల్లోస్థానిక వ్యవహారం పలు విధాలుగా ఉందని రాష్ట్రప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ అన్నారు. పలు రాష్ట్రాల్లో స్థానికత వ్యవహారం పలు విధాలుగా ఉందన్న రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ. అస్సాంలో 7 సంవత్సరాల నిబంధన ఉందని గుర్తు చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో పేద, మధ్యతరగతి వాళ్లకు జరుగుతున్న ఉపయోగాన్ని విస్తృత కోణం నుంచి చూడాలని, అందుకు తగిన విధంగా నిర్ణయం తీసుకోవాలని సింఘ్వీ కోరారు. వాదనల అనంతరం తీర్పు రిజర్వు చేస్తున్నట్టు సీజేఐ జస్టిస్ గవాయ్ ధర్మాసనం తెలిపింది.

# కాళేశ్వరం కక్షసాధింపు కమిషన్

### కెసిఆర్‌ను ఇబ్బంది పెట్టే లక్ష్యంతో విచారణ

### అసెంబ్లీలో చర్చకు పెడితే ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతాం

### తుమ్మడిహట్టి వద్ద నీళ్ల లేవని కేంద్రమే చెప్పింది

### తెలంగాణ భవన్‌లో హరీష్ రావు ప్రజెంటేషన్

### ఇదంతా కుట్రల నివేదిక అని కొట్టి పారేసిన హరీష్ రావు

హైదరాబాద్,



కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన తాజా నివేదికను మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. గత 20 నెలలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను గాలికి వదిలేసి రాజకీయ కక్షలు సాధించేందుకే కమిషన్‌లను ఏర్పాటు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. డబ్బులు దంచుకోవడానికీ, ప్రతిపక్షాలపై కేసులు పెట్టడానికీ ఈ కమిషన్‌లు సాధనంగా మారాయని అన్నారు. తెలంగాణ భవన్‌లో కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల ముందు ఒక రిపోర్ట్, బీఆర్ఎస్ రజతోత్సవ సభ ముందు ఒక రిపోర్ట్, స్థానిక సంస్థల ఎన్నికల ముందు ఇంకో రిపోర్ట్.. ఇవన్నీ కుట్రలో భాగం. మాకు నోటీసులు రాకముందే మీడియాకు లీకులు ఇచ్చారు. 60 పేజీల రిపోర్ట్ కుట్రతో బయట పెట్టారు. అసలు 650 పేజీల రిపోర్ట్‌ను అసెంబ్లీలో పెట్టండి, చీల్చి చెండాడుతాం అని అన్నారు. కమిషన్ ఇచ్చిన నివేదికలో కేంద్ర ప్రభుత్వాన్నే తప్పు పట్టినట్లు ఉందని హరీష్ విమర్శించారు. కమిషన్ ఒకవైపే విని ఇచ్చిన రిపోర్ట్ ఇది. ఇది ట్రాష్, బేస్‌లెస్. గతంలో ఇందిరా గాంధీ, చంద్రబాబు మీద వచ్చిన రిపోర్టులు న్యాయస్థానాల్లో నిలబడలేదు. ఇవి కూడా నిలబడవని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరప్రదాయని అని హరీష్ స్పష్టం చేశారు. కేసీఆర్‌ను వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నారు. కానీ నిజం ఏమిటంటే, సర్ ఆర్థర్ కాటన్‌ను ఎలా పూజిస్తారో, భవిష్యత్తులో కేసీఆర్‌ను కూడా అలాగే పూజిస్తారు. సీఎం రేవంత్‌కీ ఇది తెలుసు. అందుకే మొన్న గంధమల్ల ప్రాజెక్టుకు కొబ్బరికాయ కొట్టాడని అన్నారు. తమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్టు పెట్టడమే కాంగ్రెస్ చేసిన పెద్ద తప్పు అని హరీష్ ఆరోపించారు. ఆ నిర్ణయాన్ని మార్చి మెడిగడ్డకు తీసుకెళ్లిన విషయాన్ని సీడబ్ల్యూసీ కూడా ఆమోదించింది. కాళేశ్వరం డిపిఆర్‌లో అన్నీ క్లియర్‌గా చెప్పాం. నీళ్లు లేక మార్పులు చేయాల్సి వస్తుందని బహిరంగంగానే ప్రకటించాం. కేబినెట్ నిర్ణయం ప్రకారమే ఇది జరిగింది. 2016 జూన్ 3న కేబినెట్ ఆమోదించిందని గుర్తు చేశారు. అసెంబ్లీలో ఈ అంశంపై పూర్తి వివరణ ఇస్తామని హరీష్ సవాల్ విసిరారు. మీకు దమ్ముంటే మైక్ కట్ చేయకుండా మాట్లాడనివ్వాలి. ఆధారాలతోనే చర్చిస్తాం. ఇవాళ కోడిగుడ్డు మీద ఈకలు పీకుతున్నట్లుగా ఆరోపణలు చేస్తున్నారు. తెలిస్తే ఇంకా ఆధారాలు సేకరించేవాళ్లం అని వ్యాఖ్యానించారు. ఈ నివేదికలు వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే, రాజకీయ కక్షలు తీర్చుకోవడానికేనని హరీష్ తేల్చి చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని పార్టీ జిల్లా కార్యాలయాల్లో కార్యకర్తలు చూసేలా ఎల్ఈడీ తెరలు ఏర్పాటు- చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌ను హింసించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని విమర్శించారు. మహారాష్ట్రతో చారిత్రక ఒప్పందం చేసుకుని కాళేశ్వరం నిర్మించాం. ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు అయినా నిర్మించిందా..?. ధవళేశ్వరం ప్రాజెక్టు కట్టిన కాటన్ మీద కూడా ఆనాడు బ్రిటిష్ ప్రభుత్వం కమిషన్ వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిన కేసీఆర్‌ను కూడా భవిష్యత్ తరాలు దేవుడిగా కొలుస్తాయి. కాళేశ్వరం కమిషన్ పేరుతో వండి వార్చిన నివేదికను బయట పెట్టారు. మొత్తం నివేదికను బయటపెట్టలేదు. వాస్తవాలు బయటపెట్టాలన్నదే మా ఉద్దేశం. సీఎం రేవంత్‌రెడ్డి పాలన గాలికి వదిలేసి రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతున్నారు. డబ్బులు దండుకునేందుకు కమీషన్లు, ప్రతిపక్షాల మీద కక్ష సాధింపు కోసం రాజకీయ కమీషన్లు. రాష్ట్ర మంతా కమీషన్లమయం చేశారు. కాంగ్రెస్, భాజపా కలిసి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నాయి. పోలవరం ప్రాజెక్టు మూడు సార్లు దెబ్బతిన్నా అక్కడకు ఎన్డీఎస్ఏ వెళ్లలేదు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని కాళేశ్వరం కమిషన్ నివేదిక బయటపెట్టారు. కేసీఆర్, హరీశ్ రావును కమిషన్ పిలవదు అని మొదట అన్నారు..ఆ తర్వాత రాత్రికి రాత్రే కమిషన్ గడువు పెంచారు. పూర్తి నివేదిక బయటపెట్టి అసెంబ్లీలో చర్చ పెడితే... చీల్చి చెండాడుతాం. నచ్చిన పేరాలు లీకులు... నచ్చని నాయకుల్ని బాధ్యులు చేసినట్లు- ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రం అనుమతులు ఇచ్చింది, నివేదిక నిజమైతే కేంద్ర ప్రభుత్వాన్ని, అధికారుల్ని తప్పుపట్టినట్లే. ఒక వైపే చూసి, ఒక వైపే విని, ఒక వైపే నిల్చుని ఇచ్చిన నివేదికలా కనిపిస్తోంది. నివేదిక ఒక ట్రాష్.. ఆధారాలు లేని ఆరోపణలు. ప్రాజెక్టుపై ఒక సీఎం సమీక్ష చేయడం ఆయన బాధ్యత.. రాజకీయ జోక్యం ఎలా అవుతుంది? చరిత్రలో ఇలాంటి కమిషన్లు చాలా వచ్చాయి.. రాజకీయ దురుద్దేశంతో ఇచ్చే నివేదికలు న్యాయస్థానాలు, ప్రజా క్షేత్రంలో నిలబడవు. రైతుల ప్రయోజనాలు ఫణంగా పెట్టి కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. తుమ్మిడి హట్టిని కాంగ్రెస్ ఏ ప్రాతిపదికన చేపట్టిందని ప్రశ్నించారు. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్లకు ఒప్పందం చేసుకొని ఉంటే రాజీనామా చేస్తానని ఉత్తమ్ కుమార్ రెడ్డికి కేసీఆర్ సవాల్ చేశారు. రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసింది? ఒక్క ఎకరాకు అయినా నీళ్లు ఇచ్చారా? రెండేళ్లలో దిల్లీకి కమిషన్లు మోశారు.. ప్రతిపక్షాలపై కేసులు, కమిషన్లు తప్ప ఏమీ చేయలేదు. వచ్చే మూడేళ్లు కూడా ఈ ప్రభుత్వం చేసేది ఇదే. కాళేశ్వరంను పడావు పెట్టి బనకచర్లకు నీరు పోవాలన్నది సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన. ముమ్మాటికీ తెలంగాణకు వరప్రదాయని కాళేశ్వరం ప్రాజెక్టు...ఈ విషయం రేవంత్ రెడ్డికి కూడా తెలుసు. కాళేశ్వరం కూలిందని ఓ వైపు అంటారు..మరోవైపు మూసీకి గోదావరి జలాలు తీసుకొస్తామని ఎలా చెబుతారని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# రాష్ట్రపతితో ప్రధాని , అమిత్‌షాలు వేర్వేరుగా భేటీ

### కాశ్మీర్‌కు రాష్ట్రపతి హోదాపై ఊహాగానాలు

న్యూఢిల్లీ,

జమ్మూకశ్మీర్ కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించనున్నారనే ప్రచారం ఒక్కసారిగా ఊపందుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఆదివారంనాడు ఒకరి తరువాత మరొకరు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తో సమావేశమయ్యారు. రాష్ట్రపతి భవన్ ఈ విషయాన్ని సోషల్ మీడియాలో ధ్రువీకరించింది. అయితే ఈ సమావేశాల వెనుక కారణం ఏమిటనేది మాత్రం స్పష్టం చేయలేదు. అమిత్‌షా తన కసరత్తులో భాగంగా పలువురు బీజేపీ నేతలు, అప్పటి జమ్మూకశ్మీర్ రాష్ట్ర బీజేపీ చీఫ్‌లతో సమావేశమైనట్టు- కూడా చెబుతున్నారు. ప్రధానమంత్రి మోదీ సైతం మంగళవారంనాడు ఎన్డీయే ఎంపీలతో కీలక సమావేశం జరుపనున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆగస్టు 5న 370వ అధికరణ రద్దు యానివర్శిరీ కావడంతో ఆరోజు కీలక ప్రకటన ఏదో ఉండవచ్చుని, ముందస్తు కసరత్తులో భాగంగానే కీలక సమావేశాలు జరుగుతున్నాయని ఊహాగానాలు వెలువడుతున్నాయి. కాగా, ఈనెల మొదటి రెండు రోజుల్లో జమ్మూకశ్మీర్ బీజేపీ మాజీ చీఫ్ సత్ పాల్ శర్మ, లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ కవీందర్ గుప్తాలతో అమిత్‌షా సమావేశమయ్యారు. ఆల్ జమ్మూ అండ్ కశ్మీర్ షియా అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్రాన్ రజా అన్సారి సైతం సోమవారంనాడు అమిత్‌షాతో సమావేశమయ్యారు.


ఢిల్లీలో వరుస సమావేశాల నేపథ్యంలో ఆగస్టు 5న కీలక ప్రకటన వెలువడే అవకాశాలపై సోషల్ మీడియాలోనూ చర్చ జరుగుతోంది. దీనిపై రిటైర్డ్ ఆర్మీ అధికారి, రచయిత కన్వల్ జీత్ సింగ్ థిల్లాన్ మాట్లాడుతూ, కశ్మీర్‌లో శాంతి కోసం ఎన్నో విలువైన ప్రాణాలను కోల్పోయామని, ఆ కారణంగా ఎలాంటి తొందరపాటు- నిర్ణయాలు తీసుకోరాదని అన్నారు. శాంతి పునరుద్ధరణ పక్రియ కొనసాగుతున్నందున్న పరిస్థితి మొత్తం సానుకూలమయ్యేంత వరకూ వేచిచూడాలని, హడావిడి నిర్ణయం మంచిది కాదని చెప్పారు. రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తారనే బలమైన ఊహాగానాలు వస్తున్న విషయం నిజమేనని విశ్లేషకులు అన్నారు. అయితే మరో విచిత్రమైన వాదన కూడా వినిపిస్తోందని, కశ్మీర్, జమ్మూను వేరు చేసి రెండు వేర్వేరు రాష్ట్రాలుగా గుర్తిస్తారనే ప్రచారం ఒకటి ఉందని, అదే జరిగితే ఇంతకంటే వినాశకర పరిణామం మరొకటి ఉండదని వ్యాఖ్యానించారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# జలహక్కులపై ఉమ్మడి కుట్రలు

అరువై ఏండ్ల పాటు ఉమ్మడి పాలకులు నీళ్లు ఇవ్వకనే తెలంగాణ వాకిలి పొక్కిలైంది. తలాపున పారే కృష్ణా, గోదావరి నీళ్లు తెలంగాణ బీళ్లను తడపకుండా, ఈ గడ్డపై నిలవకుండా.. పడ్డ చినుకు పడ్డట్టుగా తరలించుకుపోయిన కుట్రల ఫలితంగానే తెలంగాణ వలసబాట పట్టింది. కరువుకు.. రైతన్నల ఆత్మహత్యలకు నెలవైంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల్లో నదీజలాల హక్కులు ప్రధానంగా నిలిచాయి. ఉద్యమనేత కేసీఆర్ సారథ్యంలో సీమాంధ్ర పాలకుల జల కుట్రలను బట్టబయలు చేసి, కాలరాయబడిన హక్కులను అవిశ్రాంత పోరాటంతో తెలంగాణ తిరిగి సాధించుకున్నది. చెరువుల పూడిక



తీసుకున్నది. మూలకుపడ్డ ప్రాజెక్టులను పట్టాలెక్కించింది. కృష్ణమ్మ, గోదారమ్మను ఒడిసిపట్టింది. మొత్తంగా పదేండ్ల స్వరాష్ట్రంలో జల ఫలాలను తెలంగాణ పల్లె అనుభవించింది. నీటి వాటాలను పూర్తిగా వినియోగించుకునే ప్రణాళికలను సిద్ధం చేసుకున్నది.రాష్ట్రం ప్రగతిపథంలో పరుగులు తీస్తున్న వేళ మళ్లీ ఇప్పుడు ఉమ్మడి కుట్రలకు తెరలేచింది. తెలంగాణ జల హక్కులను కబళించే పన్నాగాలకు పదునెక్కింది. దాని పేరే పోలవరం–బనకచర్ల లింక్ ప్రాజెక్టు. సూత్రధారి ఏపీ సీఎం చంద్రబాబు, పాత్రధారి కేంద్రంలోని బీజేపీ. ప్రేక్షకుడు రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు సారథి రేవంత్‌రెడ్డి. 'ఏపీ అన్నింటికన్న దిగువనున్న రాష్ట్రం. ఏటా సముద్రంలోకి 3 వేల టీఎంసీలు వృథాగా పోతున్నాయి. అందులో నుంచి 200 టీఎంసీల వరద జలాలనే బనకచర్లకు మళ్లించి రాయలసీమకు అందిస్తాం.' ఇదీ ఏపీ చెప్తున్న మాట. కానీ, వరద ఎక్కడి నుంచి వస్తున్నది? ఎందుకు పోతున్నది? మళ్లింపు వల్ల వచ్చే నష్టమేంటి? అన్నవే అసలు ప్రశ్నలు.మొదటగా వరద ఎక్కడిదో తెలుసుకుందాం. బచావత్ ట్రిబ్యునల్ గోదావరి బేసిన్‌ను 12 సబ్‌బేసిన్లుగా విభజించింది. ఆ తర్వాత 75 శాతం డిపెండబులిటీ అంటే కనీసం నాలుగేండ్లలో మూడేండ్ల పాటు కచ్చితంగా వచ్చే వరద ప్రవాహాలు. ఆ ప్రకారం గోదావరిలో ఏటా ఎంత నీరు అందుబాటులో ఉంటుందో లెక్కగట్టింది. ఆ జలాలన్నింటినీ బేసిన్‌లోని ఉమ్మడి ఏపీతో పాటు, పూర్వ మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, కర్ణాటక రాష్ట్రాలకు వాటి వాటి పరీవాహక ప్రాంతం ఆధారంగా పంపిణీ చేసింది. 2023లో సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం) గోదావరిలో ఎంత నీరుందనే దానిపై అధ్యయనం చేసింది. ఆ గణాంకాలు తేల్చిందేమంటే 75 శాతం డిపెండబులిటీపై గోదావరిలో నీటిలభ్యత 3,396.9 టీఎంసీలు. 50 ఏండ్ల సగటు నీటి లభ్యత 4,535.1 టీఎంసీలు. ఈ లెక్కన మిగులుతున్నది 1138.2 టీఎంసీలు. వాస్తవంగా ఇది మిగులు కాదు. ఇవి బేసిన్‌లోని రాష్ట్రాలు వినియోగించుకోని నికరజలాలే. ఉమ్మడి ఏపీకి ట్రిబ్యునల్ 1,486 టీఎంసీలను కేటాయించింది. అందులో తెలంగాణ వాటా 968 టీఎంసీలు, ఏపీ వాటా 531 టీఎంసీలు. అయితే, రాష్ట్ర ఏర్పాటు నాటికీ తెలంగాణ తన వాటాలో కనీసం 200 టీఎంసీలను కూడా వినియోగించుకోని దుస్థితి. అలాగే ఛత్తీస్‌గఢ్ కూడా తన వాటా 400 టీఎంసీలను ఇప్పటికీ వినియోగించుకోవడం లేదు. మహారాష్ట్ర కూడా అంతే. అందుకే గోదావరిలో వరద కనిపిస్తున్నది.రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ నీటి నిల్వ సామర్థ్యం పెంచుకున్నది. కాళేశ్వరం ద్వారానే 141 టీఎంసీల రిజర్వ్ కెపాసిటీ పెరుగగా, 400 టీఎంసీలకు పైగా వినియోగించుకునే వ్యవస్థలను ఏర్పాటుచేసుకుంది. ఇవికాకుండా సమ్మక్కసాగర్ 44, సీతమ్మసాగర్ 67 టీఎంసీలు మొత్తంగా నికర వాటాలో 824 టీఎంసీలను వినియోగించుకునేలా ప్రణాళికలను సిద్ధం చేసింది. భవిష్యత్తు అవసరాల కోసం ఒక 144 టీఎంసీలను రిజర్వ్ చేసి పెట్టుకున్నది. ఛత్తీస్‌గఢ్ కూడా ఇటీవల సుబోధ్‌ఘాట్ ద్వారా 90 టీఎంసీలు, మహానది–ఇంద్రావతి లింక్ ద్వారా 150 టీఎంసీలను వినియోగించుకునేలా ప్రాజెక్టులను రూపకల్పన చేసుకున్నది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఈ ప్రాజెక్టులన్నింటి ద్వారా నీటి వినియోగం పెరిగితే ఆ మేరకు జలాలు దిగువకు పోవన్నది కండ్లముందు కనబడుతున్న సత్యం.వరద మాటున ఏపీ జలాల వినియోగానికి అంగీకరిస్తే తెలంగాణకే కాదు, బేసిన్‌లోని అన్ని రాష్ట్రాలకు నష్టం వాటిల్లుతుంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీనే కండ్లముందు కనబడుతున్న సజీవ సాక్ష్యం. రేపటి రోజున బనకచర్ల కూడా మరో పోతిరెడ్డిపాడులా మారుతుంది. బనకచర్ల ద్వారా ఒక్క గోదావరినే కాదు, కృష్ణా జలాలను కబళించేందుకు ఏపీ ప్రణాళికను సిద్ధం చేసుకున్నది. సాగర్ కుడికాలువ 80 కిమీ వద్ద బొల్లాపల్లి రిజర్వాయర్‌ను కట్టనున్నది.బనకచర్ల ద్వారా ఇటు గోదావరి, అటు కృష్ణా జలాలు తెలంగాణకు దక్కకుండాపోయే ప్రమాదం ఉన్నది. అదీగాక ఏపీ ఇప్పటికే గోదావరి ట్రిబ్యునల్ కోసం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. రేపటి రోజున అది ఏర్పడితే బనకచర్లకు చట్టబద్ధత వచ్చే ప్రమాదం ఉంటది. అదే జరిగితే తెలంగాణ వాటాకు గండిపడే ప్రమాదం ఉన్నది.ఎందుకంటే ట్రిబ్యునల్ ఎప్పుడైనా ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్‌డ్ అనే సూత్రాన్ని పాటిస్తుంది. అప్పటికే నిర్మించిన ప్రాజెక్టులకే నీటి కేటాయింపుల్లో ప్రాధాన్యం ఇస్తుంది. దీనికి సాగర్ కింద కృష్ణా డెల్టాకు కేటాయించిన 180 టీఎంసీలే నిదర్శనం.వరదజలాలు పుష్కలంగా ఉన్నప్పుడు తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వకూడదని గతంలో ఏపీ ఎందుకు అడ్డుకున్నది? కారణం సుస్పష్టం. తెలంగాణకు నదీజలాలు దక్కకూడదు. నాడైనా, నేడైనా ఏపీదీ అదే కుట్ర.గోదావరిలో మిగులు జలాలు లేనే లేవు. బనకచర్ల వద్దంటూ కేంద్ర సంస్థలే ముక్తకంఠంతో తెగేసి చెప్తున్నాయి. అయినా వాటిని పట్టించుకోకుండా ఏపీకి కేంద్రం దన్నుగా నిలుస్తున్నది. ఈ కుట్రలకు సీఎం రేవంత్ సహకరిస్తున్నారు.ఇంత జరుగుతున్నా తెలంగాణకు చెందిన 8 మంది కాంగ్రెస్ ఎంపీలు, 8 మంది బీజేపీ ఎంపీలు, ఆ రెండు పార్టీలకు చెందిన ఇతర ప్రజాప్రతినిధులు ఒక్కరూ గొంతు విప్పకపోవడం విషాదం. తెలంగాణ జల హక్కులను ప్రశ్నించకుండా పెదవులు మూసుకోవడం దారుణం. ఈ కుట్రలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ తెలంగాణ నీటిహక్కుల కోసం నిలదీస్తున్నది బీఆర్ఎస్ ఒక్కటే. ఉద్యమనేతగా కేసీఆర్ ఆనాడు కృష్ణా జలాల కోసం యుద్ధమే చేశారు. పోతిరెడ్డిపాడు అక్రమ విస్తరణకు వ్యతిరేకంగా గులాబీ నేతలు పదవులను త్యాగం చేశారు. కంఠ నరాలు చిట్లిపోయేలా గర్జించారు.పేగులు తెగుతున్నా కొట్లాడారు. విలీనం వల్ల కోల్పోయిన జల హక్కులను సెక్షన్–3 సాధించడం ద్వారా తెలంగాణకు తిరిగి దక్కేలా చేశారు కేసీఆర్. ప్రాజెక్టులను పూర్తిచేశారు. జల ఫలాలను అందించారు. ఇప్పుడు బనకచర్లపైనా గర్జిస్తున్నది కేసీఆర్ సారథ్యంలోని ఆ బీఆర్ఎస్ సైన్యమే. జల కుట్రలను నిలదీస్తున్న తీరే అందుకు నిదర్శనం. ఏపీ, కేంద్రం, రేవంత్ సర్కార్లకు ఎదురొడ్డి పోరాడుతున్నది కేసీఆర్ ఆశయసాధకులే. నాడైనా, నేడైనా, రేపైనా తెలంగాణ జల హక్కులను కాపాడేది, అందుకోసం బరిగీసి కొట్లాడేది ఒక్క బీఆరెస్సే. ఒక్క కేసీఆరే.

# కోహ్లీ.. రిటైర్మెంట్ వెనక్కి తీసుకో

## కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కీలక వ్యాఖ్యలు

వల్ వేదికగా భారత్–ఇంగ్లాండ్ మధ్య కీలకమైన ఐదో టెస్టు జరుగుతున్న వేళ, విరాట్ కోహ్లీని ఉద్దేశించి కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. విరాట్ కోహ్లీని టెస్టు క్రికెట్ నుంచి తన రిటైర్మెంట్ నిర్ణయంపై పునరాలోచించాలని ఎక్స్ వేదికగా విజ్ఞప్తి చేశారు. దేశానికి కోహ్లీ అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. థరూర్ చేసిన ట్వీట్ ఇప్పుడు వైరల్?గా మరింది. ఇంగ్లాండ్ పర్యటనకు ముందు టెస్టు క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకుంటున్నట్లు కోహ్లీ ప్రకటించారు.నేను ఈ సిరీస్‌లో విరాట్ కోహ్లీని కొన్నిసార్లు మిస్




అయ్యాను. ఈ టెస్ట్ మ్యాచ్‌లో ఆయన లేని లోటు ఎంతగానో కనిపించింది. ఆయన అద్భుతమైన బ్యాటింగ్ నైపుణ్యాలను పక్కన పెడితే, ఆయన ఓర్పు, అభిరుచి, మైదానంలో ప్రేరణ కలిగించే స్వభావం, ఆయన ఉనికి బహుశా ఫలితాన్ని మార్చగలిగే అంశాలు. విరాట్, దేశానికి మీ అవసరం ఉందని అన్నారు. అయితే, థరూర్ చేసిన ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్?గా మారింది. దీంతో కోహ్లీ అభిమానులు, క్రికెట్ లవర్స్ థరూర్ ట్వీట్?ను కామెంట్లతో హోరెత్తిస్తున్నారు. చాలా మంది అభిమానులు థరూర్ అభిప్రాయంతో ఏకీభవిస్తూ, విరాట్ కోహ్లీ టెస్టు క్రికెట్‌లోకి తిరిగి రావాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో భారత బ్యాట్స్‌మెన్ పటిష్టమైన ప్రదర్శన కనబరిచినప్పటికీ సగటు అభిమాని మైదానంలో 'కింగ్ కోహ్లీ' లేని లోటు స్పష్టంగా కనిపించినట్లు శశి థరూర్ చెప్పుకొచ్చారు. 36 ఏళ్ల విరాట్ కోహ్లీ భారత క్రికెట్ చరిత్రలో అనేక మైలురాళ్లను అధిగమించారు. ఆయన భారత్ తరఫున 123 టెస్టు మ్యాచ్‌లు ఆడారు. ఈ మ్యాచ్‌ల్లో ఆయన 46.85 సగటుతో 9230 పరుగులు సాధించారు. టెస్టు క్రికెట్‌లో కోహ్లీ బ్యాట్ నుంచి 30 సెంచరీలు, 31 అర్ధ సెంచరీలు ఉన్నాయి. అత్యధిక వ్యక్తిగత స్కోరు 254లి (నాటౌట్). కోహ్లీ భారత టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యంత విజయవంతమైన కెప్టెన్ కూడా. ఆయన నాయకత్వంలో భారత జట్టు 68 టెస్టులలో 40 విజయాలను నమోదు చేసింది. కేవలం 17 మ్యాచ్‌లలో మాత్రమే టీమ్ ఇండియా ఓటమి పాలవగా, 11 మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి.



# భారత్ అద్భుత విజయం

## రసవత్తరంగా సాగిన మ్యాచ్?

## భారత్ 6 పరుగుల తేడాతో విన్

## ఐదు టెస్టుల సిరీస్ 2–2తో సమం

లండన్ ఓవల్ టెస్టులో భారత్ అద్భుత విజయం సాధించింది. ఐదో మ్యాచ్?లో నెగ్గాలంటే 35 పరుగులు కాపాడుకుంటూ, నాలుగు వికెట్లు పడగొట్టాల్సిన దశలో టీమ్‌ఇండియా అద్భుతంగా పోరాడింది. 339–6తో బ్యాటింగ్ ప్రారంభించిన ఇంగ్లాండ్?ను 367 పరుగులకే ఆలౌట్ చేసింది. రసవత్తరంగా సాగిన ఈ మ్యాచ్?లో భారత్ 6 పరుగుల తేడాతో నెగ్గింది. దీంతో ఐదు మ్యాచ్?ల సిరీస్ 2–2తో సమం అయ్యింది. 339–6తో ఐదో రోజు ఆట ప్రారంభించిన ఇంగ్లాండ్, మరో 28 పరుగులు చేసి చివరి నాలుగు వికెట్లు కోల్పోయింది. 374 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ 367 స్కోర్?కే ఆలౌటైంది. ఐదో రోజు ఇంగ్లాండ్ చేతిలో




నాలుగు వికెట్లతో, 35 పరుగులు కావాల్సిన దశలో ఆట ప్రారంభించింది. ఈ దశలో టీమ్‌ఇండియా ఐదో రోజు తొలి ఓవర్?లోనే జెమీ స్మిత్ వికెట్ తీసింది. ఆ తర్వాత జెమ్మీ ఓవర్టన్, జోష్ టంగ్ వికెట్లు కూడా తొందరగానే కూల్చినా, గస్ అట్కిసన్ (29 బంతుల్లో 17 పరుగులు) పోరాడాడు. మరోవైపు, గాయపడిన వోక్స్ బ్యాటింగ్?కు వచ్చాడు. ఈ దశలో అట్కిసన్ పోరాడాడు. వీలుచికినప్పుడల్లా పరుగులు సాధిస్తూ, టీమ్‌ఇండియా అభిమానుల్లో గుబులు రేపాడు. కానీ, చివర్లో సిరాజ్ అద్భుత బంతికి అట్కిసన్?ను బౌల్డ్? చేసి జట్టుకు విజయం ఖరారు చేశాడు. టీమ్‌ఇండియా బౌలర్లలో మహ్మద్ సిరాజ్ 5, ప్రసిద్ధ్ కృష్ణ 4, ఆకాశ్ దీప్ 1 వికెట్ దక్కించుకున్నారు.కాగా, ఈ సిరీస్?లో తొలి మ్యాచ్?లో ఇంగ్లాండ్ నెగ్గాగ, ఎడ్జ్?బాస్టన్ వేదికగా జరిగిన రెండో మ్యాచ్?లో భారత్ విజయం సాధించింది. ఇక ప్రతిష్మాత్మక




లార్డ్స్ వేదికగా జరిగిన మూడో టెస్టులో టీమ్‌ఇండియా పోరాడి ఓడింది. నాలుగో మ్యాచ్?లో ఇంగ్లాండ్ మరోసారి భారత్?పై పైచేయి సాధించి నెగ్గింది. దీంతో నాలుగు టెస్టులు ముగిసేసరికి ఇంగ్లాండ్ 2–1తో లీడ్?లోకి వెళ్లింది. తాజాగా లండన్ వేదికగా జరిగిన ఐదో మ్యాచ్?లో టీమ్‌ఇండియా అద్భుతంగా పోరాడి 6 పరుగుల విజయం సాధించింది. దీంతో సిరీస్ 2–2తో సమం అయ్యింది.

### భారత్ చారిత్రాత్మక విజయానికి 5 ప్రధాన కారణాలు..

ఓవల్ టెస్ట్‌లో భారత్ 6 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇంత తక్కువ తేడాతో భారత్ విజయం సాధించడం టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇదే తొలిసారి. ఐదో టెస్టులో భారత్ విజయం అందుకోవడంతో ఆండర్సన్–టెండూల్కర్ ట్రోఫీ 2–2తో డ్రాగా ముగిసింది. ఐదో టెస్ట్‌లో మొదటి ఇన్నింగ్స్ కేవలం 224 పరుగులకే ఆలౌట్ కావడం నుంచి 6 పరుగుల చారిత్రాత్మక విజయాన్ని అందుకోవడం వరకు చాలా అద్భుతాలు జరిగాయి. ఓవల్ టెస్ట్‌లో భారత జట్టు విజయం సాధించడానికి దోహదపడిన ఐదు విషయాలు గురించి తెలుసుకుందాం. జస్ప్రీత్ బుమ్రా ఐదో టెస్ట్ ఆడటం లేదు, కాబట్టి మహ్మద్ సిరాజ్ భారత్ అత్యంత అనుభవజ్ఞుడైన ఫాస్ట్ బౌలర్. పేస్ అటాక్‌కు నాయకత్వం వహిస్తూ, అతను మ్యాచ్‌లో మొత్తం 9 వికెట్లు పడగొట్టాడు. సిరాజ్ మానసికంగా చాలా బలంగా కనిపించాడు, అతని ప్రతి బంతి ఇంగ్లాండ్ బ్యాట్స్‌మెన్‌ను ముప్పతిప్పలు పెట్టింది. అతని బాడీ లాంగ్వేజ్ చూసి, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాష్‌దీప్ బౌలింగ్ కూడా చాలా భిన్నంగా కనిపించింది. సాధారణంగా భారత జట్టు లీడ్ బౌలర్ బాగా రాణిస్తున్నట్లు కనిపిస్తుంది, కానీ అతనికి మద్దతు లభించదు. ఓవల్ టెస్ట్‌లో, ఒకవైపు, మహమ్మద్ సిరాజ్ నాయకత్వం వహిస్తూ 9 వికెట్లు పడగొట్టాడు, అయితే ప్రసిద్ధ్ కృష్ణ అతనికి పూర్తి మద్దతు ఇచ్చి మ్యాచ్‌లో మొత్తం 8 వికెట్లు పడగొట్టాడు. సిరీస్ అంతటా, భారత జట్టు యాజమాన్యం బ్యాటింగ్‌లో ప్రత్యేక వ్యూహాన్ని అనుసరించింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 153 పరుగులకే 6 వికెట్లు కోల్పోగా, చివరి 4 వికెట్లు 71 పరుగులు జోడించి భారత్ గౌరవప్రదమైన స్కోరును 224కు చేర్చింది. రెండో ఇన్నింగ్స్ ముగిసే సమయానికి వాషింగ్టన్ సుందర్ 53 పరుగులు చేసి, భారత స్కోరును 400కి దగ్గరగా తీసుకెళ్లాడు. సుందర్ ఇన్నింగ్స్ ఆడి ఉండకపోతే, ఇంగ్లాండ్‌కు 330–340 లక్ష్యాన్ని సాధించి ఉండేది. ఐదో రోజు, ఇంగ్లాండ్ గెలవడానికి 35 పరుగులు చేయాల్సి వచ్చింది. ఐదో రోజు కేవలం 4 ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేశారు. ఇన్నింగ్స్‌లో 80 ఓవర్ల తర్వాత, భారత జట్టుకు కొత్త బంతి అందుబాటులో ఉంది. సిరాజ్, కృష్ణ పాత బంతిని చాలాసార్లు స్వింగ్ చేస్తున్నారు, దీని కారణంగా ఇంగ్లీష్ బ్యాట్స్‌మెన్ ఆడలేకపోయారు. భారతదేశం కొత్త బంతిని తీసుకొని ఉంటే, బహుశా అది పాత బంతి కంటే ఎక్కువగా బౌన్స్ అయ్యేది, అటువంటి పరిస్థితిలో ఆడటం బ్యాట్స్‌మెన్‌కు ఈజీ అయ్యేది. యశస్వి జైస్వాల్ ఓవల్ టెస్ట్‌కు ముందు 8 ఇన్నింగ్స్‌లలో 323 పరుగులు చేశాడు. అదే సమయంలో, ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లోని చివరి 6 ఇన్నింగ్స్‌లలో జైస్వాల్ నిరంతరం విఫలమై ఉన్నాడు. చివరగా, ఓవల్ టెస్ట్‌లో ఇంగ్లాండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 23 పరుగుల ఆధిక్యంలోకి వచ్చినప్పుడు జైస్వాల్ సెంచరీ చేశాడు. రెండవ ఇన్నింగ్స్‌లో, జైస్వాల్ 118 పరుగులు చేసి తన దాహాన్ని తీర్చుకున్నాడు. అతని కారణంగా, భారతదేశం రెండవ ఇన్నింగ్స్‌లో 396 పరుగులను చేరుకోగలిగింది.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

# స్పోర్ట్స్



## విడాకులపై సైనా-కశ్యప్? యూటర్న్?

ఇటీవలె విడిపోతున్నట్లు ప్రకటించిన బ్యాడ్మింటన్ జంట సైనా నెహ్వాల్, పారుపల్లి కశ్యప్ మళ్లీ ఒక్కటయ్యారు. ఈ మేరకు "మళ్లీ ప్రయత్నిస్తున్నాం" అంటూ సైనా శనివారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఓ పోస్ట్ చేసింది. "కొన్నిసార్లు దూరం వల్ల ఉనికి విలువ తెలుస్తుంది. బంధాన్ని కొనసాగించేందుకు మేము మళ్లీ ప్రయత్నిస్తున్నాం" అని పోస్ట్?లో పేర్కొంది. కశ్యప్?తో కలిసి ఉన్న ఫొటోను ఆమె షేర్? చేశారు.కాగా, అంతకుముందు గత నెలలో సైనా నెహ్వాల్, పారుపల్లి కశ్యప్ తమ ఏడేళ్ల వివాహ బంధానికి ముగింపు పలుకుతున్నట్లు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్వయంగా సైనా వెల్లడించారు. ఎంతో ఆలోచించి, చర్చించిన అనంతరం తాను, కశ్యప్



విడిపోవాలని నిర్ణయించుకున్నట్లు సైనా ప్రకటించారు. "జీవితం కొన్ని సార్లు మనల్ని విభిన్న మార్గంలోకి తీసుకెళ్తుంది. సుదీర్ఘ చర్చలు ఎన్నో ఆలోచనల తర్వాత నేను, కశ్యప్ విడిపోవాలని నిర్ణయించుకున్నాం. ప్రశాంతతను ఎంచుకున్నాం. ఈ సమయంలో మా గోప్యతకు గౌరవం ఇస్తారని భావిస్తున్నాం" అని సైనా తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. హైదరాబాద్?లోని పుల్లెల గోపీచంద్? బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ తీసుకుంటుండగా వీరి మధ్య స్నేహం మొదలైంది. ఆ తర్వాత ప్రేమగా మారగా, 2018లో సైనా, కశ్యప్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. గత కొంతకాలంగా వరుసగా గాయాల బారిన పడిన సైనా, ఫామ్‌ను కోల్పోయారు. చివరిసారిగా 2023 జూన్‌లో ప్రొఫెషనల్ సర్క్యూట్‌లో ఆడారు. తాను ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నట్లు గతేడాది ప్రకటించిన సైనా, కెరీర్‌పై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. సైనా



ఒలింపిక్? కాంస్య పతకం, ప్రపంచ నెంబర్? వన్? ర్యాంకింగ్?తో ప్రపంచ ఐకాన్?గా మారారు. సైనా అద్భుత కృషికి గానూ 2009లో అర్జున అవార్డు, 2010లో రాజీవ్ గాంధీ ఖేల్ రత్న అవార్డులన్ను ఆమె అందుకున్నారు. సైనా ప్రధాన బ్యాడ్మింటన్ పోటీల్లో భారత్?కు ప్రాతినిధ్యం వహించడమే కాక వివిధ ట్రోఫీలు, పతకాలను కూడా సాధించారు. క్రీడల్లో ప్రపంచ నంబర్ 1 ర్యాంకింగ్‌ను కలిగి ఉన్న ఏకైక భారత మహిళా క్రీడాకారిణిగా రికార్డ్ నెలకొల్పారు. మరోవైపు, కాంపిటీటివ్ బ్యాడ్మింటన్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన కశ్యప్, ఆ తర్వాత కోచింగ్‌పై దృష్టిపెట్టారు. కశ్యప్? ప్రపంచ టాప్? 10లోకి ప్రవేశించి 2014 కామన్వెల్త్? క్రీడల్లో స్వర్ణాన్ని గెలుచుకున్నారు. 32 సంవత్సరాల తర్వాత ఒక భారతీయ బ్యాడ్మింటన్ ఆటగాడు కామన్వెల్త్ క్రీడల్లో బంగారు పతకం సాధించడం అదే తొలిసారి.



## సరైన ప్లేస్‌లలో బంతు వేయడంపై దృష్టి పెట్టాను

### మ్యాచ్ అనంతరం మహ్మద్ సిరాజ్ వ్యాఖ్యలు

4వ రోజు ముగిసేసరికి ఇంగ్లాండ్ జట్టుకు కేవలం 37 పరుగులు మాత్రమే కావాలి. ఇంకా చేతిలో నాలుగు వికెట్లు ఉన్నాయి. దీంతో మ్యాచ్ ఎక్కువ శాతం ఇంగ్లండ్‌వైపే మొగ్గుతుందని అంతా భావించారు. కానీ ఐదో రోజు జరగబోయే అద్భుతాన్ని ఊహించిన వాళ్లు చాలా తక్కువమందే ఉండి ఉంటారు. కానీ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణకు వేరే ఆలోచనలు ఉన్నాయి. ఈ ఉదయం సెషన్‌లో వీళ్లిద్దరు ఇంగ్లీష్ మిడిల్ -లోయర్ ఆర్డర్‌ను కూల్చివేశారు. చివరి ఇన్నింగ్స్‌లో మ్యాచ్‌లో సిరాజ్ ఐదు వికెట్లు, కృష్ణ నాలుగు వికెట్లు పడగొట్టారు. ఇది దేశ టెస్టు క్రికెట్



చరిత్రలో ఉన్న గొప్ప టెస్టుల్లో ఒకటిగా నిలిచింది. "నేను ఈ రోజు నిద్ర లేచినప్పుడు నేను దీన్ని చేయగలనని నమ్మాను. అది గూగుల్ నుంచి ఒక ఫోటో తీసి, నేను దీన్ని చేయగలనని నా వాల్‌పేపర్‌గా పెట్టుకున్నాను. నేను ఆ (బ్రూక్) క్యాచ్‌ను సరిగ్గా పట్టుకొని ఉంటే బహుశా మ్యాచ్ ఇక్కడి వరకు వచ్చేది కాదు. "కానీ బ్రూక్ నిజంగా బాగా ఆడాడు. అది హృదయ విదారకమైన క్షణం." అని సిరాజ్ అన్నాడు. విజయం తర్వాత మాట్లాడుతూ, సిరాజ్ తన ఆనందాన్ని వెల్లడించాడు. "నేను సరైన ప్లేస్‌లలో బంతు వేయడంపై దృష్టి పెట్టాను. వికెట్లు లేదా పరుగులు నాకు పట్టింపు లేదు. నేను నా ప్రణాళికలకు కట్టుబడి ఉంటే, ఏదైనా జరగవచ్చని నాకు తెలుసు.



ఆ క్యాచ్ - నేను కుషన్‌ను తాకానో లేదో నాకు కచ్చితంగా తెలియదు, కానీ అది మ్యాచ్‌ను మలుపు తిప్పింది, "అని అన్నాడు. ముందుగా, తన ఇన్నింగ్స్ ప్రారంభంలోనే హ్యారీ బ్రూక్ ఇచ్చిన క్యాచ్‌ను సిరాజ్ డ్రాప్ చేశాడు, బ్రూక్, జో రూట్‌తో కలిసి ఇంగ్లాండ్‌ను 301 పరుగులు చేయడంలో కీలక పాత్ర పోషించారు. అందుకే సిరాజ్ క్యాచ్ చాలా విలువైందిగా పేర్కొన్నారు. సింగిల్ డిజిట్‌కు అవుట్ కావాల్సిన బ్రూక్ తర్వాత సిరాజ్ క్యాచ్ డ్రాప్‌తో వేగవంతమైన సెంచీర చేశాడు. బ్రూక్ బ్యాటింగ్‌ను ప్రమాదకరమైనదిగా సిరాజ్ అభివర్ణించాడు కానీ మలుపు తిరుగుతుందనే నమ్మకంతో ఉన్నాడు: "బ్రూక్ %u%20 మోడ్‌లోకి వెళ్లాడు. మేము విజయం నుంచి దూరంగా వచ్చినట్టు అనిపించింది. కానీ నేను నన్ను నేను చెప్పుకుంటూనే ఉన్నాను, 'మనం ఇంకా దీన్ని గెలవగలం' అని అన్నాడు. సిరాజ్ అత్యధిక వికెట్-టేకర్‌గా 32 సగటుతో 23 వికెట్లు పడగొట్టి సిరీస్‌ను ముగించాడు. జస్ప్రీత్ బుమ్రా పక్కన పెట్టడంతో, హైదరాబాద్ పేసర్ అత్యంత ముఖ్యమైన సమయంలో ముందుకు వచ్చి, సిరీస్‌లో భారతదేశ బౌలింగ్‌కు నాయకత్వం వహించాడు.



## ఇంగ్లండ్ తిక్క కుదిర్చిన భారత బౌలర్లు

ప్రసిద్ధ్ కృష్ణ, మహ్మద్ సిరాజ్ అద్భుతంగా బౌలింగ్ చేశారు. ఇంగ్లండ్ తిక్క కుదిర్చారు. టెస్ట్ క్రికెట్ చరిత్రలో విదేశీ గడ్డపై జరిగిన ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో చివరి మ్యాచ్‌ను భారత్ గెలవడం ఇదే తొలిసారి. గతంలో భారత్ విదేశీ గడ్డపై 16 ఐదు టెస్ట్‌ల సిరీస్‌లను ఆడింది. వాటిలో చివరి టెస్ట్‌లో 6 సార్లు ఓడిపోయింది. చివరి టెస్ట్ మ్యాచ్ 10 సార్లు డ్రాగా ముగిసింది. ఇప్పుడు చివరకు భారత జట్టు విదేశాల్లో జరిగిన ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో చివరి మ్యాచ్‌ను గెలుచుకోవడంలో విజయం సాధించింది. హ్యారీ బ్రూక్, జో రూట్ రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ జట్టుకు హీరోలుగా నిరూపించుకున్నారు. ఈ ఇద్దరు ఆటగాళ్లు సెంచరీలు సాధించారు. బ్రూక్ కేవలం 91



బంతుల్లోనే వేగంగా పరుగులు సాధించి సెంచరీ సాధించాడు. ఈ మ్యాచ్‌లో అతను 14 ఫోర్లు, రెండు సిక్సర్లతో సహా 111 పరుగులు చేశాడు. రూట్ 110 పరుగులు చేశాడు. ఓపెనర్‌గా వచ్చిన బెన్ డకెట్ కూడా మంచి బ్యాటింగ్ ప్రదర్శించి 54 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. ఐదవ రోజు, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్ లో రాణిచారు. 3 వికెట్లు పడగొట్టారు. ఆ తర్వాత క్రిస్ వోక్స్ గాయపడినప్పటికీ బ్యాటింగ్‌కు వచ్చాడు. భారత జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 224 పరుగులు చేసింది. ఆ తర్వాత కరుణ్ నాయర్ హాఫ్ సెంచరీతో 57 పరుగులు సాధించాడు. మిగిలిన బ్యాట్స్‌మెన్ బాగా రాణించడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఇంగ్లాండ్



జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 247 పరుగులు చేసి, తొలి ఇన్నింగ్స్ ఆధారంగా 23 పరుగుల కీలకమైన ఆధిక్యాన్ని సంపాదించింది. ఆ తర్వాత జాక్ క్రౌలీ ఇంగ్లాండ్ తరపున అత్యధికంగా 64 పరుగులు చేశాడు. అదే సమయంలో భారత్ తరపున మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ చెరో నాలుగు వికెట్లు పడగొట్టారు. రెండో ఇన్నింగ్స్‌లో భారత బ్యాట్స్‌మెన్ బాగా ఆడారు. యశస్వి జైస్వాల్ 118 పరుగులు చేసి సెంచరీ సాధించాడు. నైట్‌వాచ్‌మన్‌గా వచ్చిన ఆకాష్ దీప్ 66 పరుగులు చేశాడు. రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ కూడా అర్ధ సెంచరీలు సాధించారు. ఈ ఇద్దరు ఆటగాళ్లు జట్టు స్కోరును 300 పరుగుల మైలురాయిని దాటించడంలో కీలక పాత్ర పోషించారు. జడేజా, సుందర్ 53-53 పరుగులు చేశారు. రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 396 పరుగులు చేసింది. 23 పరుగుల ఆధిక్యంలో ఉన్న తర్వాత ఇంగ్లాండ్ 374 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.



# కోదాడ నియోజకవర్గంలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ పనులు....

**అక్షర కలం/ ప్రతినిధి:**

పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ ద్వారా కోదాడ నియోజకవర్గం లో సి ఆర్ ఆర్ ద్వారా 33 పనులను 42.72 కి మి ల రోడ్లను 48.86 కోట్లతో నిర్మిస్తున్నామని 15 కోట్లతో 314 పనుల ద్వారా సి సి రోడ్లను అలాగే హుజూర్ నగర్ నియోజకవర్గం లో 43 పనులను 90.32 కోట్లతో 122.97 కి మి ల రోడ్లను నిర్మిస్తున్నామని, కోట్లతో 306 రకాల పనుల ద్వారా సి సి రోడ్లని నిర్మిస్తున్నామని, మునగాల పి హెచ్ సి పూర్తి చేశామని, పాలకీడు పనులు జరుగుతున్నాయని, చింతలపాలెం లో పనులు మొదలు పెడతామని, కోదాడ లో 2 సబ్ సెంటర్ లు, హుజూర్నగర్ లో 7 సబ్ సెంటర్ లు మంజూరు అయ్యాయని, యోగ సెంటర్ లు కోదాడలో 3 హుజూర్నగర్ లో 5 మంజూరు అయ్యాయని 7 పూర్తి అయ్యాయని పెద్దవీడు యోగ సెంటర్ ని త్వరలో పూర్తి చేస్తామని కోదాడ ఈ ఈ వెంకటయ్య మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి రోడ్లకి ఇరువైపులా పొలం లోకి కలుపుతున్నారు. దీని వల్ల ఆదారిలో వెళ్లే వారికి చాలా ఇబ్బంది కల్గుతుందని అన్నారు.

# పుట్టిన బిడ్డకు తల్లీ పాలే శ్రేయస్కరం:




**వనస్థలీ పురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆర్.ఎమ్.ఓ.డాక్టర్. జయమాల.**

**హైదరాబాద్ : (అక్షర కలం) :**

పుట్టిన బిడ్డకు తల్లీ పాలే ఏంతో శ్రేయోష్కరం అని వనస్థలీ పురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆర్.ఎమ్.ఓ. డాక్టర్ జయమాల పేర్కొన్నారు. మంగళ వారం నాడు మహేశ్వరం, మరియు వనస్థలీ పురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రుల సంయుక్తాధ్వర్యంలో తల్లీ పాల – వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రిలోనే అనేక మంది బాలింతలు, గర్భిణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ఈ కార్యక్రమంలో ముఖ్యులుగా వనస్థలీ పురం ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కృష్ణ,**

నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ జ్యోతి,రాజ్ కుమార్ తదితరులు పాల్గొని బాలింతలకు, గర్భిణులకు పలు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయమాల మాట్లాడుతూ,డెలివరీ అయిన అరగంటలోనే పుట్టిన బిడ్డకు తల్లీ పాలు పట్టాలనీ పేర్కొన్నారు. ఆరునెలల వరకు పై పాలు పట్టకుండా తల్లీ పాలే బిడ్డకు పట్టడంతో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. సెలిలాక్ లాంటి పుట్టిన బిడ్డలకు అలవాటు చేయడం మంచిది కాదన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో డాక్టర్ల తో పాటు ృ సిబ్బంది పాల్గొన్నారు.

# కోదాడ నియోజకవర్గంలో చిలుకూరు వద్ద 200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ లను నిర్మిస్తాం...

**(అక్షర కలం/ ప్రతినిధి) :**

ప్రతి పేదవానికి కార్పొరేట్ స్థాయి విద్యా, వైద్య సేవలు అందించేందుకు 22 ఎకరాలలో హుజూర్నగర్ నియోజకవర్గంలో గడ్డిపల్లి వద్ద 250 కోట్లతో, కోదాడ నియోజకవర్గంలో చిలుకూరు వద్ద 200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ లను నిర్మిస్తున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. యువతకు ఉపాధి కల్పించటమే లక్ష్యంగా హుజూర్ నగర్ పట్టణంలో 13 కోట్ల రూపాయలతో ఐటిఐ కాలేజ్, 6.70 కోట్లతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిర్మిస్తున్నామని ఆగస్ట్ 15 న ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు.7.25 కోట్లతో జూనియర్ కాలేజ్, 4.65 కోట్లతో డిగ్రీ కాలేజ్ నిర్మించి పేదవారికి మెరుగైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నానని మంత్రి సందర్భంగా తెలిపారు.తెలంగాణ రాష్ట్ర విద్యా మరియు సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎస్ ఈ బాలస్వామి ని ఈ పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.కోదాడ వంద పడకల హాస్పిటల్ ని 26 కోట్లతో నిర్మిస్తున్నామని,హాస్పిటల్ కి 60 లక్షలతో ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నామని,సి టి స్కాన్ మిషనరీ మంజూరు అయిందని,17 సబ్ సెంటర్ లకి 20 లక్షల చొప్పున మంజూరు అయ్యాయని హుజూర్ నగర్ పట్టణం లో డయాలసిస్ కేంద్రాన్ని 1.25 కోట్లతో పూర్తి చేశామని, 60 లక్షలతో ట్రాన్స్ ఫార్మర్ మంజూరు చేశామని,సి టి స్కాన్ సెంటర్ మంజూరు అయిందని, 21 సబ్ సెంటర్లు మంజూరు అయ్యాయని పెండింగ్ లో ఉన్న పనులన్నీ వేగవంతం గా పూర్తి చేయాలనితెలంగాణ ప్రభుత్వ వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఈ ఈ ఎం ఏ హజీజ్ ని ఆదేశించారు.

# 2026 హజ్ యాత్రకు సన్నాహాలు

## ఒక్కొక్కరికి లక్ష సాయం

## కోసం హజ్ కమిటీ విజ్ఞప్తి

**విజయవాడ,**

:2026 హజ్ యాత్ర కోసం విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ పునఃకేటాయింపు చేసినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు ముస్లిం సమాజం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ– చైర్మన్ షేక్ హసన్ భాషా తెలియజేశారు. మంగళవారం విజయవాడలో విడుదల చేసిన ఒక ప్రకటనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుండి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం విడుదల చేయవలసిందిగా కోరుచున్నామన్నారు. దానికి సంబంధించిన మార్గదర్శకాలను పేర్కొంటూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. 2025 సంవత్సరానికి విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ ఎంచుకున్న తరువాత హైదరాబాద్ ఎంబార్కేషన్ పాయింట్ నుండి హజ్ యాత్రకు వెళ్లిన 72 మంది యాత్రికులకు ఒక్కొక్కరికి రూ. 1,00,000 ల ఆర్థిక సహాయం మంజూరు చేసి విడుదల చేయవలసిందిగా కోరుచున్నమన్నారు. దీనివల్ల భవిష్యత్తులో మరింత మంది హజ్ యాత్రికులు విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ ను ఎంచుకునేలా ప్రోత్సహించడంలో సహాయ పడుతుందన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో 2025 హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇందుకు ముఖ్యమంత్రికి రాష్ట్ర ముస్లిం సమాజం కృతజ్ఞతలు తెలిజేస్తుందన్నారు. 2025 సంవత్సరానికి రాష్ట్రం నుండి మొత్తం 1,618 హజ్ యాత్రికులు వెళ్లగా, రాష్ట్ర ప్రభుత్వం చేసిన విస్తృత ఏర్పాట్లతో వారి యాత్ర ఆధ్యాత్మికంగా, సంతృప్తికరంగా సాగిందన్నారు. విజయవాడ లేదా గుంటూరు పరిసర ప్రాంతాల్లో జాతీయ రహదారి పక్కన 5 నుండి 6 ఎకరాల స్థలాన్ని శాశ్వత హజ్ హౌస్ నిర్మాణం కోసం ఈఉఆ ద్వారా కేటాయించవలసిందిగా కోరుచున్నామన్నారు. రాష్ట్ర హజ్ కమిటీ– కి తగిన బడ్జెట్ నిధులు కేటాయిస్తే దానిని దేశంలో ఆదర్శవంతంగా ఉండేలా చేస్తామన్నారు.

# భారీ వర్షాలు, వరదల ముంపు సమస్యలను ఎదుర్కొనేందుకు అధికారులు సమయాత్తం కావాలి.

**రాష్ట్ర రెవెన్యూ (విపత్తు నిర్వహణ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్.**

**ములుగు జిల్లా కలెక్టర్, ఐటి డి ఏ పి ఓ తో కలిసి**

**ములుగు జిల్లా లో వరదల ముంపు నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అధికారులతో స్పెషల్ సీఎస్ సమీక్ష..**

**అధికారులతో కలిసి సమ్మక్క సాగర్ బ్యారేజ్ సుక్షేత్ర స్థాయిలో పరిశీలించిన.....స్పెషల్ సీఎస్.**

**ములుగు జిల్లా ప్రతినిధి ( అక్షర కలం) ఆగస్టు 5 :**



వర్షాకాలంలో తలెత్తే ముంపు సమస్యలను ఎదుర్కొనేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా సమాయాత్తం కావాలని రాష్ట్ర రెవెన్యూ (విపత్తు నిర్వహణ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఏటూర్ నాగారం ఐ టి డి ఏ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఐ టి డి ఏ పి. ఓ చిత్ర మిశ్రా, ఏ ఎస్ పి ఓ శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి లతో కలిసి వర్షాకాలంలో వరదల ముంపు నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు ప్రణాళికల్లో భాగంగా, వరద ముంపు ప్రాంతాలను గుర్తించడం, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, సహాయక చర్యలకు సిద్ధంగా ఉండటం వంటి అంశాలపై కూలంకషంగా సమీక్షించి సమర్ధవంతంగా నిర్వహించుటకు అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా స్పెషల్ సీఎస్ మాట్లాడుతూ గతంలో వరద ముంపు సమయంలో ప్రజలు పడిన ఇబ్బందులు పునరావృతం కాకుండా చూడాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రాణ, నష్టం జరుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటి నుంచే ముందస్తు చర్యలు తీసుకోవాలని, సకాలంలో స్పందించకపోతే చిన్న సమస్య కూడా పెద్ద విపత్తుగా మారే అవకాశం ఉంటుందని అరవింద్ కుమార్ అధికారులను హెచ్చరించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో ఎన్ డి ఆర్ ఎఫ్, జిల్లా అగ్నిమాపక శాఖ బృందాలు భారీ వర్షాల వల్ల నష్టం జరగకుండా ముంపు నుండి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. పునరావాస కేంద్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు.జిలా ఆధికారులతో వాట్సప్ గ్రూప్ ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి తగు చర్యలు చేపట్టాలని అన్నారు. సీజన్ వ్యాధులు ప్రబలే నేపథ్యంలో ముఖ్యంగా తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.ఎన్ డి ఆర్ ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ దామోదర్ సింగ్ మాట్లాడుతూ ముందస్తుగా వరద నివారణ ప్రణాళికలను చేసుకొన్నచో సునాయసంగా వరదనుండి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవచ్చునని అన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో తక్షణ చర్యలకు అవసరమైన సిబ్బంది వాహనాలు సిద్ధంగా ఉంచడం జరిగిందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ముందుగానే సమర్థవంతమైన ప్రణాళికతో ఉన్నట్లు తెలిపారు. సత్వర సహయార్థం జిల్లా కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. జిల్లాలో ఎన్ డి ఆర్ ఎఫ్, అగ్నిమాపక శాఖ బృందాలతో సేవలు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించి ఎప్పటికప్పుడు సానిటేషన్ నిర్వహణతో పాటు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టుటకు అప్రమత్తంగా ఉంచడం జరిగిందన్నారు. వర్షాకాలంలో ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో తాగునీటి కలిషితం కాకుండా ప్రత్యేక చొరవ తీసుకున్నట్లుతెలిపారు.భారీ వర్షాలు కురిసే క్రమం లో ప్రజలను సురక్షితం గా పునరావాస కేంద్రాలకు తరలించి వారికి బెడ్ షీట్లు ఆహారం అందించేలా ముందస్తు ఏర్పాట్లు చేసినట్లుతెలిపారు. శిథిల భవనాలకు నోటీసులు జారీ, వారిని తక్షణమే ఖాళీ చేయించడం జరుగుతున్నదని అన్నారు.ఈ సందర్భంగా పి ఓ చిత్ర మిశ్రా మాట్లాడుతూ ఐ టి డి ఏ కార్యాలయం లో టోల్ ఫ్రీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందనీ, వర్షానికి సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఉన్న సత్వరమే సహాయం అందించనున్నట్లు తెలిపారు .అంతకముందు కన్నాయి గూడెం మండలం తుపాకులగూడెం సమ్మక్క సాగర్ బ్యారేజ్ సురాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఐ టి డి ఏ పి ఓ చిత్ర మిశ్రా తో కలసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సమావేశంలో ఆర్డీఓ వెంకటేష్, ఏ పి ఓ వసంతరావు, జిల్లా ఇరిగేషన్ శాఖ అధికారి అప్పల నాయుడు, పంచాయితి రాజ్ , అగ్నిమాపక , ఆర్ డబ్లు ఎస్, అగ్రికల్చర్, సివిల్ సప్లై, విద్యుత్, వైద్య అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి.





**రాష్ట్ర రెవెన్యూ (విపత్తు నిర్వహణ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్.**

**విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేసిన ....స్పెషల్ సీఎస్, కలెక్టర్, పి ఓ.**

**ములుగు జిల్లా ప్రతినిధి( అక్షర కలం) ఆగస్టు 5 :**

విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని రాష్ట్ర రెవెన్యూ (విపత్తు నిర్వహణ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ సూచించారు.మంగళవారం ఏటూర్ నాగారం మండల కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాల ను స్పెషల్ సీఎస్, కలెక్టర్, పి ఓ తో కలిసి సందర్శించి, వంటశాల, ఆహారం నాణ్యత, స్టోర్ రూము, కూరగాయలు నిల్వలు, హాజరు పట్టిక, ఆహారం నాణ్యతపై విద్యార్థులు వ్రాసిన ఫీడ్ బ్యాక్, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పిస్తుందని, విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతో పాటు మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందించాలని స్పష్టం చేశారు. తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులను వినియోగించాలని, నాణ్యత, లేని సరుకులు వాపసు చేయాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల పఠనా సామర్థ్యం, ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ రోజు ఉదయం ఏం టిఫిన్ చేశారు, మంచిగా ఉందా అంటూ విద్యార్థుల ను అడిగారు. బావుందని చెప్పడంతో ఇలానే నాణ్యత పాటించాలని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది రావొద్దని సూచించారు.అనంతరం స్పెషల్ సీఎస్, కలెక్టర్, పి ఓ తో కలిసి వై టి సి లో భారీ వర్షాలు, ఎగువ నుంచి వస్తున్న నీటి వరదలకు అత్యవసరంగా సహాయక చర్యలు అందించుటకు సిద్ధంగా ఉన్న 25 మంది ఏన్ డి ఆర్ ఎఫ్ బృందం ఉపయోగించు పరికరాలను పరిశీలించారుఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, ఆర్డీఓ వెంకటేష్, ఏ పి ఓ వసంతరావు, డి డి పోచం, మండల ప్రత్యేక అధికారి రాంపతి, సంబంధిత అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓర్వలేకనే కాలేశ్వరం పై కుట్రలు...

**బడే నాగ జ్యోతి బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి**


**బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఎల్ఈడి స్క్రీన్ ద్వారా పార్టీ శ్రేణులతో కలిసి వీక్షించిన బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గం ఇంచార్జి బడే నాగజ్యోతి..**

**ములుగు జిల్లా ప్రతినిధి ( అక్షర కలం) ఆగస్టు 5:**


కాళేశ్వరం ప్రాజెక్టు కెసిఆర్ హయాంలో నిర్మించారనే అక్కసుతో కాంగ్రెస్ నాయకులు ఓర్వ లేని కుట్రలు చేస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గం ఇంచార్జి బడే నాగజ్యోతి గారు మరియు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆరోపించారు. ఈరోజు ములుగు జిల్లా కార్యాలయంలో ఎల్ఈడి స్క్రీన్ ద్వారా పవర్ ప్రజెంటేషన్ ద్వారా ప్రసారాన్ని వీక్షించడం జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టు పై చేస్తున్న కాంగ్రెస్ నాయకులు యొక్క దృష ప్రచారాలను తిప్పుకొట్టాలని కోరుతూ హైదరాబాదులోని తెలంగాణ భవన్ నుండి మాజీ ఆర్థిక శాఖ మంత్రి వర్యులు తన్నీరు హరీష్ రావు గారు ఎల్ఈడి స్క్రీన్ ద్వారా కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా బడే నాగజ్యోతి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు ఒక గుండెకాయ ఆమె పేర్కొన్నారు.అలాంటి కాళేశ్వరం ప్రాజెక్టును కమిషన్ల పేరుతో, కమిటీ నివేదికల పేరిట కెసిఆర్ పై కుట్రలు దిగుతున్నారని ఆమె కాంగ్రెస్ ప్రభుత్వం పై మండిపడ్డారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాళేశ్వరం కూలిందనిఅంటాడు.కాళేశ్వరం నీళ్లే గందమల్ల ప్రాజెక్టుకు ఎట్లా పోతున్నాయో సమాధానం చెప్పాలిసిన అవసరం ఉందని అన్నారు. అదేవిధంగా మల్లన్న సాగర్ నుండి నీళ్లు మూసీలోకి నీళ్లు పోయడానికి రూ.6000 కోట్లకు టెండర్లు ఎలా ఫైనల్ చెప్పాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు కూడా కాళేశ్వరంలోని అంతర్ భాగమే.కాళేశ్వరం కూలిందని అబద్దపు మాటలు చెప్పి.. గందమల్లకు పోయి కొబ్బరికాయలు కొట్టి, మల్లన్నసాగర్కు టెండర్లు ఎలా ఖరారు చేస్తారని ఆమె నిలదీశారు. కెసిఆర్ దురదృష్టంతో చేపట్టిన చర్యలు లో భాగంగా కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు నీరు అందించిన ఘనత కేసీఆర్ అని కొనిఆడారు. కాళేశ్వరం ప్రాజెక్టు భవిష్యత్తు తరాల కోసమే అని అభివర్ణించారు. కాంగ్రెస్ నాయకులు చేస్తున్న దృతప్రచారాలను గ్రామ గ్రామాన తిప్పి కొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అదేవిధంగా జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు గారు మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసమే కాళేశ్వరం కమిషన్ పేరుతో కాంగ్రెస్ నాయకులు లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆయన అన్నారు, స్థానిక సంస్థల ఎన్నికల కోసమే కమిషన్ల పేరుతో కాంగ్రెస్ రాజకీయం చేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పోరిక గోవింద్ నాయక్, తాటి కృష్ణ, వేములపల్లి బిక్షపతి, ములుగు మండల అధ్యక్షుడు స్థానికొమ్ము రమేష్ రెడ్డి, వెంకటాపూర్ మండల అధ్యక్షుడు లింగాల రమణారెడ్డి, గోవిందరావుపేట మండల అధ్యక్షుడు లకావత్ నరసింహ నాయక్, తాడువాయి మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, మాజీ జడ్పిటిసిలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, కార్యకర్తలు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక




# ఎన్టీఆర్ డ్యాన్స్ అదుర్స్

## వార్-2 ప్రచారంలో హృతిక్ రోషన్

ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ప్రధాన పాత్రల్లో రానున్న చిత్రం 'వార్ 2' ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా వీరిద్దరూ వరుస పోస్టలతో ఆడియన్స్‌లో జోష్ పెంచారు. ఈ సినిమాలో ఎన్టీఆర్, హృతిక్ పోటాపోటీగా తలపడనున్న విషయం తెలిసిందే. ఇప్పుడు సోషల్ మీడియాలో హ్యాష్‌ట్యాగ్ విషయంలోనూ ఈ ఇద్దరూ పోటీపడ్డారు. మాటల యుద్ధం ప్రారంభించారు. ప్రచారంలో భాగంగా హృతిక్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఎన్టీఆర్ డ్యాన్స్‌పై ప్రశంసలు కురిపించారు. 'నేను ఇప్పటివరకూ వర్క్ చేసిన సహనటుల్లో రిహార్సల్స్ అవసరం లేని ఒకేఒక్క హీరో ఎన్టీఆర్. ఎంత కష్టమైన మూమెంట్ అయినా ఆయన ప్రత్యేకంగా రిహార్సల్స్ చేయాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ప్రతి స్టెప్ ఆయనకి సులభమే. ఈ సినిమా షూటింగ్ సమయంలో తన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను' అని తెలిపారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్‌రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో భాగంగా 'వార్ 2' రూపొందింది. కియారా అడ్వాణీ కథానాయికగా కనిపించనున్నారు. మొదట ఈ సినిమా గురించి పోస్ట్ పెట్టిన హృతిక్. 'వార్ మొదలైంది. ఒక హ్యాష్‌ట్యాగ్ ఈ యుద్ధం గురించి మీకు చెబుతుంది. ఈ ట్యాగ్‌తోనే నేను ప్రత్యేకమైన సమాచారాన్ని పంచుకుంటాను' అని తెలిపారు. దీనిపై స్పందించిన ఎన్టీఆర్.. 'అప్‌డేట్స్, ప్రత్యేక విశేషాలు పంచుకుంటారా..!అనేది ఉపయోగించాలని మనం ముందే మాట్లాడుకున్నాం కదా. ఎందుకంటే అసలు యుద్ధం ప్రారంభమయ్యేది ఈవిధంగానే కాబట్టి ఈ హ్యాష్ ట్యాగ్‌నే వాడాలి' అంటూ రాసుకొచ్చారు. నేను చెప్పేది బాగుందని మీరు అన్నారు అంటే నేను గెలిచేసినట్లే.. హృతిక్ సర్' అంటూ ఎన్టీఆర్ ఓ ఎమోజీని పోస్ట్ చేశారు. వీరి పోస్ట్‌లు చూసినవారంతా సినిమా -టైటిల్‌కు తగినట్లుగానే వార్ చేసుకుంటున్నారని కామెంట్స్ చేస్తున్నారు. ఇద్దరు వారియర్స్ చేసుకున్న యుద్ధం మరో 10 రోజుల్లో మీ ముందుకురానుందని ఎన్టీఆర్ తెలిపారు.









# కూలీలో సైమన్ పాత్రలో ఒదిగిపోయిన నాగ్

## ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రజనీ

### ప్రశంసలు

'కూలీ' కథ చెప్పగానే అందులో సైమన్ పాత్ర తాను చేయాలన్నంత ఆసక్తి కలిగిందని దాన్ని నాగార్జున లాంటి నటుడు పోషించి అదరగొట్టారని అగ్ర కథానాయకుడు రజనీకాంత్ అన్నారు. ఆయన కీలక పాత్రలో లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కూలీ' ఆగస్టు 14న విడుదల కానుంది. ఈసందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన 'ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో రజనీకాంత్ స్పెషల్ వీడియోతో తెలుగు వారిని పలకరించారు. తెలుగు సినీ ప్రేక్షకులకు నా నమస్కారం. నేను ఇండస్ట్రీకి వచ్చి 50 ఏళ్లు. ఈ సంవత్సరంలో లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో నేను నటించిన 'కూలీ' ఆగస్టు 14న రావడం సంతోషంగా ఉంది. తెలుగులో రాజమౌళి ఎలాగో తమిళంలో లోకేశ్ కనగరాజ్ అలా. ఆయన చేసిన సినిమాలన్నీ హిట్. ఇంకొక గొప్ప విషయం ఏంటంటే, ఇందులో పలువురు స్టార్స్ నటించారు. చాలాఏళ్ల తర్వాత సత్యరాజ్‌తో చేస్తున్నా. ఇక శ్రుతిహాసన్, ఉపేంద్ర, సౌబిన్‌లతో పాటు- ఆమిర్‌ఖాన్ స్పెషల్ అపియరెన్స్ ఉంది. ముఖ్యంగా నాగార్జున ఇందులో విలన్‌గా చేస్తున్నారు. అసలు 'కూలీ' సబ్జెక్ట్ విన్న
వింటనే సైమన్ పాత్ర నేనే చేయాలన్న ఆసక్తి కలిగింది. ఆ పాత్ర ఎవరు చేస్తారా? అని ఎదురుచూశా. ఎందుకంటే చాలా స్టైలిష్‌గా ఉంటుంది. ఆర్నెళ్ల పాటు వెతికాం. ఈ పాత్ర గురించి ఒక నటుడితో ఆరుసార్లు సిటింగ్ అయింది. అయినా ఓకే అవలేదు' అని లోకేశ్ నాతో అన్నారు. 'ఎవరు ఆయన' అని నేను అడిగా. నాగార్జున పేరు చెప్పగానే ఆశ్చర్యపోయా. ఆ తర్వాత ఆయన ఒప్పుకొన్నారని తెలిసి సంతోషంగా అనిపించింది.




# జటాధర ఫస్ట్ లుక్ అదుర్స్

సుధీర్ బాబు హీరోగా ప్రతిష్టాత్మకంగా రూపొందుతోన్న చిత్రం 'జటాధర'. వెంకట్ కళ్యాణ్ దర్శకత్వంలో తేరకెక్కుతున్న ఈ సినిమా లో సుధీర్ బాబుతోపాటు బాలీవుడ్ హీరోయిన్ సోనాక్షి సిన్హా, శిల్పా శిరోద్కర్, రవి ప్రకాష్, ఇంద్ర కృష్ణ, నవీన్ నేని, శుభలేఖ సుధాకర్, రాజీవ్ కనకాల, ఝాన్సీ నటిస్తున్నారు. జటాధర చిత్రాన్ని ప్రేరణ అరోరా, శివన్ నారంగ్, అరుణ అగర్వాల్ నిర్మిస్తుండగా.. ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ అయిన ఫస్ట్ లుక్ పోస్టర్స్ ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేయగా. ఈ సినిమా నుంచి సాలిడ్ అప్డేట్ ఇచ్చేందుకు చిత్ర యూనిట్ రెడీ అయ్యింది. 'జటాధర' మూవీకి సంబంధించిన టీ-జర్ ను ఆగస్టు 8న విడుదల చేయబోతున్నట్లు- అధికారంకంగా ప్రకటించారు . అలాగే ఓ పవర్ ఫుల్ పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. ప్రజంట్ ఈ న్యూస్ వైరల్ అవుతుండడంతో సుధీర్ బాబు అభిమానులు ఫుల్ ఖుష్ అవుతున్నారు.

# సైయారా విజయం అద్భుతం: మోహిత్ సూరి

ప్రేక్షకులు ఎలాంటి సినిమాలకు ఎలా రియాక్ట్ అవుతున్నారో చెప్పడం కష్టతరంగా మారింది. వంద కోట్ల బడ్జెట్‌తో వచ్చిన సినిమాలను కనీసం పటించుకోవడంలేదు.. ఊహించని విధంగా చిన్న సినిమాలను మాత్రం ఆకాశానికి ఎత్తేస్తున్నారు. ఇందుకు నిదర్శనం 'సైయారా'. ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే రూ.400 కోట్లకు పైగా వసూళ్లు సాధించడం విశేషం. దీంతో ఈ చిత్ర దర్శకుడు మోహిత్ సూరి వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలుపుతున్నారు. ఇందులో భాగంగా తాజాగా ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కెరీర్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. నా 17ఏళ్లు వయస్సులో మొదటిసారి సెట్‌లో అడుగుపెట్టాను. అలా ఐదేళ్లు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసి 22 ఏళ్లకు దర్శకత్వం ప్రారంభించాను. ఇప్పుడు నా వయసు 44 ఏళ్లు. సగం జీవితం సినిమా సెట్‌లలోనే గడిచిపోయింది. అదేంటో తెలీదు కానీ ఆ వాతావరణంలో నేను నాకు నచ్చినట్లు- ఉండగలను. సామాజిక కార్యక్రమాల్లో, ఈవెంట్‌లలో నేను మాములుగా ఉండాలని ప్రయత్నించినా ఇబ్బందిగానే ఉంటుంది.



# క్రిస్ వోక్స్ రియల్ హీరో..!

క్రికెట్‌లో ఒంటి చెత్తో బ్యాటింగ్ అంటే మాటలు కాదు. ఒకవైపు వికెట్లు పడిపోతుంటే.. తన తోటి ఆటగాళ్లు క్యాబిన్‌కి పరుగు పెడుతుంటే.. క్రీజ్ మీద ఒంటరిగా నిలబడి జట్టు గౌరవాన్ని కాపాడే బ్యాట్స్‌మెన్ నిజంగా హీరో. అలాంటి సందర్భాల్లో జట్టుకు పునాదిగా నిలిచేవాడే అసలైన వీరుడు. అలాంటి ఓ సందర్భమే ఓవల్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో జరిగింది. లండన్‌లోని కెన్నింగ్టన్ ఓవల్ వేదికగా భారత్ ,ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న ఐదో టెస్టు మ్యాచ్‌లో టీమిండియా అద్భుతం చేసింది. ఇంగ్లాండ్‌పై థ్రిల్లింగ్ విక్టరీ కొట్టి.. సిరీస్‌ను సమం చేసింది. ఇంగ్లాండ్ పై ఓడిపోయే టెస్టులో 6 పరుగుల తేడాతో సూపర్ విక్టరీ నమోదు చేసింది.



ఐదో రోజు గెలుపుకి నాలుగు వికెట్లు కావాల్సి ఉండగా.. భారత బౌలర్ మహ్మద్ సిరాజ్ 5 వికెట్లు, ప్రసిద్ధ్ కృష్ణ 4 వికెట్లు తీసి టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించారు..ఈ మ్యాచ్ తొలి రోజు ఆటలో క్రిస్‌వోక్స్ గాయపడిన సంగతి తెలిసిందే. బౌండరీ లైన్ వద్ద ఫీల్డింగ్ చేస్తూ క్రిస్ వోక్స్ గాయపడగా.. అతని భుజానికి తీవ్ర గాయమైంది. గాయం కారణంగా అతడు



చేతికి స్లింగ్ తగిలించుకుని కనిపించాడు. దీంతో అతను ఈ మ్యాచ్‌కు పూర్తిగా దూరమైనట్లేనని అందరూ భావించారు. ఇంగ్లాండ్ ఆటగాళ్లు ఒక్కొక్కరిగా పెవిలియన్‌కి వెళ్తుండటం.. మరో వికెట్ పడితే మ్యాచ్ భారత్ గెలవడం ఖాయం అనుకున్నప్పుడు.. అప్పుడు వచ్చాడు క్రీజులోకి క్రిస్ వోక్స్. అవసరమైతే క్రిస్ బ్యాటింగ్ చేస్తాడని జో రూట్ ముందుగానే చెప్పినట్టుగానే.. తన జట్టును ఓటమి నుంచి తప్పించడానికి క్రిస్ వోక్స్ బ్యాటింగ్‌కి వచ్చాడు. చేతికి గాయం కావడంతో ఒంటి చేత్తో బ్యాటుని పట్టుకుని క్రీజులోకి వచ్చాడు క్రిస్ వోక్స్. దీంతో అతనికి స్ట్రైయిక్ ఇవ్వకుండా గస్ అట్కిన్సన్ బ్యాటింగ్ చేయడం మొదలెట్టాడు. క్రిస్ వోక్స్ 11వ ఆటగాడిగా బ్యాటింగ్‌కు వచ్చినప్పటికీ.. ఒక బాల్ కూడా ఫేస్ చేయకముందే.. ఇండియా బౌలర్లు మ్యాజిక్ చేయడంతో ఇన్నింగ్స్ ముగిసిపోయింది.



# క్రిస్ వోక్స్ గాయంవల్లే గెలిచే మ్యాచ్‌లో ఓడాం

## ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్

తొలి రోజు ఆటలోనే క్రిస్ వోక్స్ గాయపడటం తమ విజయవకాశాలను దెబ్బతీసిందని ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ తెలిపాడు. వోక్స్ గాయపడినా జట్టు కోసం బ్యాటింగ్‌కు దిగడం గొప్ప విషయమని చెప్పాడు. ఉత్కంఠగా సాగిన ఆఖరి టెస్ట్‌లో టీమిండియా 6 పరుగుల తేడాతో



విజయం సాధించింది. 339/6 ఓవర్ నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లండ్.. 367 పరుగులకు ఆలౌటైంది. మహమ్మద్ సిరాజ్(5/104) ఐదు వికెట్లతో భారత్‌కు చిరస్మరణీ వియాజయాన్నందించాడు. సిరాజ్‌తో పాటు ప్రసిధ్ కృష్ణ(4/126) నాలుగు వికెట్లు తీయగా ఆకాష్ దీప్ ఓ వికెట్ పడగొట్టాడు. ఈ గెలుపుతో ఐదు టెస్ట్‌ల సిరీస్ 2-2తో సమంగా నిలిచింది. ఇంగ్లండ్ విజయం కోసం గాయంతో బ్యాటింగ్‌కు దిగిన క్రిస్ వోక్స్(0 నాటౌట్)తో కలిసి గస్ అట్కిన్సన్(17) పోరాడినా ఫలితం లేకపోయింది. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన బెన్ స్టోక్స్.. ఆఖరి టెస్ట్‌కు దూరమవ్వడం నిరాశకు గురి చేసిందన్నాడు. 'మ్యాచ్ ఆడకుండా డ్రెస్సింగ్ రూమ్‌లో ఉండటం చాలా కష్టంగా ఉంటుంది. ఇది మరో అద్భుతమైన పోరాటం. ఈ మ్యాచ్ కూడా ఐదో రోజుల పాటు సాగింది. ఇరు జట్లు విజయం కోసం తీవ్రంగా ప్రయత్నించాయి. సాయశక్తులా పోరాడాయి. ఈ మ్యాచ్‌లో మేం గెలవకపోవడం నిరాశకు



గురిచేసింది. కానీ ఇంగ్లండ్ ప్రదర్శన పట్ల నేను గర్వపడుతున్నాను. ఈ సిరీస్ గెలవకపోవడం కూడా నిరాశకు గురి చేసింది. గాయంతో క్రిస్ వోక్స్ బ్యాటింగ్‌కు దిగడం అద్భుతం. కండిషన్స్ డిమాండ్ చేస్తే బ్యాటింగ్ చేయాలనే ఆలోచనతో క్రిస్ వోక్స్ ఉన్నాడు. నిన్న మొత్తం గాయమైన చేతితో బ్యాటింగ్ ఎలా చేయాలని అతను ఆలోచించాడు. ఇరు జట్లలో విరిగిన చేతులు, కాళ్లతో ఆడిన ఆటగాళ్లు ఉన్నారు. ఇది వారి దేశం తరఫున ఆడటం ఎంత ముఖ్యమో తెలియజేస్తోంది. గాయాలతో బ్యాటింగ్ చేయడం పట్ల నేను గర్వపడుతున్నాను. శుభ్‌మన్ గిల్ కూడా గర్వపడుతాడని అనుకుంటున్నా. భారత్, ఇంగ్లండ్ టెస్ట్ సిరీస్ ఎప్పుడూ పెద్ద సిరీసే. మైదానంలో చాలా భావోద్వేగాలను చూస్తారు. అయితే మైదానంలో చోటు చేసుకున్న ఘటనలపై మేం ఏడుస్తూ కూర్చోం. భారత ఆటగాళ్లు కూడా అంతే. అదంతా ఆటలో భాగమే. మైదానం బయట మేమంతా స్నేహితులమే. ఈ సిరీస్‌లో ఆల్‌రౌండర్‌గా నా పాత్రను నిర్వర్తించడానికి నేను చాలా కష్టపడ్డాను. ఈ మ్యాచ్ ఆడలేకపోవడం తీవ్ర నిరాశకు గురి చేసింది. రిహాబిలిటేషన్ తీసుకొని యాషెస్ సిరీస్‌కు సిద్ధమవ్వాలి. ఆట ఆరంభంలోనే ఓ బౌలర్ గాయపడితే ప్రణాళికలు మొత్తం మారిపోతాయి. రెండో ఇన్నింగ్స్‌లో మా బౌలర్లు చూపించిన పోరాటం అద్భుతం. ఆటగాళ్ల నుంచి మేం కోరుకునేది ఒక్కటే.. జట్టు కోసం వారి సర్వస్వం ఇవ్వాలి. మా బౌలర్లలో ఒకరు గాయపడటం మా విజయవకాశాలను దెబ్బతీసింది. అయినా మా ముగ్గురు బౌలర్లు అసాధారణ ప్రదర్శన కనబర్చారు.'అని బెన్ స్టోక్స్ చెప్పుకొచ్చాడు.



# సిరాజ్ అద్భుత ప్రదర్శనతోనే గెలిచాం

## టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్

మహమ్మద్ సిరాజ్ అద్భుత ప్రదర్శనతోనే ఓడిపోయే మ్యాచ్‌లో విజయం సాధించామని టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. అతను జట్టులో ఉండటం తమ అదృష్టమని చెప్పాడు. ఉత్కంఠగా సాగిన ఆఖరి టెస్ట్‌లో టీమిండియా 6 పరుగుల తేడాతో విజయం సాధించింది. 339/6 ఓవర్ నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లండ్.. 367 పరుగులకు ఆలౌటైంది. మహమ్మద్ సిరాజ్(5/104) ఐదు వికెట్లతో భారత్‌కు చిరస్మరణీయ వియాజయాన్నందించాడు. సిరాజ్‌తో పాటు ప్రసిధ్ కృష్ణ(4/126) నాలుగు వికెట్లు తీయగా ఆకాష్ దీప్ ఓ వికెట్ పడగొట్టాడు. ఈ గెలుపుతో ఐదు టెస్ట్‌ల సిరీస్ 2-2తో సమంగా నిలిచింది. ఈ సిరీస్‌లో అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చిన శుభ్‌మన్ గిల్.. భారత్



తరఫున ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. మ్యాచ్ అనంతరం మాట్లాడిన శుభ్‌మన్ గిల్.. కెప్టెన్‌గా ఈ సిరీస్‌ను సమం చేసుకోవడం సంతోషంగా ఉందన్నాడు. 'ఈ సిరీస్ హోరా హోరీగా సాగింది. ప్రతీ మ్యాచ్‌లోనూ ఆఖరి రోజు వరకు ఏ జట్టు గెలుస్తుందో కూడా చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఇది ఇరు జట్ల అత్యుత్తమ ప్రదర్శనను తెలియజేస్తోంది. తప్పక గెలవాల్సిన ఈ మ్యాచ్‌లో విజయం సాధించినందుకు చాలా సంతోషంగా ఉంది. సిరాజ్, ప్రసిధ్ కృష్ణ అద్భుతంగా బౌలింగ్ చేయడంతో కెప్టెన్‌గా నా పని సులువైంది. బంతి రెండు వైపులా స్వింగ్



కావడంతో ఇంగ్లండ్ బ్యాటర్లు ఒత్తిడికి లోనయ్యారు. ఈ ఉదయం మా బౌలర్ల స్పెల్ అద్భుతం. ఈ విజయంపై మేం చాలా నమ్మకంగా ఉన్నాం. ఇంగ్లండ్ బ్యాటర్లు నిన్న కూడా ఒత్తిడిలో కనిపించారు. ఒత్తిడిలో చాలా తప్పిదాలు జరుగుతాయి. నాలుగో రోజు ఆట ఆఖరి సెషన్‌లో వారు చేసిన 36 పరుగులను ఒత్తిడిలోనే చేశారు. సిరాజ్‌లాంటి బౌలర్‌ను ప్రతీ కెప్టెన్ కావాలనుకుంటాడు. ఐదు టెస్ట్ మ్యాచ్‌ల్లో అతను వేసిన ప్రతీ బంతి, ప్రతీ స్పెల్ తన సర్వస్వాన్ని ఇచ్చింది. ప్రతీ కెప్టెన్, ప్రతీ జట్టు అతనిలాంటి ఆటగాడిని కోరుకుంటుంది. అలాంటి ఆటగాడు మా జట్టులో ఉండటం మా అదృష్టం. ఈ సిరీస్ సమం అవ్వడం సంతోషంగా ఉంది. ఈ సిరీస్ ఆసాంతం ఇరు జట్లు అద్భుతంగా ఆడాయి. ఆఖరి రోజు వరకు ఏ జట్టు గెలుస్తుందో చెప్పలేని రీతిలో ఈ సిరీస్ సాగింది. ఇరు జట్లు బ్రాండ్ ఆఫ్ క్రికెట్ ఆడాయి. ఈ సిరీస్‌లో అత్యుత్తమ బ్యాటర్‌గా నిలవడం చాలా సంతోషంగా ఉంది. ఈ సిరీస్ ముందే బ్యాటర్‌గా సత్తా



చాటాలనుకున్నాను. దాని కోసం కొన్ని విషయాలపై ప్రత్యేక దృష్టి సారించాను. అత్యుత్తమ బ్యాటర్‌గా నిలవడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. ఆ లక్ష్యాన్ని అందుకోవడం సంతోషంగా, సంతృప్తికరంగా ఉంది. బ్యాటర్‌గా రాణించేందుకు టెక్నికల్‌గా, మానసికంగా బలంగా ఉండటంపై ఫోకస్ పెట్టాను. మానసికంగా దృఢంగా ఉంటేనే.. రాణించగలుగుతారు. మా యంగ్ టీమ్ కాదు.. గన్ టీమ్'అని శుభ్‌మన్ గిల్ చెప్పుకొచ్చాడు.

# నిధుల్లేక నీరసం

## ముందుకు సాగని సాగునీటి ప్రాజెక్టుల పనులు ఐదేళ్లలో కేటాయింపులు ఘనం..ఖర్చు స్వల్పమే



: రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని ప్రభుత్వం విస్మరించింది. తమ పార్టీ అధికారంలోకి రాగానే ప్రాధాన్యతా క్రమంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక సాగునీటి ప్రాజెక్టులన్నిటినీ అటకెక్కించారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం నుండి కరువు ప్రాంతాలకు జలకళను పంచే హంద్రీనీవా సుజల స్రవంతి, గాలేరు నగరి స్రవంతి, రాయలసీమ ఎత్తిపోతల పథకం, వెలిగొండ ప్రాజెక్టు, పల్నాడు కరువు నివారణ ప్రాజెక్టు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఇలా ప్రతి ప్రాజెక్టు నిర్మాణం ఈ ఐదేళ్లకాలంలో నిధుల్లేక నీరసించిపోయాయి. బడ్జెట్ కేటాయింపుల్లో రూ.61,573 కోట్లు చూపినా.. రూ.33 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు లెక్కలు తెలుపుతున్నాయి. తాము అధికారంలోకి రాగానే పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ ఇచ్చి ప్రాజెక్టును సత్వరం పూర్తి చేస్తామని చెప్పినప్పటికీ చేసింది లేదు. పునరావాసానికి నిధులివ్వని కేంద్రాన్ని నిలదీసిందీ లేదు. రెండు దశలుగా నిర్మాణాన్ని పూర్తి చేస్తామని చెప్పిన ప్రభుత్వం మొదటి దశకు సంబంధించి 41.15 మీటర్లు వరకూ వుండే పునరావాసానికి కూడా నిధులివ్వలేదు. 2019 నాటికి పూర్తి చేస్తామని టిడిపి ప్రభుత్వం చెబితే, 2021 నాటికి పూర్తి చేస్తామని వైసిపి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటనలు చేసినా.. 2026 నాటికి గానీ మొదటి దశ పనులు పూర్తికావని కేంద్ర ప్రభుత్వం ఏకంగా పార్లమెంటులో ప్రకటన చేసింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పోలవరం ప్రాజెక్టును అటకెక్కించి నట్లే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సిన ప్రాజెక్టులన్నింటినీ నిలిపేసింది. అలాగే వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి రెండు టన్నెల్ నిర్మాణాలు పూర్తయినా పునరావాసానికి సంబంధించి భూసేకరణ కోసం రూ.1,100 కోట్లు చెల్లించక పోవడంతో నీరు ఎప్పుడు వస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ప్రాజెక్టు పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజె క్టును అటకెక్కించేశారు. హంద్రీనీవా ప్రాజెక్టుకు సంబంధించి రెండో దశ విస్తరణ పనులను ప్రారంభించ కుండా కాంట్రాక్టరు మొండికేశారు. పనులు చేస్తే బిల్లులు రావనే కారణంతో చాలా పనులకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు పనులు చేయని పరిస్థితి వుంది. కొత్త ప్రాజెక్టులను అటకెక్కిం చడమే కాదు.. వున్న ప్రాజెక్టుల నిర్వహణకు నిధులివ్వలేదు. అలాగే పులిచింతల ప్రాజెక్టు, పించా డ్యామ్, అన్నమయ్య, గుండ్లకమ్మ తదితర ప్రాజెక్టులు ధ్వంసమయ్యాయి. సాగునీటి ప్రాజెక్టులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# చంద్రబాబు కోరుకునే రాష్ట్ర ప్రయోజనాల్లో స్టీల్‌ప్లాంట్ స్థానం ఎక్కడ ?

### ఉక్కు ఫ్యాక్టరీ వైపు కన్నెత్తి చూడలేదెందుకు !

### నామమాత్రంగానే రాష్ట్ర ప్రభుత్వ స్పందన

### విశాఖ కార్మికులు, ప్రజల్లో నడుస్తోన్న చర్చ

రాష్ట్ర విస్తృత ప్రయోజనాలు, ప్రజల భవిష్యత్తు కోసమే బిజెపితో తెలుగుదేశం పార్టీ పొత్తు పెట్టుకుందని ప్రకటించిన చంద్రబాబుకు మూడేళ్లుగా స్టీల్‌ప్లాంట్ గుర్తుకు రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, పోలవరం ప్రాజెక్టు తర్వాత వెంటనే వినపడేది వైజాగ్ స్టీల్‌ప్లాంట్ రక్షణ అన్నది ఆ పార్టీ నాయకులు సైతం చటుక్కున చెబుతారు. కేంద్రంలోని మోడీ సర్కారు మూడేళ్ల క్రితం విశాఖ స్టీల్‌ప్లాంట్ వంద శాతం వ్యూహాత్మక అమ్మకం చేస్తున్నట్లు తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్ష అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యతిరేకించలేదు. ఇటీవల కేంద్రంలోని బిజెపితో పొత్తు పెట్టుకున్నప్పుడు సైతం టిడిపి, జనసేన అధినేతలు స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను ఆపుతామని చెప్పకపోవడం ఏ ప్రయోజనాల కోసం వీరు బిజెపితో కలిశారు? అన్న ప్రశ్న రాష్ట్రంలోని కార్మికులే కాదు అన్ని తరగతుల నుంచీ వినిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం, అధికార వైసిపి నామ్‌కేవాస్తేగా ఒక తీర్మానం చేసిందే తప్ప, ప్రయివే టీకరణకు వ్యతిరేకంగా కేంద్రాన్ని నిలేసింది లేదు. వారి తీరు అలా ఉంటే, వీరి తీరు ఇలా ఉంది.

### కనీసం ఆ సభలోనైనా ప్రకటన వస్తుందని

చిలకలూరిపేటలో ఇటీవల జరిగిన బిజెపి, టిడిపి, జనసేన (కూటమి) సభకు దేశ ప్రధానమంత్రి మోడీ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన ద్వారా చంద్రబాబు, పవన్ కల్యాణ్ 'స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ జరగదు' అన్న ప్రకటన చేయిస్తారన్న ఆశతో కార్మికులు చూశారు. కానీ, సభ అంతా పూర్తయినా స్టీల్‌ప్లాంట్ ఊసే లేకపోవడం ప్రజలను తీవ్ర మనస్తాపానికి గురిచేసింది. మోడీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు కుట్రలు కొనసాగిస్తుండడంతో పాటు సొంత గనులు ఇవ్వకుండా ప్లాంట్‌ను ఎండగట్టేసింది. బ్లాస్ట్ ఫర్నేస్-3లోకి జిందాల్‌ను




తీసుకొచ్చేసింది. పలు విభాగాలను ముక్కలు ముక్కలు చేసి ప్రయివేట్ వారికి ఇచ్చేయాలన్న కుట్రలు బిజెపి చేస్తూనే ఉంది.

### ఎందుకు పర్యటించడం లేదు ?

వైజాగ్ స్టీల్‌ను రక్షించుకోవడానికి 1144 రోజులు పోరాటం కొనసాగుతున్నా ఏనాడూ ప్లాంట్ పర్యటనకు చంద్రబాబు రాలేదు. కార్మికులను కలవడంగానీ, వారి పోరాటానికి మద్దతు ప్రకటించడంగానీ చేయలేదు. ఇది స్టీల్‌ప్లాంట్ కార్మికుల్లో తీవ్ర అసంతృప్తిని కలిగించింది. కేంద్రం స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరించాలని నిర్ణయిస్తే ఆ పార్టీతో మీరెలా పొత్తుపెట్టుకున్నారంటూ ఉక్కులో టిఎన్‌టియుసి నేతలను మిగతా కార్మికులు ప్రశ్నిస్తుండడంతో వారి నోట సమాధానం రావడం లేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్ వద్ద లేదా రాష్ట్రంలో ఎక్కడ సభ నిర్వహించినా వైసిపి కబంధ హస్తాల్లో రాష్ట్రం చిక్కుకుందంటూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ అన్నారే తప్ప, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ సరైంది కాదని ప్రకటించలేదు. టిడిపి నాయకుడు పల్లా శ్రీనివాసరావు (గాజువాక టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి) దీక్ష చేసినప్పుడు సైతం ఆయనను పరామర్శించడానికి రాలేదంటే బిజెపి నిర్ణయాన్ని వ్యతిరేకించే ఉద్దేశం చంద్రబాబుకు లేదని స్పష్టమవుతోంది.

### నాగర్‌నార్ ఉక్కు ఫ్యాక్టరీ ప్రతిపక్షాల ఆందోళనతో నిలవలేదా ?

కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలపై ప్రజలు, కార్మికులు చేస్తోన్న పోరాటాలు ఆయా రాష్ట్రాల్లోని అధికార పక్షం లేదా ప్రతిపక్షం కలిసి వస్తే విజయం అవుతాయి. దీనికి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నాగర్‌నార్ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణ పోరాటం తాజా ఉదాహరణ. ఈ ఫ్యాక్టరీని బిజెపి ప్రయివేటీకరణకు పెట్టిన సందర్భంగా అక్కడి ప్రతిపక్షాలు పోరాడి నిలుపుదల చేశాయి. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ విషయంలో మన రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాలు రెండూ బిజెపి నిర్ణయాన్ని గట్టిగా వ్యతిరేకించడం లేదు. 2024 ఎన్నికల్లో అధికారం కోసం ఆశిస్తోన్న టిడిపి, ఈ రాష్ట్ర జనహితం, భవిష్యత్తు కోసం దేనికైనా సిద్ధం అని చెప్పుకుంటున్న జనసేన కూడా బిజెపికి వంతపాడుతూ వస్తున్నాయి. బిజెపితో పొత్తు జనహితమేనని జనసేన అధినేత పవన్ కల్యాణ్ చెబుతున్నప్పుడు వైజాగ్ స్టీల్‌ప్లాంట్ జనహితం కాదా? అనేది చెప్పాలి.

# 'కొల్లేరు'పై కల్లబొల్లి మాటలు !

## ప్రజలను మోసగిస్తున్న అధికార, ప్రతిపక్ష పార్టీలు


: కొల్లేరు ప్రజలను మరోసారి మోసగించేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలు సిద్ధమయ్యాయి. ఓట్ల కోసం నిస్సిగ్గుగా మాయమాటలు చెబుతున్నాయి. కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని, అక్కడి ప్రజలను ఆదుకుంటామని చెప్పి మళ్లీ హామీలు గుప్పిస్తున్నాయి. కొల్లేరు ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపకుండా వంచించడంలో ప్రధాన ముద్దాయి బిజెపినే. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న ఆ పార్టీకి కాంటూరు కుదింపు ఏమంత కష్టం కాదు. మాతోనే కొల్లేరు సమస్య పరిష్కారమంటూ కైకలూరు బిజెపి అభ్యర్థి మళ్లీ చెప్తుండడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొల్లేరు ప్రాంతం 77 వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. కొల్లేరులో బెడ్, బెల్ట్ గ్రామాలు 120కుపైగా ఉన్నాయి. ఈ గ్రామాల్లోని లక్షలాది మంది ప్రజలు కొల్లేరుపై ఆధారపడి జీవిస్తున్నారు. కొల్లేరులో సంప్రదాయ పద్ధతిలో రైతులు వరి సాగు చేసేవారు. జలగం వెంగళరావు ప్రభుత్వ హయాంలో కొల్లేరు గ్రామాల్లో సొసైటీలు ఏర్పాటు చేసి భూములను పంపిణీ చేశారు. భూములు చేపల చెరువులకు అనుకూలంగా ఉంటాయంటూ ప్రభుత్వమే బలవంతంగా చేపల చెరువులు తవ్వించింది. అయితే, 2005లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో కొల్లేరులోని చేపల చెరువులన్నింటినీ బాంబులు పెట్టి ధ్వంసం చేశారు. కొల్లేరు భూములనే కాకుండా దాదాపు పది వేల ఎకరాల్లోని పట్టా భూముల్లోని చెరువులను ధ్వంసం చేయడంతో అప్పటి నుంచి కొల్లేరు ప్రజల బతుకులు దుర్భరంగా మారాయి. ఉపాధి లేక కర్ణాటక, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలకు వలస వెళ్లి బతుకులు నెట్టుకొస్తున్నారు. రాష్ట్ర విభజన తర్వాత 2014లో టిడిపి, బిజెపి కలిసి ఎన్నికల్లో పోటీ చేశాయి. భీమవరంలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని అభ్యర్థిగా ఉన్న మోడీ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని హామీ ఇచ్చారు. దీంతో, కైకలూరు ఎమ్మెల్యేగా బిజెపి అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌ను ప్రజలు గెలిపించారు. సర్వేల పేరుతో హడావుడి చేయడం తప్ప, కొల్లేరు ప్రజలకిచ్చిన మాటను నిలుపుకోలేదు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలంటూ అసెంబ్లీలో తీర్మానం చేసి రాష్ట్రంలోని టిడిపి, బిజెపి ప్రభుత్వం అప్పట్లో చేతులు దులుపుకుంది. ధ్వంసం చేసిన పట్టా భూములను రైతులకు అప్పగించలేదు. అధికారులు, రాజకీయ నాయకుల చుట్టూ తిరుగుతున్నా బాధిత ప్రజలకు నేటికీ న్యాయం జరగలేదు.

### ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో వైసిపి వెన్నుపోటు !

2019 ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే కొల్లేరు ప్రజలకు న్యాయం చేస్తామంటూ వైసిపి హామీ ఇచ్చింది. అయితే, అధికారంలోకి వచ్చాక మూడో కాంటూరు కుదింపుపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేలేకపోయింది. కొల్లేరును పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీనీ గాలికొదిలేసింది. మూడో కాంటూరుకు కుదింపును పక్కనపెట్టి ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో కొల్లేరు ప్రజలకు వెన్నుపోటు పొడిచేందుకు సిద్ధమైంది. కొల్లేరును పదో కాంటూరు వరకూ విస్తరించేందుకు ఏరియల్ సర్వే నిర్వహించడంతోపాటు మండల కేంద్రాల్లో ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసింది. దాదాపు మరో 80కుపైగా గ్రామాలను ఎకోసెన్సిటివ్ జోన్‌లోకి చేర్చేందుకు ప్రణాళికలు రూపొందించింది. ప్రజలు వ్యతిరేకిస్తున్నా పట్టించుకోలేదు.

### మళ్లీ ఓట్ల కోసం మోసపూరిత మాటలు

ప్రస్తుత ఎన్నికల్లో టిడిపి, బిజెపి, జనసేన కూటమిగా ఏర్పడి పోటీ చేస్తున్నాయి. పొత్తులో భాగంగా కైకలూరులో బిజెపి పోటీ చేస్తోంది. 2014లో గెలుపొందిన కామినేని శ్రీనివాస్‌కే మరోసారి టికెట్ దక్కింది. అప్పుడు ఐదేళ్లపాటు కొల్లేరు ప్రజలను మోసగించిన బిజెపి అభ్యర్థి%ా% కొల్లేరు సమస్య మాతోనే పరిష్కారమంటూ ఇప్పుడు మళ్లీ కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారు. వైసిపి, టిడిపి కూడా కొల్లేరు ప్రజలను మరోసారి మాటమాటలతో మభ్యపెట్టాలని చూస్తున్నాయి. ఈ పార్టీల తీరును నిశితంగా గమనిస్తున్న కొల్లేరు ప్రజలు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తామని అంటున్నారు.



# ఎంపీ వద్దిరాజు డిమాండ్

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

దేశ జనాభాలో 60%పైగా ఉన్న బీసీలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆవేదన వ్యక్తంచేశారు.దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 80 ఏండ్లు సమీపిస్తున్నా రాజ్యాధికారంలో బీసీలకు సరైన వాటా లభించకపోవడం, చాలా కులాల వాళ్లు చట్టసభల్లో కాలు కూడా పెట్టకపోవడం బాధాకరమన్నారు. బీసీలపై ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అన్ని విధాలా వివక్ష కొనసాగుతుండడం విచారకరమని ఎంపీ రవిచంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో,విద్యా , ఉద్యోగ రంగాలలో 42% రిజర్వేషన్లు కల్పిస్తామని,ప్రతి వార్షిక బడ్జెట్ లో 20,000 కోట్ల రూపాయలు కేటాయిస్తామని కామారెడ్డి బహిరంగ సభలో కాంగ్రెస్ ఆర్భాటంగా ప్రకటించి అధికారంలోకి వచ్చాక మాయమాటలతో కాలం వెళ్లదీస్తున్నదని కాంగ్రెస్ వైఖరిని ఎండగట్టారు.కామారెడ్డి డిక్లరేషన్ లో, ఎన్నికల మేనిఫెస్టోలో,ప్రచార సభల్లో చేసిన వాగ్దానం మేరకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరాల్సిందేనని ఎంపీ రవిచంద్ర డిమాండ్ చేశారు.అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను కేంద్రానికి పంపించి కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు దులుపుకుందామని చూస్తున్నదని, కేంద్రంలోని బీజేపీ పాలకులు ఇది తెలంగాణకు సంబంధించిన అంశంగా చూస్తూ ఏ మాత్రం స్పందించడం లేదన్నారు.ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్,అన్ని వర్గాల ప్రజలు వత్తిడి పెంచడంతో తెలంగాణ పాలకులు, కాంగ్రెస్ నాయకత్వం దేశ రాజధాని ఢిల్లీ చేరుకుని హడాహుడి చేస్తున్నదని, ధర్నాలు, ప్రెస్ మీట్స్ వల్ల ప్రయోజనం ఉండదన్నారు.ప్రధాని నరేంద్రమోడీని ఒప్పించేందుకు సోనియా, రాహూల్ గాంధీల నేతృత్వంలో అఖిలపక్షాన్ని తీసుకెళ్లడమే ఉత్తమ మార్గమని ఎంపీ రవిచంద్ర అభిప్రాయపడ్డారు.ప్రధాని మోడీ కూడా ఓబీసీకి చెందిన వారేనని,ఆయనపై మరింత వత్తిడి పెంచి ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టించేందుకు ఇదే సరైన సమయమన్నారు.కాంగ్రెస్,దాని నేతృత్వంలోని ఇండియా కూటమికి లోకసభ, రాజ్యసభ ల్లో 300 మందికిపైగా సభ్యులున్నారని,బీసీ బిల్లుకు సునాయాసంగా ఆమోదం లభిస్తుందని, ఇందుకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతునిస్తుందని ఎంపీ రవిచంద్ర వివరించారు.బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్ మార్గదర్శనంలో బీసీలం రాజకీయ అస్తిత్వ, ఆత్మగౌరవ పోరాటం చేస్తున్నామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో, చట్టసభల్లో రిజర్వేషన్స్ సాధించే వరకు పోరాడుతూనే ఉంటామని ఎంపీ వద్దిరాజు స్పష్టం చేశారు.



# సాధారణ ప్రసవాలు జరిగేలా వైద్యాధికారులు చర్యలు చేపట్టాలి... జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

### పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలి

### వర్షాకాలం దృష్టా ఆరోగ్య కేంద్రాల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి

### తిరుమలాయపాలెంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ప్రకృతి వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా నిరంతరం అందుబాటులో ఉండేలాగా వైద్యులు, సిబ్బంది బాధ్యతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రకృతి



వైద్యశాల, సామాజిక ఆర్యోగ కేంద్రాలను జిల్లా కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపి సేవలు, ఐపీ సేవలు, మెడికల్ ఫార్మసి, ఎమర్జెన్సీ ఓ.టి, క్యాజువాల్టీ, ఇన్ పేషంట్, పురుషుల వార్డు, ప్రసవ గది, ఇసిజి రూమ్, ల్యాబ్ శాంపిల్ గది, ఫీవర్ రిజిస్టర్ పరిశీలించారు. పేషంట్ల వార్డుల కిటికీలకు పరదాలు పెట్టాలన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని అన్నారు.ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి నేరుగా గర్భిణీ మహిళలు, పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యాధికారులు ప్రతిరోజు ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. రోజుకు ఎన్ని ఓ.పి. లను చూస్తున్నది, గర్భిణిలకు ప్రత్యేక సేవలు, సాధారణ కాన్పులకు ఏలాంటి చర్యలు తీసుకుంటున్నారని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉండాలని, ఆరోగ్య కేంద్రం ఆవరణంలో పేషంట్ల గదులు శుభ్రంగా ఉండేలా చూడాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ తెలిపారు.ఆరోగ్య కేంద్రంలోని చుట్టుపక్కల ఖాళీ ప్రదేశం, ఆవరణంలో పిచ్చి మొక్కలు, చెత్త లేకుండా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానకు వచ్చే ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించాలన్నారు. సాధారణ ప్రసవాలు జరిగేలా ఆశా సిబ్బంది గ్రామాలలో పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ తదితర సీజనల్ వ్యాధుల వ్యాప్తి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. వ్యాధి లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని, డెంగ్యూ మలేరియా చికెన్ గున్యా కేసులు తప్పనిసరిగా ప్రత్యేక వైద్య అందించేలాగా చూడాలని తెలిపారు.డెంగ్యూ, మల్లేరియా కేసు వచ్చినా పరిసర ప్రాంతాల్లో ఫీవర్ సర్వే నిర్వహించాలని కలెక్టర్ అన్నారు. ఆసుపత్రిలో అవసరమైన మందులు, వ్యాధి నిర్ధారణ కిట్లు అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు. ప్రభుత్వ వైద్య కేంద్రాలపై ప్రజల్లో నమ్మకం పెరగాలంటే సేవల నాణ్యతతో పాటు సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించడం ఎంతో అవసరమని కలెక్టర్ అన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రానికి కావలసిన వైద్య పరికరాలు, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై నివేదికల సమర్పించాలని అధికారులను ఆదేశించారు.కలెక్టర్ తనిఖీ సందర్భంగా వైద్యాధికారులు డా. కృపా ఉషశ్రీ, డా. శ్రీనివాస రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, తిరుమలాయపాలెం మండల ఎంపిడివో సిలార్ సాహెబ్, తహసీల్దార్ విల్సన్, వైద్యధికారులు, ఉన్నారు.

# "ఎవరికి ఓటు వేస్తావని అడగకుండానే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం" ... మంత్రి పొంగులేటి




అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:



తిరుమలాయపాలెం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేదల సంక్షేమంపై ప్రభుత్వ వాగ్దానాలను పునరుద్ఘాటించారు.గ్రామంలోని రెండు చోట్ల రూ.3.30 కోట్ల విలువైన పీఆర్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి, అనంతరం రైతు వేదిక వద్ద నూతన రేషన్ కార్డులు, కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి రాష్ట్రంలోని "ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాం. ఇంకా మూడు విడతల్లో మరిన్ని ఇళ్లు ఇవ్వబోతున్నాం. ఎవరి రాజకీయ అభిప్రాయం ఎలా ఉన్నా, ఎవరికి ఓటు వేస్తారో అడగకుండానే ఇళ్లు ఇస్తాం" అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 15 కొత్త ఐటీఐ కాలేజీలలో ఒకటి తిరుమలాయపాలెంకు కేటాయించామని, 30 పడకల ఆసుపత్రిని 26 కోట్ల రూపాయలతో 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తున్నామని తెలిపారు. తిరుమలాయపాలెం మండల అభివృద్ధికి ఇప్పటివరకు రూ.77.50 కోట్లు కేటాయించినట్టు వెల్లడించారు.ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ కొనసాగుతున్నాయని గుర్తు చేశారు."ధరణి పేదలకు శాపంగా మారింది. దానిని బంగాళాఖాతంలో పడేసి, భూభారతి వ్యవస్థను తెచ్చాం. రెండు సార్లు మాయమాటలతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్‌ను ప్రజలు మూడోసారి చెంపచెల్లుమనిపించారు" అని మంత్రి విమర్శించారు."ఎన్నికల ముందు కేసీఆర్ దోచుకున్నారని మేము చెప్పాం. 15 నెలల విచారణ తర్వాత జస్టిస్ పీసీ ఘోష్ 665 పేజీల తీర్పు ఇచ్చారు. కాళేశ్వరం అవకతవకలు అందులో రుజువయ్యాయి. అక్రమంగా దోచుకున్న డబ్బులు మళ్లీ ఖర్చు పెట్టడానికి మీ దగ్గరకు వస్తారు. ఆ డబ్బు తీసుకుని బీఆర్ఎస్‌కు రెండు చెంపలు చెల్లుమనిపించాలి" అని పిలుపునిచ్చారు.రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని, ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎవరూ అభద్రతకు గురికావద్దని భరోసా ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో ప్రజల దీవెనలు ఇందిరమ్మ ప్రభుత్వానికి లభించాలని కోరుతూ తన ప్రసంగాన్ని ముగించారు.

# ఏ ఎమ్ ఆర్ పి కాలువల ద్వారా నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం వారబంది



అక్షర కలం/ ప్రతినిధి:

ఏ ఎంఆర్పి కాలువల ద్వారా సాగునీరు అందించే విషయమై మంగళవారం ఆమె తన క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏ ఎం ఆర్ పి కాలువలకు సాగునీరందించే నాలుగు మోటర్లకు గాను ఒక మోటారు రిపేరీలో ఉండటం, మూడవ మోటారు ట్రిప్ కావడం వల్ల పూర్తి స్థాయిలో నీరు రావడం లేదని, ముఖ్యంగా ఉదయ సముద్రం నుండి 100 క్యూసెక్కుల నీరు తక్కువగా వస్తున్నదని తెలిపారు.అయితే మోటారు మరమ్మతుకు ఒక రోజు సమయం పట్టే అవకాశం ఉన్నందున సాగు నీటి సమస్య ఉత్పన్నం కాకుండా ఉదయ సముద్రం నుండి 50 క్యూసెక్కుల నీటిని కుషన్ పెంచి విడుదల చేయడం జరుగుతున్నదని ,అదనంగా ఒకరోజు ఇలాగే కొనసాగించాలని చెప్పారు. ప్రస్తుతం ఆయకట్టుకు మాత్రమే సాగునీటిని అందించడం జరుగుతుందని, ప్రస్తుత పరిస్థితులలో చెరువులకు ఎట్టి పరిస్థితుల్లో నీరు ఇవ్వలేమని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా నిర్దేశించిన నాలుగు నెలల సమయం వరకు ఎట్టి పరిస్థితులలో చెరువులను నింపడం జరగదని కలెక్టర్ తెలిపారు. నాలుగు మోటర్లు పూర్తిస్థాయిలో పనిచేసి అనుకున్న మేర సాగునీరు వచ్చిన సమయంలో చెరువులను నింపడం జరుగుతుందని స్పష్టం చేశారు. నాలుగో మోటారు మరమ్మతు తర్వాత బుధవారం నుండి పనిచేస్తుందని, అప్పుడు పూర్తిస్థాయిలో సాగునీటిని అందించడం జరుగుతుందని తెలిపారు. నాలుగు మోటర్లు పూర్తిస్థాయిలో పనిచేసిన తర్వాత ముందే నిర్దేశించిన ప్రకారం ఆయా డిస్ట్రిబ్యూటరీల ద్వారా నిరంతరం సాగు నీటిని ఎలాంటి అవరోధం లేకుండా ఒక ప్రణాళిక ప్రకారం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. కాగా ఏ ఎం ఆర్ పి హెచ్ ఎల్ సి,ఎల్ ఎల్ సి ల ద్వారా సాగు నీరు అందించేందుకు షెడ్యూల్ రూపొందించడం జరిగిందని, గత నెల 28 నుండి నవంబర్ 24 వరకు కాలువల ద్వారా సాగునీటిని ఇచ్చేలా షెడ్యూల్ రూపొందించినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నెహ్రూ నాయక్, ప్రభు కళ్యాణ్, డిప్యూటీఎక్జిక్యూటివ్ ఇంజనీర్ ఆంజనేయస్వామి, తదితరులు ఉన్నారు.

# భూ భారతి అర్జీలను క్షేత్ర స్థాయి లో పరిశీలించి భూ సమస్యలను పరిష్కరించాలి..... జిల్లా అదనపు పి. రాంబాబు



( అక్షర కలం/ ప్రతినిధి):

భూ భారతి అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి భూ సమస్యను పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి. రాంబాబు అన్నారు. మంగళవారం సూర్యాపేట మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ భూభారతి అర్జీలపై అధికారుల బృందాలు గ్రామాల వారీగా క్షేత్రస్థాయిలో పరిశీలించి భూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని, అర్హులకు నూతన రేషన్ కార్డును కూడ త్వరగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భూ భారతి రెవిన్యూ సదస్సుల ద్వారా 1758 అర్జీలు వచ్చాయని 369 అర్జీలను ఎంక్వయిరీ చేయనైనదని వాటిలో 34 అర్జీలను పరిష్కరించడం జరిగిందని మిగిలిన వివిధ దశలో ఉన్నాయని అదనపు కలెక్టర్ కి వివరించారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్ సి. హెచ్. కృష్ణయ్య, డి టి లావణ్య, సీనియర్ అసిస్టెంట్ కపిల్, అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# "ఎర్రబోడులో" ఘనంగా అదివాసి దినోత్సవం

### అణగదొక్కపడుతున్న ఆదివాసీలు

### కార్పోరేట్ సంస్థలకోసం గిరిజన చట్టాలు మార్పు -

### గిరిజన సంఘం జిల్లా నేత వజ్జా రామారావు...



అక్షర కలం/ కారేపల్లి:

కారేపల్లి : అడవిని నమ్ముకోని జీవిస్తున్న ఆదివాసీలను పాలకులు అణగదొక్కుతున్నారని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు వజ్జా రామారావు విమర్శించారు. మంగళవారం కారేపల్లి మండలం ఎర్రబోడులో అదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గూడెలలో అభివృద్ధికి దూరంగానే ఉంటున్నాయన్నారు. ఎస్టీ,ఎస్టీ సబ్ ప్లాన్ ఉన్నా ఆ నిధులు పక్కదారి పడుతుండటంతో గిరిజన ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోవటం లేదన్నారు. అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయకుండా పారెస్టు అధికారులు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అటవీ హక్కుచట్టంలో మార్పులు చేస్తూ అడవి నియమాలను తీసుకవస్తుందన్నారు.దీంతో అదివాసీలను అడవుల నుండి తరిమివేసి కార్పొరేట్ సంస్థలకు అటవీ సంపదను కట్టపెట్టాలని కుయుక్తులు పన్నుతుందన్నారు. ఖమ్మం జిల్లాలో ఐటీడీఏ లేక పోవటంతో ఈ ప్రాంత గిరిజనులు సంక్షేమ పథకాలకు దూరం అవుతున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసి గిరిజన దినోత్సవం సందర్భంగా హక్కుల దినంగా ప్రతి గిరిజన గ్రామంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కుర్సం భద్రకాళి, వజ్జా సామ్రాజ్యం, చరప ఈశ్వరి, వజ్జా అనంతమ్మ, వజ్జా లక్ష్మి, రత్నకుమారి, ర%ఝ%్షస్సీ, చరప సుశీల, వజ్జా లలిత తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి...

### శాంతియుతంగా ధర్నా చేస్తున్న టీచర్లకు మద్దతు తెలిపిన బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్చార్జ్ బడే నాగజ్యోతి ...

ములుగు జిల్లా ప్రతినిధి( అక్షర కలం ) ఆగస్టు 5 :

సిపిఎస్ ను రద్దుచేసి ఓ పి ఎస్ ను పునర్దించాలని ములుగు నియోజకవర్గ ఇంచార్జి బడే నాగజ్యోతి గారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలోని పాఠశాల ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారం కై ధర్నా చేస్తుండగా వారి మద్దతుగా ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బడే నాగ జ్యోతి మాట్లాడుతూ జీవో నెంబర్ 25 ను సవరించాలని, ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరూ ఉపాధ్యాయులు ఉండాలని, సబ్జెక్టు వర్క్ లోడు అనుగుణంగా టీచర్ పోస్టులకు కేటాయించాలని ఆమె కోరారు, ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు షెడ్యూల్ను తక్షణమే విడుదల చేయాలని, అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు, జీవో 317 కారణంగా స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులను వారి స్థానాలకు బదిలీ చేయాలని, అర్హత లేని ఆరోపణలున్న డిఈఓ లను తొలగించాలని, దీర్ఘకాలంగా ఒకే జిల్లాలో ఉన్న వారిని కూడా బదులు చేయాలని ఆమె కోరారు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులను పట్టించుకునే పాపాన పోలేదని ఆమె పేర్కొన్నారు, ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలకైన కనీసం అమలు చేయాలని కోరిన కూడా పట్టించుకోవడం ఉపాధ్యాయులు ఆవేదన పొందుతున్నారని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, పోరిక గోవింద్ నాయక్, ములుగు మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేష్ రెడ్డి, వేములపల్లి బిక్షపతి,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుతోట చంద్రమౌళి, గండి కుమార్, రామసహాయం శ్రీనివాస్ రెడ్డి, పోరిక విజయ్ రామ్ నాయక్, చెన్న విజయ్, తదితరులు పాల్గొన్నారు.



# ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఆవరణలో ప్లాంటేషన్ త్వరితగతిన పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

అక్షర కలం /భద్రాద్రి కొత్తగూడెం:

ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఆవరణలో ప్లాంటేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టర్ స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఆవరణలో జరుగుతున్న చెట్లు తొలగింపు మరియు పరిసరాల క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూనివర్సిటీ ఆవరణలో నిర్మించబోవు భవనాల, కంప్యూటర్ ల్యాబ్లు, తరగతి గదులు వాటికి అనుగుణంగా ప్రదేశాన్ని చదును చేయాలని సూచించారు. యూనివర్సిటీ ఆవరణలో ఖాళీ ప్రదేశంలో విస్తృతంగా ప్లాంటేషన్ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించే పనస, టెకోమో, తెల్ల గన్నేరు మరియు మందారం మొక్కలను విస్తృతంగా నాటాలని ఆదేశించారు. యూనివర్సిటీ ఆవరణ అంతా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట పాల్వంచ మునిసిపల్ కమిషనర్ సుజాత, మరియు ఇంజనీరింగ్ సిబ్బంది, యూనివర్సిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కోదాడ మున్సిపాల్టీలో మెరుగైన సేవలు...

అక్షర కలం /ప్రతినిధి :

కోదాడ మున్సిపాల్టీలో ప్రజలకి మెరుగైన సేవలు అందించేందుకు 258 కోట్లతో డ్రైనేజి నిర్మిస్తున్నామని మంత్రి అన్నారు. పబ్లిక్ హెల్త్ ఎస్ ఈ వెంకటేశ్వర్లు మంత్రికి వివరిస్తూ అమృత్ 2.0 లో భాగంగా కోదాడ కి 25.8 కోట్లు, నేరేడుచర్ల కి 11 కోట్లు, ఎస్ బి ఎం 2.0 లో భాగంగా కోదాడ కి 25.8 కోట్లు,హుజూర్నగర్ కి 27.65 కోట్లు, నేరేడు చర్ల కి 21.10 కోట్లు మంజూరు అయ్యాయని టి యు ఎఫ్ ఐ డి సి లో భాగంగా కోదాడ కి 38 కోట్లు, హుజర్నగర్ కి 3 కోట్లు, నేరేడు చర్లకి 15 కోట్లు మంజూరు అయ్యాయని పనులు పురోగతి లో ఉన్నాయని అలాగే వైకుంఠదామాలు కోదాడలో 2,హుజూర్నగర్ లో 1,నేరేడుచర్ల లో 1 నిర్మిస్తున్నామని, మూడు మున్సిపాలటిలలో దోబీ ఘాట్ లు అలాగే కోదాడ పెద్ద చెరువు ని 3.146 కోట్లతో, హుజూర్నగర్ ఊర చెరువు 2.58 కోట్లతో, నేరేడు చర్ల చెరువును 3.146 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఈ పనులన్నీ వేగ వంతంగా నాణ్యతగా పూర్తి చేయాలని ఆదేశించారు.

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష సమావేశం.....



**అక్షర కలం/ ప్రతినిధి :**

రెడ్లకుంట లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 4460 ఎకరాలకు 47.64 కోట్ల రూపాయలతో పాలేరు వాగు పై నిర్మించటం జరుగుతుందని తెలిపారు.రాజీవ్ శాంతి నగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ని 54.03 కోట్ల రూపాయలతో 5000 ఎకరాలకి పాలేరు వాగు ద్వారా అందించటం జరుగుతుందని తెలిపారు.%=%9 లిఫ్ట్ ఇరిగేషన్ మునగాల, నడిగూడెం మండలాలకి చెందిన 3500 ఎకరాలకి 8.45 కోట్లతో నిర్మించటం జరుగుతుందని అన్నారు.మోతే లిఫ్ట్ ఇరిగేషన్ ని 244 కోట్ల రూపాయలతో 45,736 ఎకరాలకి 4.5 టి ఎం సి ల నీరు సరఫరా చేయటం జరుగుతుందని తెలిపారు.పులిచింతల వెనుక జలాలు ని ఉపయోగించుకొని ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం మఠంపల్లి, మేళ్లచెరువు, చింతలపాలెం మండలాల్లో 1450 కోట్ల రూపాయలతో 53000 ఎకరాలకి నీరు అందించటం జరుగుతుందని ఇప్పటికే 188.32 ఎకరాలకి భూ సేకరణ చేసి నష్ట పరిహారం అందించటం జరిగిందని జూలై 2026 నాటికి పూర్తి చేయాలని, పైపుల నిర్మాణం లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్ ని ఆదేశించారు.పాలకీడు మండలం లో జవహర్ జానపహాడ్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 10,000 ఎకరాలకి 302.20 కోట్లతో డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.కోమటికుంట, గుండ్లపహాడ్ చెరువులకి నీరు వచ్చేలా కాలువ ఏర్పాటు కి పరిశీలించాలని అధికారులకి సూచించారుబెట్టే తండా లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2041 ఎకరాలకి 26.02 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్నామని జానపాడు, బెట్టే తండా లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణం పూర్తి ఐతే శాశ్వతంగా నీరు అందించి పాలకీడు మండలం సస్యశ్యామలం అవుతుందని అన్నారు.నక్కగూడెం లిఫ్ట్ ఇరిగేషన్ 3200 ఎకరాలకి నీరు అందించేందుకు 31 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్నామని డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.పులి చింతల ద్వారా విద్యుత్ తయారీ చేసిన నీటి ద్వారా రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మేళ్లచెర్వు, కోదాడ, చిలుకూరు, చింతలపాలెం మండలాలకి చెందిన 14100 ఎకరాలకు 320 కోట్ల తో నిర్మించటం జరుగుతుందని తెలిపారు.మహంకాళిగూడెం, మంచ్య తండా ఎత్తి పోతల పథకాలకి మరమ్మతులు చేపించాలని అధికారులని ఆదేశించారు.బూరుగడ్డ చెరువు సర్వే చేసి కబ్జాలో ఉన్న వారిని తొలగించి సరిహద్దులు గుర్తించాలని తెలిపారు.తక్కువ ఖర్చు తో ఎక్కువ ఆయకట్టు సాగులోకి తెచ్చేందుకు స్మాల్, మీడియం లిఫ్ట్ ఇరిగేషన్ లు నిర్మిస్తున్నామని రైతుల నుండి సేకరించిన భూములకి నష్ట పరిహారం ఇస్తామని ,పైపులు భూమి లోపటి నుంచి వేసి పైన సాగు చేసుకోవచ్చు అని భూ సేకరణ విషయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు రైతులను ఒప్పించాలని ఆదేశించారు.కోదాడ, హుజుర్ నగర్ లలో ఆధునికరణ బస్టాండ్ లకి పంద్రాగస్ట్ రోజున శంకుస్థాపన....కోదాడ బస్ స్టాండ్ ని ఆధునికరణ బస్ స్టాండ్ గా నిర్మించుటకి 16.89 కోట్లు, హుజూర్ నగర్ నందు బస్ స్టాండ్ కొరకు 3.52 కోట్లతో మంజూరు చేశామని పంద్రాగస్ట్ రోజు కోదాడ, హుజూర్ నగర్ ఆధునికరణ బస్ స్టాండ్లకి శంకుస్థాపన చేస్తామని అధికారులు ఏర్పాటు చేయాలని 6 నెలల లోపు పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రయాణికులకి మెరుగైన సౌకర్యాలు అందిస్తూ,పార్కింగ్, కాంటీన్, ఏ సి వెయిటింగ్ హాల్, పిడింగ్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజి ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకి ఆదేశించారు.గరిడేపల్లి, నేరేడు చర్ల, మేళ్లచెరువు బస్టాండ్ లలో పరి శుభ్రం చేసి టాయిలెట్స్ నిర్మించాలని కోదాడ– జానపాడు వయా మఠంపల్లి, నేరేడుచర్ల నుండి జానపాడు, చెన్నాయి పాలెం,యాత వాకిళ్ల, గానుగబండ, మోతే మండలం సిరికొండ లకి, కాపుగల్లు, యర్రవరం బస్సు ఏర్పాటు చేయాలని కాలేజీ విద్యార్థులు, బస్సు లు ఇబ్బంది పడుతున్నారని పలువురు సూచించగా మంత్రి కోదాడ డిపో కి ఎక్కువ బస్ లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.గడ్డిపల్లి, చిలుకూరు యంగ్ ఇండియా రెసిడెన్సీ యల్ పాఠశాలకి రోడ్లకి అధిక ప్రాధాన్యతనిస్తూ పూర్తి చేయాలి.... హుజుర్నగర్ నియోజకవర్గం లో 315.10 కోట్లతో 16 రోడ్ల పనులు 407.4 కి మి లు నిర్మిస్తున్నామని, 46.70 కోట్లతో 6 బ్రిడ్జి లు నిర్మిస్తున్నామని,హుజూర్ నగర్ లో 8 కోట్లతో ఆర్ %డ% బి గెస్ట్ హౌజ్ నిర్మిస్తున్నామని,డి ఎం ఎఫ్ టి 20.44 కోట్లతో 10 రకాల పనులు నిర్మిస్తున్నామని, పాలకీడు, చింతలపాలెం లో ప్రభుత్వ కార్యాలయాలు అలాగే కోదాడ నియోజకవర్గం లో 228.40 కోట్లతో 14 రోడ్ల పనులు 272 కి మి లు నిర్మిస్తున్నామని, 8 కోట్లతో మునగాల కొక్కిరేని బ్రిడ్జి నిర్మిస్తున్నామని,అనంతగిరి లో 43 కోట్లతో 3 బిల్డింగ్స్ నిర్మిస్తున్నామని,డి ఎం ఎఫ్ టి 6 పనులును 12.97 కోట్లతో నిర్మిస్తున్నామని, కమ్యూనిటీ హాల్స్ నిర్మిస్తున్నామని ఎస్ ఈ సీతారామయ్యఎస్ ఈ సీతారామయ్య వివరించారు.గడ్డిపల్లి, చిలుకూరు యంగ్ ఇండియా రెసిడెన్సీ యల్ పాఠశాలకి రోడ్లకి అధిక ప్రాధాన్యతనిస్తూ పూర్తి చేస్తేనే పాఠశాల పనులు వేగంగా పూర్తి చేయుటకి అవకాశం ఉంటుందనిఅలాగే సాల్టర్జాంగ్ పేటలో ఈద్గా, కమ్యూనిటీ హాల్ త్వరగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

# డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు ప్రొసిడింగ్ ఆర్డర్స్ వెంటనే ఇవ్వాలి

## మంత్రి పేదల పట్ల తమ చిత్తశుద్ధిని చాటుకోవాలి...



**నల్లగొండ: (అక్షర కలం ప్రతినిధి):**

స్వాతంత్ర దినోత్సవం ఆగస్టు 15 సందర్భంగా నల్గొండ పట్టణంలో లాటరీ ద్వారా ఎంపికైన డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు ప్రోసిడింగ్ ఆర్డర్స్ ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు మంగళవారం సిపిఎం డబల్ బెడ్ రూమ్ సాధన పోరాట కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి ఏవో మోతిలాల్ కు వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ 2017 లో కలెక్టర్ ఆఫీస్ వెనుక భాగంలో 552 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం ప్రారంభించారని అన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు వివిధ కార్యాలయాల ముందు అనేక ఆందోళనలు చేసిన తదుపరి 2023 మార్చిలో నల్గొండ పట్టణంలో దరఖాస్తులు స్వీకరించగా 10 వేల దరఖాస్తులు వచ్చాయని అందులో నుండి పలువురు అధికారులు పరిశీలించి మూడు వేల మందిని అర్హులుగా గుర్తించారని గుర్తు చేశారు. పట్టణంలో పలు వార్డులలో ఫంక్షన్ హాల్లో సీసీ కెమెరాలు నిఘాలో లాటరీ ద్వారా 552 మంది లబ్ధిదారులను గుర్తించారని అన్నారు. అర్హులను గుర్తించి రెండు సంవత్సరాలు దాటిన గత టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు అయినా కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లు స్వాధీనపరచకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ సిపిఎం రిలే నిరాహార దీక్షలు, తహసిల్దార్ కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నాలు నిర్వహించగా లాటరీ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు స్వాధీనం చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు. మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయకుండా నత్తనడగా నడుస్తున్న విధానాన్ని ఖండిస్తున్నామని అన్నారు. గౌరవ మంత్రి క్యాంపు కార్యాలయం కోట్లాది రూపాయలు పెట్టి ఆరు నెలల్లో పూర్తిచేసిన చిత్తశుద్ధి పేదల ఇండ్ల నిర్మాణం పై లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఆగస్టు 15న లాటరీ ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు ప్రోసిడింగ్ ఆర్డర్స్ ఇచ్చి మిగిలిపోయిన మౌలిక సదుపాయాలను త్వరితగతిన పూర్తి చేసి వారికి స్వాధీనపరిచి పేదల పట్ల చిత్తశుద్ధిని చాటుకోవాలని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాశం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల దగ్గర మౌలిక సదుపాయాలు పూర్తి చేసి పేదలకు స్వాధీర పరచకపోవడం విచారకరమని అన్నారు. ఆగస్టు 15 నాటికి ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇవ్వని ఎడల ఆగస్టు 16 తర్వాత లాటరీ ద్వారా ఎంపికైన లబ్ధిదారులతో కలిసి ఆక్రమింప చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి సలీం, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, తిప్పర్తి మండల కార్యదర్శి మన్నెం బిక్షం, పట్టణ కమిటీ సభ్యులు తుమ్మల పద్మ, కోట్ల అశోక్ రెడ్డి, దండెంపల్లి సరోజ, గాదె నరసింహ, డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పోరాట సాధనా కమిటీ కన్వీనర్ అవుట రవీందర్, కమిటీ గంజి రాజేష్, కీసర ప్రశాంతి, సిరాజుద్దీన్, పగిళ్ల జయమ్మ, వెంకటమ్మ, గౌసియా, విజయలక్ష్మి ,రజిని, ఝాన్సీ, యాదమ్మ, రవి, చెన్నకేశవులు పాల్గొన్నారు.

# కబ్జాకు గురైన చెరువులను సర్వే చేసి హద్దులను ఫిక్స్ చేయాలని ఆర్డీవోకు ఆదేశం...

**గత ప్రభుత్వం మిషన్ కాకతీయ అని చెప్పి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసింది**

**కాంట్రాక్టర్లు తూతూ మంత్రంగా పనిచేసే వేల కోట్ల రూపాయలు దోచుకున్నారు**

**గ్రౌండ్ లెవెల్ లో మిషన్ కాకతీయ పనులు సక్సెస్ కాలేదు**

**చెరువుల పునర్నిర్మాణంలో అందరూ భాగస్వామ్యం కావాలి.**

**చెరువులను అభివృద్ధి చేసుకునే బాధ్యత గ్రామస్తులకు అప్పగిస్తాం**

**మార్నింగ్ వాక్ లో చెరువుల పరిశీలనలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి.**

**అక్షర కలం /ప్రతినిధి:**



నీరు సకల కోటి ప్రాణాలకు జీవనాధారమని మనిషి జీవన విధానం చెరువుల చుట్టూ అల్లుకుని ఉందని అన్నారు గౌరవ మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గారు... ఈరోజు ఉదయం మునుగోడు మండలంలోని సోలిపురం లో సమస్యలు తెలుసుకోవడానికి మార్నింగ్ వాక్ చేశారు... కబ్జాలకు గురైన సోలిపురం చెరువును పరిశీలించారు.. మునుగోడు నియోజకవర్గంలో వర్షపు నీటి పైన ఆధారపడి రైతాంగం వ్యవసాయం చేసుకుంటారని, వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెంచుకోవడానికి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న చెరువులను అభివృద్ధి చేసుకోవలసి ఉందన్నారు... గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పేరు మీద వేల కోట్ల రూపాయల ఖర్చు పెట్టినప్పటికీ కాంట్రాక్టర్లు తూతు మంత్రంగా పైపైనే పనులు చేసి వెలకోట రూపాయలు దండుకున్నారని, గ్రౌండ్ లెవెల్ లో మిషన్ కాకతీయ పనులు సక్సెస్ కాలేదన్నారు... ప్రతి చినుకుని ఒడిసి పట్టుకొని చెరువులు నిండేలా చేసుకుంటే నిండిన చెరువు ద్వారా మూడు నాలుగు సంవత్సరాల వరకు వ్యవసాయం చేసుకోవచ్చని, చెరువులు నిండుగా ఉండటం వల్ల భూగర్భ జలాలు కూడా పెరుగుతాయని అన్నారు... కబ్జాకు గురైన చెరువు భూములను సర్వే చేయించి హద్దులు నిర్ణయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు... మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా చెరువుల పునర్నిర్మాణంలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు... చెరువులను అభివృద్ధి చేసుకునే బాధ్యత గ్రామస్తులకే అప్పగిస్తామని చెరువుల పూడిక మట్టి తీయడం కట్టను పటిష్టం చేయడం అలుగుల మరమ్మత్తులు చేయడం వల్ల వ్యవసాయానికి దన్నుగా ఉంటుందన్నారు... పూడిక మట్టిని రైతులు తీసుకెళ్లి తమ పొలాలలో చల్లుకునే విధంగా అనుమతులు ఇవ్వాలని అధికారులకు చెప్పారు.. మార్నింగ్ వాక్ లో గ్రామంలోని పలు సమస్యలను గౌరవ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా అన్నింటిని విడతల వారీగా పరిష్కరిస్తామన్నారు.. సోలిపురం వాగు పై నిర్మిస్తున్న బ్రిడ్జిని పరిశీలించిన ఆయన గ్రామాల్లోని చిన్నచిన్న సమస్యలకు ప్రతిసారి పోలీస్ స్టేషన్లకు వెళ్ళొద్దని , గ్రామ పెద్దలందరూ కూర్చొని మాట్లాడి సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించుకోవాలని గ్రామస్తులకు సూచించారు... మనం బ్రతకాలి మన చుట్టూ ఉన్న వాళ్ళు కూడా బ్రతకాలని ఆలోచనతో ప్రతి ఒక్కరూ జీవన విధానాన్ని కొనసాగించాలన్నారు.. ప్రతి చిన్న విషయానికి పోలీస్ స్టేషన్లో చుట్టూ తిరగడం వల్ల సమయం ఖర్చు వృధా అవుతుందన్నారు. గ్రామస్తులు అందరూ కలిసికట్టుగా చెరువుల పునర్నిర్మాణ యజ్ఞంలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు.. ఈ పర్యటనలో మునుగోడు మండల నాయకులతోపాటు చండూరు ఆర్డీవో శ్రీదేవి, మునుగోడు ఇన్చార్జి తహసిల్దార్ నరేష్, ఇంచార్జ్ ఎంపీడీవో విజయభాస్కర్, పంచాయతీరాజ్ ఏఈ సతీష్ రెడ్డి, సర్వేయర్ నాగేశ్వరరావు లు పాల్గొన్నారు..

## నూతన రేషన్ కార్డులో పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు .

**అక్షర కలం/ భద్రాచలం:**



భద్రాచలం మండలంలో ఎమ్మార్వో ఆఫీస్ నందు నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు భద్రాచలం మండలంలోని ప్రజలకు నూతనంగా రేషన్ కార్డులు మంజూరైన అర్హులకు ఎమ్మార్వో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో భద్రాచలం డిటి . రాజులు , %=×%. నరసింహారావు, మండల నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు...

### సబ్ కలెక్టర్ ని కలిసిన టీఎన్జీవోస్ నాయకులు

**అక్షర కలం/ భద్రాచలం:**



టిఎన్జీవోస్ జనరల్ సెక్రెటరీ గగ్గూరి బాలకృష్ణ రాష్ట్రకార్యవర్గ సభ్యులు వీరబాబు ఆధ్వర్యంలో నూతనంగా సబ్ కలెక్టర్ ఆఫీస్ నందు అధికార బాధ్యతలు స్వీకరించిన మ్రీనాల్ శ్రేష్ట ఐఏఎస్ ని మర్యాదపూర్వం కలిసి పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భద్రాచలం రామయ్య సన్నిధిలో ఉద్యోగం చేయటం ఎంతో పూర్వజన్మ సుకృతం అని, ప్రథమ ఉద్యోగము సబ్ కలెక్టర్ ఆఫీస్ భద్రాచలం నందు పూర్వం చేసిన అనేకమంది అధికారులు నేడు అనేకమైన ఉన్నత హోదాల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో కొనసాగుతున్నారని తెలుపుతూ...తన అధికారానికి సబ్ కలెక్టర్ గారు వన్నె తీసుకొస్తారని తెలియజేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట %×ూూ% గారు మాట్లాడుతూ, రామయ్య సన్నిధిలో మొదటగా ఉద్యోగం పొందటం ఎంతో సంతోషంగా ఉన్నదని, ఇటు ప్రజలకి అటు ఉద్యోగస్తులకి అందరికీ అందుబాటులో ఉంటూ... భద్రాచలం యొక్క అభివృద్ధికి పాటుపడతానని తెలుపుతూ టిఎన్జీవోస్ ఉద్యోగస్తులకు ధన్యవాదాలు తెలియజేశారు.

# అంగన్వాడి టీచర్స్ మరియు హెల్పర్ లాపై సూపర్వైజర్ బక్కమ్మ వేధింపులు మానుకోవాలి

## భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టు) జిల్లా అధ్యక్షులు షేక్ సుభహాన్

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం : కామేపల్లి అంగన్వాడీ ప్రాజెక్ట్ కు సంబంధించిన తిమ్మరావుపేట సర్కిల్ సూపర్వైజర్ బక్కమ్మ ఆ సర్కిల్ లో పనిచేస్తున్నటువంటి కొంతమంది అంగన్వాడి టీచర్ లు మరియు హెల్పేర్ లా పైన కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని , తక్షణమే తనపై చర్యలు తీసుకోవాలని , ఈరోజు భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టు) ఆధ్వర్యంలో ఆ డిపార్ట్మెంట్ డి డబ్ల్యూ ఓ(%ణఔా%) రాంగోపాల్ రెడ్డి కి వినతి పత్రం ఇవ్వటం జరిగింది . అనంతరం ఈ సందర్భంగా ఐ యఫ్ టి యు జిల్లా అధ్యక్షులు షేక్ సుభహన్ మాట్లాడుతూ అంగన్వాడీ కామేపల్లి ప్రాజెక్ట్,తిమ్మారావుపేట సర్కిల్ కు సూపర్వైజర్ గా ఉన్నటువంటి బక్కమ్మ తను చేయాల్సిన ఉద్యోగ బాధ్యతలు మర్చిపోయరని , కనీసం అంగన్వాడి స్కూల్స్ కూడా సందర్శించడం లేదని , అంగన్వాడి టీచర్ మరియు హెల్పర్స్ కు ఇవ్వాల్సిన కనీస గౌరవం కూడా ఇవ్వకుండా ప్రవర్తిస్తున్నారని , అంగన్వాడి టీచర్లు సూపర్వైజర్ బక్కమ్మకు ఫోన్లు చేసినా లిఫ్ట్ చేయడం లేదని వారన్నారు . అందరినీ సమాన్యాయం చేస్తూ పని చేపించాల్సిన సూపర్వైజర్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సరైన పద్ధతి కాదని అన్నారు . గతంలో ఇదేవిధంగా ప్రవర్తించి ముగ్గురి ఉద్యోగాలు పోవడానికి ప్రధాన కారకురాలని అన్నారు . తన మాటే శాసనం మని తను చెప్పినట్టుగా ఎవరైనా వినాలని , లేనిపక్షంలో తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని వారన్నారు . ఒకరితో నన్ను నేను పోల్చుకోను , ఒకరికి నచ్చినట్లు నేను ఉండను , అనే పదాలను వాడుతున్నారని బక్కమ్మ కు మేము ఒకటే చెప్పదలుచుకున్నాం , ఒక ప్రభుత్వ రంగంలో పనిచేస్తూ మతిభ్రమించి మాట్లాడటం మానుకోవాలని వారికి గుర్తు చేస్తున్నాం అని అన్నారు . అదేవిధంగా ఒక కార్మిక సంఘానికి కొమ్ముకాస్తున్నారని అన్నారు . ఇతర కార్మిక సంఘాల కార్యక్రమాలకు వెళ్లిన వారిని లక్ష్యం చేసుకొని వేధిస్తున్నటువంటి పరిస్థితి ఉందని , ఏమి పని లేకపోయినా మీరు అర్జెంట్గా ప్రాజెక్ట్ ఆఫీసు దగ్గరికి రావాలి , మీ అంతు చూస్తా మీరేం చేస్తున్నారాని , రకరకాల పదాలతో దూషిస్తున్నారని అన్నారు . కార్మిక సంఘంలో పనిచేయాలని కోరిక ఉంటే ప్రత్యక్షంగా ఆ సంఘం పేరుతో పనిచేయాలని బక్కమ్మను వారు హెచ్చరించారు . ఇకనైనా సూపర్వైజర్ బక్కమ్మ వ్యవహారశైలి మార్చుకోకపోతే భవిష్యత్తులో బక్కమ్మ పనితీరును ఎండగడుతూ దశల వారి కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని వారు హెచ్చరించారు . వేధింపులకు గురవుతున్నటువంటి అంగన్వాడీ టీచర్ మరియు హెల్పర్ లకు భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టు) ఎల్లప్పుడు , ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు . ఈ కార్యక్రమంలో ఐ యఫ్ టి యు నాయకులు భాను , గౌని మోహన్ రావ్ , పారిజాతం , శిరోమణి , లక్ష్మి , కళ , పద్మ , ప్రశాంతి పాల్గొన్నారు .



# 33/11 సబ్ స్టేషన్ ని ప్రారంభించిన గౌరవ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి....



నాంపల్లి : అక్షర కలం / ప్రతినిధి:

నాంపల్లి మండలం నర్సింహుల గూడెం గ్రామంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం గారితో కలిసి 33/11 సబ్ స్టేషన్ ని ప్రారంభించిన గౌరవ మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గారు.. నరసింహుల గూడెం చేరుకున్న కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గారికి గిరిజన దుస్తులను తొడిగి స్వాగతం పలికిన గ్రామస్తులు.

# కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయిన రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి..



( అక్షర కలం/ ప్రతినిధి):

భేటీలో పాల్గొన్న ఎంపీలుసురేష్ షెట్కర్,గడ్డం వంశీకృష్ణ, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రఘురామిరెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి.తెలంగాణలో జాతీయ రహదారులు ప్రాజెక్ట్స్ పై ప్రధాన చర్చ,పలు వినతులు ఇచ్చిన మంత్రిహైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి పై ఎల్ బి నగర్ నుండి హయత్ నగర్ వరకు నిర్మిస్తున్న డబుల్ డెక్కర్ కారిడార్ వే కు కేంద్ర సహకారం పై చర్చహైదరాబాద్ అమరావతి మధ్య గ్రీన్ ఫీల్డ్ హై వే నిర్మాణం పైన చర్చతెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీజనల్ రింగ్ రోడ్డు కు సంబంధించి పలు కీలక అంశాలు చర్చించిన మంత్రి..

# విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులకు క్యాష్ రివార్డు



అక్షర కలం/ ఖమ్మం/ ప్రతినిధి

ఉత్సాహంతో పనిచేసే పోలీస్ సిబ్బందిని మరింత ప్రోత్సహిస్తామని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు.ఇటీవల జిల్లాలో గంజాయి వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాల నియంత్రణలో కష్టపడి పనిచేసిన టాస్క్ ఫోర్స్ పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ ఎస్ కె. ఖాసీంఅలీ, కానిస్టేబుల్ వి.గోపి, యం.సతీష్ లను పోలీస్ కమిషనర్ అభినందించి, క్యాష్ రివార్డు అందజేశారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... 33 గంజాయి కేసుల్లో 120 మంది నిందుతులను అరెస్ట్ చేయడంలో,192 కేజీల గంజాయి పట్టుకోవడంలో ఈ సిబ్బంది కీలకంగా వ్యవహరించారని తెలిపారు.ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ.. సమాజరక్షణ కోసం అంకితభావంతో భాధ్యతలు నిర్వహిస్తూ మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ ఏసీపీ సత్యనారాయణ, ఇన్స్పెక్టర్ ఉదయ్ కుమార్, ఎస్సై సురేష్ పాల్గొన్నారు.

## గణేశ్ నవరాత్రుల ఏర్పాట్లకు , మున్సిపల్ కమిషనర్ శ్రీ సయ్యద్ ముసాబ్ అహ్మద్, సమావేశం....

నల్గొండ :(అక్షర కలం ప్రతినిధి ):

గణేశ్ నవరాత్రుల ఏర్పాట్లకు సంబంధించి , నల్లగొండ మున్సిపల్ కమిషనర్ శ్రీ సయ్యద్ ముసాబ్ అహ్మద్ గారు మున్సిపల్ ఇంజినీరింగ్ మరియు పారిశుద్ధ్య శాఖలతో ఒక ప్రాథమిక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖలకు సంబంధించిన అధికారులకు కొన్ని ముఖ్యమైన బాధ్యతలు కేటాయించారు.ఈ నవరాత్రులలో విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రదేశాలలో మరియు నిమజ్జనం చేసే ప్రదేశాలలో ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలనీ అధికారులని ఆదేశించడం జరిగింది ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాములు , డిప్యూటీ ఇఇలు శ్రీ అశోక్, శ్రీధర్ రెడ్డి, కార్తిక్, అసిస్టెంట్ ఇంజనీర్ లు దిలీప్, ప్రవీణ్, ఆసిం బాబా, సానిటేషన్ సూపర్ వైజర్ గడ్డం శ్రీనివాస్ మరియు సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రదీప్ రెడ్డి పాల్గొన్నారు.



# నేర నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్

## అనుమానిత వ్యక్తుల సమాచారం సమీప పోలీస్ స్టేషన్ కు అందించాలి

## జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ..

## సరియైన పత్రాలు లేని 120 మోటర్ సైకిల్స్,పది ఆటోలు, 15 ఆవు దూడలు సీజ్ ..

(అక్షర కలం/ ప్రతినిధి ):





నకిరేకల్ పట్టణ పరిధిలో ఈ రోజు తెల్లవారు జామున నల్లగొండ డీఎస్పీ గారి ఆధ్వర్యంలో 5 మంది సీఐలు 20 యస్.ఐలు %ు+ర్రా% సిబ్బంది 50 మందితో మొత్తం కలిపి 300 మంది పోలీస్ సిబ్బందితో దాదాపు 350 ఇళ్లల్లో సోదాలు నిర్వహించగా సరియైన పత్రాలు లేని మొత్తం 130 వాహనాలు పట్టుబడగా, వీటిలో 120 ద్వి చక్ర వాహనాలు,10 త్రీ చక్ర వాహనాలు,08 మంది అనుమానితులను గుర్తించడం జరిగిందని ఇందులో ఒక ఆస్తి సంబంధిత నేరస్తున్నీ అదుపులో తీసుకోవడం జరిగిందనీ జిల్లా ఎస్పీ గారు తెలిపారు.అలాగే ఇతర దేశాలు నేపాల్ నుంచి వచ్చిన ముగ్గురిని అదుపులోకి తీసుకోవడం జరిగింది వీరిని ఆధారాలను చెక్ చేయడం జరుగుతుందని తెలిపారు.ఒక షెడ్ లో అక్రమంగా ఉంచిన 15 ఆవు దూడలు పట్టుబడి చేయడం జరిగిందనీ వీటిని చట్టప్రకారం గోశాల కు తరలించడం జరుగుతుందని అన్నారు. అలాగే 18 గంజా సేవించినట్లుగా అనుమానితులను అదుపులోకి తీసుకొని వీరందరికీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యంగా ముందస్తు నేర నియంత్రణ చర్యల్లో భాగంగా కమ్యూనిటి కాంటాక్టు లాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని దీనిలో భాగంగా ఈ రోజు నకిరేకల్ పట్టణంలో కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. కాలనీల్లో,ఇంటి ప్రదేశాల్లో అనుమానితంగా ఎవరైనా కనబడితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని కోరారు. కొత్తగా ఇండ్లకు కిరాయిలకు వచ్చే వారి పూర్తి వివరాలు తెలుసుకున్నాకే అద్దెలకు ఇవ్వాలని సూచించారు. నేరరహిత పట్టణంగా తీర్చి దిద్దడంతోపాటు ప్రజలకు శాంతిభద్రతలు కల్పించాలని గంజాయి తదితర మాదకద్రవాలను నిలువరించడం కోసం కృషీ చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో గంజాయిని అరికట్టడం కోసం మూడు దశల్లో కార్యాక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎక్కడైన గంజాయి సేవిస్తున్నట్లు,విక్రయించినట్లు, కానీ రవాణా చేస్తున్నట్లు కానీ తెలిస్తే డయల్ 100 లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. తప్పుడు డాక్యుమెంట్లతో ఉన్నవారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.జిల్లాలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా, నేర నియంత్రణకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ శివరాం రెడ్డి,సీఐలు రాఘవరావు, ఆదిరెడ్డి, కొండల్ రెడ్డి, కరుణాకర్, మహాలక్ష్మయ్య, ఎస్ఐలు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రయి"వేటు" హాస్పిటల్స్ తీరు మారదా!

## సదుపాయం ఉందని ప్రాణాల మీదకు తెస్తున్న పలు హాస్పిటల్స్

## ప్రాణాలు పోతే ఖరీదు కట్టి నిర్వహిస్తున్న పలు ప్రయివేటు వైద్యశాలలు

## అవసరం లేకున్నా..

## అక్కరకు రాని వైద్య పరీక్షలు

## వైద్య పరీక్షల పేర

## నిలువు దోపిడీ

## మెడిసిన్స్ రాసి జేబులు కొల్లగొడుతున్న పలు వైద్యులు

## మరో వైద్యులకు రిఫర్ చేసి మరీ అదనపు వసూళ్లు

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:



ఖమ్మం: ఒకవైపు వాతావరణం లో మార్పులు, మరోవైపు పడిపోతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. ఇదే అదనుగా పలు ప్రయివేటు హాస్పిటల్స్ స్పెషాలిటీ అంటూ ప్రత్యేక వైద్య నిపుణులు వైద్యం అంటూ అందినంత ఫీజులు వడ్డిస్తున్నారని ఆరోపణలు తరచూ వస్తున్నాయి. ఒక సమస్య అని వస్తే అవసరం లేకున్నా అక్కరకు రాని వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. గోటి తో పొయ్యే వాటిని గొడ్డలి వరకు అన్నట్లు సాధారణంగా వచ్చే చిన్న రోగాలకు సైతం అవసరం లేని పరీక్షలు చేసి అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నారు. ప్రత్యేక సదుపాయాలు అంటూ.. అవసరం లేని వైద్య పరీక్షలు చేసి.. డిస్కౌంట్ అంటూ అవసరం లేని ఖర్చులు పెట్టించి మరీ క్యాష్ చేసుకుంటున్నారు. ఒక వైద్యున్ని సంప్రదిస్తే... అవసరం లేని వైద్య పరీక్షలు రాసి.. లేని పోనీ అపోహలను సృష్టించి ప్రత్యేక వైద్య నిపుణులు అంటూ రిఫర్ చేసి మరీ దోచుకుంటున్నారని పేద ప్రజలు వాపోతున్నారు. నేడు పలు ప్రయివేటు హాస్పిటల్స్ వైద్యాన్ని వ్యాపారంగా మారుస్తున్నాయి. వెలకట్టలేని ప్రాణాలకు సైతం వెలకట్టి మరీ పలు ప్రేవేట్ హాస్పిటల్స్ ఎమెర్జెన్సీ సేవలు ఉన్నాయని ప్రాణాపాయం లో ఉన్న ప్రజలను చేర్పించుకుని ప్రజల ప్రాణాలను క్యాష్ చేసుకుంటున్నారు. ఇక అత్యవసర పరిస్థితుల్లో వైద్యశాలను సంప్రదిస్తే ఎమెర్జెన్సీ సర్వీసులు అంటూ ప్రాణాల మీదకు తేవడమే కాక దురదృష్టవశాత్తు రోగి మృతి చెందితే.. ప్రాణాలకు సైతం లెక్కకట్టి మరీ సునాయాసంగా చేతులు దులుపుకుంటున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన వైద్యం అందించాల్సిన పలు హాస్పిటల్స్ రోగి పరిస్తితులు తెలిసినప్పటికీ చేర్పించుకుని విలువైన ప్రాణాలను చితిమేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అత్యవసర వైద్యం నిమిత్తం ఆస్పత్రికి వస్తే అన్నీ ఎమెర్జెన్సీ సేవలని రూ.లక్షలు సంపాదన కోసం ప్రాణాపాయం లో ఉన్న రోగులను ఆస్పత్రికి తరలించగా రోగి పరిస్థితి క్రిటికల్ గా ఉన్నప్పటికీ అదేమీ ఖాతరు చేయకుండా.. ధనార్జనే ధ్యేయంగా ఏర్పాటు చేసుకున్న పలు ప్రయివేటు ఆస్పత్రుల్లో పేషెంట్ పరిస్థితి విషమంగా ఉందని గమనించి కూడా..ఒకవేళ జరగకూడనిది జరిగితే ప్రాణాలకు ఖరీదు కట్టిమరి కొనసాగిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### – ఒక వైద్యున్ని సంప్రదిస్తే... మరో వైద్య నిపుణులకు రిఫర్ చేస్తూ...

చిన్న అనారోగ్యంతో పలువురు వైద్యులను సంప్రదిస్తే అవసరం లేకున్నా.. వైద్య పరీక్షలు రాసి దోచుకోవటమే కాక డిస్కౌంట్ అని చెప్పి మరీ అన్ని వైద్య పరీక్షలు చేయించి ప్రత్యేక వైద్య నిపుణులు సంప్రదించాలని రిఫర్ చేసి కమీషన్ కోసం అదనపు ఆదాయం కోసం రోగుల జేబులు కొల్లగొడుతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇలాంటి వైద్యం వ్యాపారం చేసి ప్రజలను ఆర్థికంగా పీడించే వ్యాపార వైద్యులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ప్రజలు కోరుతున్నారు.

# తోలి విడత దళిత బంధు లబ్ధిదారులకు అందాల్సిన మిగులు ఋణాల పంపిణి పూర్తి :

## రంగారెడ్డి జిల్లా ఎస్సీ కార్పోరేషన్ ఎగిగిటివ్ డైరక్టర్ జొన్నల పద్మావతి.

హైదరాబాద్: ఆగష్టు 5,( అక్షర కలం): రంగారెడ్డి జిల్లా లోని దళిత బంధు పథకం ద్వారా తోలి విడత లో ఋణం మంజురైఅసంపూర్ణంగా పొందిన లబ్దిదారులకు చెందాల్సిన మిగులు ఋణాల పంపిణి పూర్తి చేసినట్లు రంగారెడ్డి జిల్లా ఎస్సీ కార్పోరేషన్ ఎగిగిటివ్ డైరక్టర్ జొన్నల పద్మావతి పేర్కొన్నారు. వివిధ వృత్తుల ఆధారంగా దళిత బంధు ఋణం పొందినపుడు, మంజురైన ఋణంలో కొంత మంది లబ్దిదారులకు 10వేల నుండి ఇరువై వేల వరకు యూనిట్ల పేరిట చేందాల్సిన వారికి సమాచారం ఇచ్చి చెక్కులను అందజేసినట్లు అధికారి తెలిపారు. ఇది కేవలం రంగారెడ్డి జిల్లా లో తోలి విడత దళిత బంధు లబ్దిదారులకు సంబంధించిన సమాచారంగా ప్రతి ఒక్కరు గమనించాలని ఈ.డి. పేర్కొన్నారు.



# బీహార్ ఓటు సవరణపై నిరసనలు పార్లమెంట్ ముందు ఇండియా కూటమి ఆందోళన

న్యూఢిల్లీ,

బీహార్‌లో ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ పలువురు ఇండియా బ్లాక్ నేతలు పార్లమెంటులో నిరసన చేపట్టారు. ఎస్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరుసగా పదవరోజైన మంగళవారం కూడా ప్రతిపక్షాలు నిరసనలు చేపట్టాయి. పార్లమెంట్ మకరద్వారం సమీపంలో చేపట్టిన నిరసనలో వామపక్షాలు, డిఎంకె, టిఎంసి ఎంపిలు సహా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ప్రియాంక గాంధీలు పాల్గొన్నారు. 'మన ఓటు–. మన హక్కు. మన పోరాటం', 'ఎస్ఐఆర్– సైలెంట్ ఇన్విజబుల్ రిగ్గింగ్' అని రాసి వున్న బ్యానర్లు ప్రదర్శించారు. 'స్టాప్ ఎస్ఐఆర్' ప్లకార్డులు, పోస్టర్లను ప్రదర్శించడంతో పాటు– పెద్ద ఎత్తున నినాదాలు చేపట్టారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీహార్‌లో ఓటర్ల ఓటు– హక్కును తొలగించడం లక్ష్యంగా ఇసిఐ కసరత్తు చేపడుతోందని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఎస్ఐఆర్‌పై చర్చ చేపట్టాలంటూ పార్లమెంట్ ఉభయ స భల్లోనూ ప్రతిపక్షాలు ఆందోళన చేపడుతున్న సంగతి తెలిసిందే. అయితే జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్ మరణించడంతో సోమవారం ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టలేదు.

Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955